నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సెప్టెంబరు *1959*

ద్వితీయ వర్ష ప్రారంభ సంచిక

మూల్యం : రూపాయి

నవభారతి కార్యాలయం

గాంధీనగరం * విజయవాడ-2

విషయ సూచిక

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 2 | విజయవాడ * సెప్టెంబరు 1959 | సంచిక 1

తొలిపలుకులు

ఒక యేడాది గడచినది. రెండవయేటి మొదటి సంచికగా యిప్పటికి వెలువరించగలిగినాము. సాహిత్య, సాంస్కృతిక మాసపత్రికను ఉత్తమ తరగతికి చెందిన రీతిలో నడుపబడాలన్న మా ప్రయత్నంలో కొన్ని చిక్కులు కల్గినమాట వాస్తవమని అంగీకరిస్తున్నాము. మా యీ చిక్కులను తొలగించుకొని ద్వితీయ సంవత్సర సంచికలను సక్రమంగా వెలువరించగలమని మా పాఠకులకు, మా రచయితలకు మనవి చేస్తున్నాము.

సాహిత్య, కళా, సాంస్కృతిక తాత్త్విక రంగాలలో మా చేతనైన కృషి చేయడానికి ప్రయత్నంమాత్రం చేస్తున్నాము మేము సర్వజ్ఞులమని చెప్పడానికి నిరాకరిస్తున్నాము తెలుగుభాషలో "నవభారతి" తనకొక గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించుకొనగలిగినదని భావిస్తున్నాము. ఒక యేడాదిలో సాహిత్యపత్రిక చేయగలసేవ బహుకొద్దిగా మాత్రము ఉంటుందని విశ్వసిస్తున్నాము

పత్రికా నిర్వహణలో ఆర్థికమైన యిబ్బందులు కొన్ని సంభవించటంవల్ల సకాలంలో ప్రచురించలేక మా పాఠకులకు, చందాదారులకు ఏజెంట్లకు రచయితలకు కలిగించిన అసౌకర్యానికి క్షమించమని కోరుతున్నాము. భవిష్యత్తులో సాహిత్య ప్రియులందరికి లోగడ కలిగిన అసౌకర్యం కలుగకుండా చూడగలమని వాగ్దానము చేస్తున్నాము

"నవభారతి" రచయితలు, చిత్రకారులు, పాఠకులు, చందాదారులు, ఏజెంట్లు యెప్పటిలా మాతో సహకరించి తెలుగుసాహిత్య పురోభివృద్ధికి తోడ్పడమని కోరుతున్నాము.

పాతక్రొత్తల మేలు కలయికయే సాహితీ వికాసానికి దోహదముచేయును అయితే యిది ఒక అనిర్వచనీయమైన భావరూపంగా కనిపించవచ్చును. రచయిత యీ భావస్ఫూర్తిని అనుభవించి, ఆలోచించి ఒక క్రమరూపంలో ప్రతిబింబాన్ని సృష్టించి కళాప్రపూరితం చేయుటలోనే తనతనానికి ఉన్నతమైన భావుకతను కల్పించి సౌందర్య ప్రభావితం చేయవచ్చును. ఇది యెలా చేయవచ్చును అన్న ప్రశ్న వ్యక్తి ప్రతిభావ్యుత్పత్తి సంపత్తులపై ఆధారపడియున్నది.

అనుశ్రుతంగా యీ వాదోపవాదాలు చర్చనీయాంశాలుగా మాత్రము ఉంటూవచ్చినవి. చర్చావేదికలు వేదికలే. కార్యవిధానాలు కార్యవిధానాలే చర్చావేదికలకు, కార్యవిధానాలకు పొంతనమాత్రం లేదనిచెప్పాలి. ఎవరోఒకరు యెప్పుడో ఒకప్పుడు చర్చావేదికలకు కార్యవిధానాలకు సమన్వయం చేయ సంకల్పించడం జరిగినది అయినా ఫలితాన్నిగురించి యోచనచేస్తే క్రియారహితమని క్రియాసహితమని నిర్ధారణచేసే వాదనసామగ్రి కనిపిస్తున్నది ఇది వాదోపవాదాలతో, తర్కవితర్కాలతో తేల్చుకోవలసిన సమస్యమాత్రంకాదు తమతమ వివేక విజ్ఞానాలపై కళాసౌందర్యతృష్ణలపై, కావ్యకల్పనా చమత్కృతులపై ఆధారపడి ఉన్నది ఇది లోకానుభవము ఇది విజ్ఞానానుభవము

ఈ ప్రకృతిఅంతా రమణీయమైనది ఈ సృష్టిఅంతా విచిత్రమైనది. ఈ ప్రకృతికి యీ సృష్టికి యే అవినాభావ సంబంధము ఉన్నదో ఆ అవినాభావసంబంధమును నిర్వచించుటలోనే కళాత్మకమైనభావం యిమిడిఉన్నది. ఇది యెలా యేర్పడినది, యెందుకు యేర్పడినది, యిందులో యే భావసౌందర్యం గర్భితమై ఉన్నది తరచి నిగ్గుతేల్చి సరిచూచి నిర్ణయించే శక్తిని పొందుట అసామాన్యము. ఈ అసామాన్య శక్తిని అన్వేషించుటలోనే యీ రమణీయమైన ప్రకృతికి, యీ సృష్టిలోనివైచిత్రికి యెడతెగని సంబంధబాంధవ్యాలు కలిగినవని నిరూపించవచ్చును ఈ అసామాన్య ప్రవృత్తికి యీ అన్వేషణ యెందుకో? ఈ అన్వేషణలో యీ యెడతెగని సంబంధ బాంధవ్యమెందుకో? ఈ యెడతెగని సంబంధ బాంధవ్యాలలో యీప్రతి సృష్టిచింతన యెందుకో? దీని పరమరహస్యం తేల్చుకోగలిగిన శక్తిసంపన్నులకు అంతా పరమరమణీయముగానే కనుపించవచ్చును ఎంతవరకు మనకంతా పరమరమణీయముగా కనుపించదో అంతవరకు యీ అన్వేషణ తప్పదు.

పుష్పములో పరిమళము పరివ్యాప్తమై ఉన్నది. ఈ పరిమళ పరివ్యాప్తిత పరిమితమైనది. కాని కలకాలమునుంచీ పుష్పాలు పుష్పిస్తున్నవి పరిమళ పరివ్యాప్తి చెందుతున్నవి. ఇందులో పాతక్రొత్తల మేలుకలయిక యెంతవరకు యేర్పడిఉన్నదో ఊహించుకొని, భావించుకొని ఆత్మగతంగా ఆనందించుకోవలెనేకాని, గిరిగీచి ఇది, యిది అని నిర్ధారణ చేయుట అసామాన్యమేనని అర్థం చేసుకొనడము వివేకోదయానికి ప్రాతిపదిక అయితే, ఫలితము ప్రాపంచికమై బహురసప్రాప్తికి ప్రాణాధారమై లోకసౌభాగ్యానికి మూలకందమై చిత్తసంస్కారానికి శీలం ప్రాప్తించి, చెప్పేదానికి చేసేదానికి భావసమన్వయం కలిగి సమరసభావంతో సర్వులు వర్ధిల్లడానికి తోడ్పడగలదు.

శుభాకాంక్షలు

[నవభారతి ప్రారంభించి సంవత్సరం పూర్తి అయింది. ద్వితీయ సంవత్సర ప్రారంభసంచికగా దీనిని వెలువరిస్తున్నాం. ఈ శుభసమయాన్ని పురస్కరించుకొని శ్రీయుతులు డాక్టర్, నీలం సంజీవరెడ్డి (ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి), సాహిత్యాభిలాషులు, ఆవుల సాంబశివరావు, అడ్వకేటు గారలు పంపిన సందేశాలను ప్రచురిస్తున్నాం.- సం.]

నీలం సంజీవరెడ్డి,
చీఫ్ మినిస్టర్
అంధ్రప్రదేశ్

హైదరాబాదు.
11 జూన్ '59

తెలుగు పత్రికలను నడపడం చాలకష్టం. కాని సాహసించి ఆంధ్రభాషను, కళాసంస్కృతులను పెంపొందించుటకు 'నవభారతి' మాసపత్రికను సంవత్సరంపాటు ప్రచురించడం విశేషం. యీ పత్రికను జయప్రదంగా నడిపిన శ్రీ చదలవాడ పిచ్చయ్య, శ్రీ రాధాకృష్ణరెడ్డిగార్లను ప్రశంశిస్తున్నాను. ఇలాంటి సాహిత్య పత్రికలకు ప్రజల సహకారం యెంతో అవసరం.

ఈ రోజులలో మామూలు కథల పత్రికలు చదివేవారు చాలా హెచ్చుగా వున్నారు. కాని, యిలాంటి సాహిత్య సాంస్కృతిక పత్రికలకు ఎక్కువ ప్రోత్సాహమిచ్చి బాగా నడిచేలా చూడడం అవసరం.

తెలుగులో నడుపబడుతున్న సాహిత్య పత్రికలలో ఉత్తమశ్రేణికి చెందిన యిలాంటి మాసపత్రిక పోషింపబడి నడుపబడటం ఆంధ్రసాహిత్య వికాసానికి చాల ముఖ్యమని భావిస్తున్నాను.

పత్రిక ముద్రణ అందంగాఉంది. అన్నింటా ఔన్నత్యంకలిగి మానసికఆనందం, చిత్తసంస్కారం కలిగిస్తుంది.

నవభారతి, క్రమక్రమాభివృద్ధిచెంది ఉత్తమసాహిత్య సేవ చేస్తుందని ఆశిస్తున్నాను.

(సం) నీలం సంజీవరెడ్డి

అవుల సాంబశివరావు,
అడ్వకేటు

హిమాయత్‌నగర్
హైద్రాబాద్-1
15-6-'59

ప్రజారాజ్యం మనచుట్టూ ఆవరించుకుని ఉన్నది. ప్రజాసామాన్యం పేరుతో, ఆ నెపంతో అన్ని వ్యవహారాలు మనము జరుపుకుంటున్నాము. మానవ జీవితం, మానవ ప్రయత్నంలోని అన్ని విభాగాలలోను యీ ఉద్యమ ప్రాబల్యం ప్రస్ఫుటంగా కనిపిస్తూవుంది. అన్నిటినీ మించి, సాంస్కృతిక రంగంలో,యీ భావం విచ్చలవిడిగా విహరిస్తోంది. కళాసృష్టి ప్రధానంగా ప్రజా సామాన్యంకొరకు జరుగుతూవున్నది ప్రజా సామాన్యపు అంతస్తుకు కళనుదించి, ప్రజను ఏకఉమ్మడిగా పైకి పెంచాలనే కార్యక్రమం బహుసంఖ్యాకులకు నచ్చినట్లుగా తోస్తున్నది.

అట్టి సమయంలో నవభారతి నిర్ణయించుకున్న ఆదర్శం సాహసోపేతమని భావించకతప్పదు. సాంస్కృతికంగా, దాని అంతస్తు, హిమాలయ శిఖరాలను అందుకొన్నది

విజ్ఞానంకోసం అర్రులు చాస్తున్న ప్రజా బాహుళ్యానికి ఉన్నతస్థాయిని సూచించే వెలుగు దివ్వెలాగా నవభారతి మనగలదని, కృషి చేయగలదని ఆశిస్తున్నాను. ఆ ఆశయాన్ని సాధించుకోవాలంటే, నవభారతి నవీనవిజ్ఞానాన్ని, నవ్యమానవరీతులను విస్మరించరాదు. నవభారతికి ఆశయసిద్ధి కలుగుగాక.

(సం) అవుల సాంబశివరావు

యోగదర్శనము

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

౨౪

ఇరువది యయిదు తత్త్వముల కూర్పు ప్రపంచము ఆ తత్త్వము లివి మూల ప్రకృతి ఒకటి మహ దహంకార పంచతన్మాత్రములేడు(1) భూతములు, మనసుతో కలిసి ఇంద్రియములును పదునాఱు(2) పురుషు(3) డొకటి వెరసి ఇరువదియయిదు

ఈ తత్త్వములలో అహంకారతత్త్వము అభిమానాత్మకము కావున ఇంద్రియములకు కారణ మని కనుఁగొనవచ్చును అహంకారము శుద్ధమగు బుద్ధికార్య మనియు తెలిసికొనవచ్చును. ఈ బుద్ధియే అస్మిత-సత్త్వము లేక మహత్తత్త్వము మహత్తత్త్వము మూలప్రకృతికార్యము ఇట్టి మూలప్రకృతి పురుషులతో కలిసి మహాప్రలయానంతరమున మహత్తత్త్వమునకు (లకును) కారణమగును

పురుషుడు శాంతాత్మ, చిద్రూపుడు, విజ్ఞాత ఎఱుగువానికి ఎఱుక లేకపోవుట యనునదుండదు గాన(4) విజ్ఞాత వికారములేనివాడు కాని ప్రపంచమున వికారము కలదు కాన దానికిని ఒక హేతు వుండ వలయును అది ప్రకృతి లేక దృశ్యము దృశ్యముండునేని ద్రష్టయు నుండును ఈ రెండును చీకటి వెలుగుల వలె వేఱు. వీనికి ఆధారాధేయతలు లేవు. దేశకాలాతీతమగు వస్తువుల కాధారాధేయకల్పన మదార్శనికము(5) కాన వీనికి కలయిక యెటులు? ద్రష్టయెడ (విషయి) దృశ్యాధ్యాసయు దృశ్యమునెడ (విషయ) ద్రష్ట్రధ్యాసయు కలుగుటయే యీ కలయిక అధ్యాసచే(6) ద్రష్ట దృశ్యమువలెను దృశ్యము ద్రష్టవలెను కనుపట్టును మన అందఱయు మహదాత్మ

---

(1) మహత్తత్వము ప్రకృతికి వికృతి దాని కహంకారము వికృతి దానికి తన్మాత్ర పంచకము వికృతి. మఱి తన్మాత్రముల కహంకారము ప్రకృతి, దానికి మహత్తత్త్వము ప్రకృతి కావున ఈ యేడింటికిని ప్రకృతి వికృతులని పేరు

(2) ఈ పదునాఱింటికి వికృతు లని పేరు. ఇవి దేనికిని ప్రకృతులు కావు భూతములు హిరణ్యగర్భుని అహంకారమునకును ఇంద్రియము లాయాయి పురుషుల అహంకారమునకును వికృతులు. కాఁగా ఇవి వికారము.

(3) పురుషుడు దేనికిని ప్రకృతిగాని వికృతిగాని కాడు.

(4) —'న హి విజ్ఞాతు ర్విజ్ఞాతే ర్విపరిలోపో విద్యతే'- బృహ.

(5) మాయావాద మిదియే చేసెను-బ్రహ్మములో అవ్యాకృతశక్తిరూపముగా ప్రకృతి కలదు ఈ ప్రకృతి మిథ్యయే అనగా కల్పనయే ఇట్టి బ్రహ్మముగూడ నిర్వికార మగునా? ఈ కల్పనయు ఒకవిధమగు వికారము కాదా? మఱియు ప్రకృతి యన్న అవిద్య [చూ గీతాభాష్య ౧౩-౨౨] అవిద్యయన్న ఒకదానియందు మఱొకదాని జ్ఞానము ఇదియ యధ్యాస లేక యజ్ఞాన మని మాయావాదము జ్ఞాన మున్నచో జ్ఞాతయు జ్ఞేయమును స్మృతి యీ మొదలగునవియు ఉండవలయును 'అమనాః' అని చెప్పబడు శుద్ధ చైతన్యము సం దివి యెటులు కల్పనీయములు?

(6) 'అని త్యా శుచి దుఃఖానాత్మసు నిత్య శుచి సుఖాత్మఖ్యాతి రవిద్యా' [యో ద. ౨-౫] మఱియు-'విపర్యయో మిథ్యాజ్ఞాన మతద్రూప ప్రతిష్ఠమ్' [యో. ద ౧-౮]

సరిగా అట్టిది(7) పురుషునిచే చూడబడిన ప్రకృతికి కలిగిన తొలిబిడ్డ మహదాత్మ ఇదియ అస్మితామాత్రము, లేక శుద్ధబుద్ధి. దాని నుండి అహంకారము. అహంకారము నుండి కరణములు

బద్ధపురుషుల లింగశరీరశక్తిచే (కరణశక్తి) దేహములు ఉద్భవించును. ఈ రీతిగా ఏపురుషుని సృష్టి ఆ పురుషునిదే. ఇది తత్త్వదృష్టిలో ప్రతిపురుషసృష్టి.

ఈ తత్త్వదృష్టిలో అనగా తత్త్వములలో పురుషతత్త్వమే కాని ఈశ్వర తత్త్వములేమి మహాభూతసృష్టియు బ్రహ్మాండ సృష్టియు నెటు లాయె నని శంక కలుగును. అనగా ఎవని అహంకారతత్త్వము-ఎవని మహత్తత్త్వము-ఎవని అంతఃకరణ మీ బ్రహ్మాండమును సృజించుచున్నది? ఈ జగత్కర్త యెవరు?

స్రష్ట

సాస్మితసమాధిలో సిద్ధి పొంది(8) దేహత్యాగమొనరించిన యోగి సంజ్ఞా సంజ్ఞి నామకమగు దేవత్వము అనగా సగుణ బ్రహ్మసారూప్యము గొని మహాప్రళయము దనుక సత్యలోకమున(9)నుండును. ఈతనికి సర్వజ్ఞతయు సర్వాధిష్ఠాతృత్వమును కలుగును ఇట్టి వానిని పూర్వసిద్ధుడని(10) యోగులందురు 'పూర్వము హిరణ్యగర్భుడుండెను అతడు పుట్టి భూతముల కేకమాత్రాధిపతి యాయె' నని శ్రుతి చెప్పును (11) ఈ పూర్వసిద్ధునకు ఈ హిరణ్య గర్భునకు — ఈ జన్యేశ్వరునకు-ఉదితమగు పూర్వైశ్వర్య స్వభావముచే బ్రహ్మాండ మభివ్యక్తమగును. (ధాతా యథాపూర్వ మకల్పయత్-బ్రహ్మ తొల్లిటివలె సృష్టిచేసెను) 'నేను సర్వభూతములయందును ఉన్న వాడను సర్వమునకును అధిష్ఠాతను' అనునది ఐశసంస్కారము ఇట్టి సంస్కారములో భూతములును వానిలో ఈశు నునికియు గలవు కావున ఈక్షాపూర్వక సృష్టియు నిరీక్షా

---

(7) పురుషుని మహత్తత్త్వము లింగము 'చేత నావదివ లింగమ్' అని సాంఖ్యకారిక.

(8) 'వితర్క విచా రాస్మితా నందానుగమాత్ సంప్రజ్ఞాతః' [యో. ద. ౧-౧౭]

(9) 'సత్యలోకే చత్వారో దేవ నికాయా అకృత భవనన్యాసా స్వప్రతిష్ఠా ఉపర్యుపరి స్థితాః ప్రధాన వశినో యావత్సర్గాయుషః తత్రాచ్యుతా స్సవితర్కధ్యానసుఖాః శుద్ధనివాసాః సవిచార ధ్యానసుఖాః సత్యాభా ఆనంద మాత్ర ధ్యానసుఖాః సంజ్ఞా సంజ్ఞినశ్చాస్మితా మాత్రధ్యానసుఖాః' [మూ. యోగ, ద. భాష్య ౩-౨౬]

(10) 'యత్ర కామావసాయిత్వం సత్యసంకల్పతా యథా సంకల్పస్తథా భూతప్రకృతీనా మవస్థానమ్. న చ శక్తోపి పదార్థ విపర్యాసం కరోతి కస్మాత్? అన్యస్య యత్ర కామావసాయినః పూర్వసిద్ధస్య తథా భూతేషు సంకల్పాత్

(11) హిరణ్యగర్భ స్సమవర్త తాగ్రే
భూతస్య జాతః పతి రేక ఆసీత్
స దాధార పృథివీ ముత ద్యామ్.
ఋక్-౧౦-

హిరణ్యం-అత్యుజ్జ్వలమగు జ్ఞానము, గర్భః-అంతస్సారముగా గలవాడు,

పూర్వక సృష్టియు(12) సంగతములు ఇది అలలులేని సముద్రమువంటి సృష్టి. అనగా దీన పురుష కారము లేదు. ఏల యన తొల్లిటి ఐశసంస్కార వశమున సృష్టి ఊర్పులవలె స్వాభావికముగనే జరిగినట్లులు జరిగిపోవును

పూర్వసిద్ధుడు లేక హిరణ్యగర్భు డావిర్భవించె ననగా అతనితోపాటు బ్రహ్మాండ మావిర్భవించె నన్నమాట పురుషుల భోగాపవర్గముల కాతడు ద్వారము ఆతడు మంచి రోజుచూచుకొని ఇదే మొదలుగా విషమమగు నీ సృష్టిని క్రొత్తగా ఆరంభింప లేదు కాని యిపుడు కనబడు ఈ బ్రహ్మాండము ఒక నిర్దిష్టసమయమున ఆవిర్భవించెను దీనికి ముందు ముందుగూడ పాంచభౌతికములగు బ్రహ్మాండములు కడచన్నవి సృష్టి అనాది హిరణ్యగర్భుని ఆవిర్భావములో జీవకోటుల కర్మపరిపాకము లేక పరిణామ మిమిడియున్నది. క్లేశకర్మఫల మగు ఎవరిసంసారము వారిది. సత్త్వపురుషాన్యతా ఖ్యాతి రూపమగు ఎవరి మోక్షము వారిది వీనిలో హిరణ్యగర్భుని చేయి(13) లేదు ఇది అనుమాన సహితమగు ఆగమదృష్టి.

మహాన్ ఆత్మ లేక మహత్తత్త్వము ఆత్మ

అనుభవము ననుసరించి చూచుచో మన అందఱియు మనస్సుల ప్రథమాంకు రము 'నేను నేను' అనునది. అదియే అస్మిత అది అంతట ఇంద్రియములకు తానై వానిలో నొకటియై వానికి వశమై 'నాకు' అది కావలయు, నిది కావలయు ననియు క్రమక్రమముగా నే నిట్టివాడ నట్టివాడ ననియు, నే నింతవాడ నంతవాడ ననియు అనుకొనుటయ కాక అనును ఉద్రిక్తసత్త్వమైన అవ్యక్తము పురుషోపదృష్టమయి నపుడు అది మహత్తత్త్వముగా పరిణమించును 'మహత్తత్త్వము మొదటి కార్యము, అదిమనస్సు' అని సాంఖ్యులు చెప్పుదురు (14) యోగదర్శనమున మహత్తత్త్వము లేక మహదాత్మ యనగా అస్మితామాత్రబోధ. -'సత్తామాత్రమగు మహదాత్మయందు -కేవలాస్మిత యందు-ఉండి అహంకారాదులు షోడశ వికార రూపమగు వృద్ధిని బొం దును, మఱి మహదాత్మయందే లయము చెందును'(15) అని యోగభాష్యము చెప్పును.

---

(12) ఈక్ష-ఇచ్ఛ లేక సంకల్పము.

(13) అటు లున్నటులు చెప్పు పురాణాదులు స్తావకములు. హిరణ్యగర్భుని ఈశ్వరుడను టయు స్తాపకము. ఈశ్వరుఁ డొక్క డనిన నొక్కడే అతడు పురుషవిశేషుడు నిత్యముక్తుడు. ఇతడు ఈ హిరణ్యగర్భుడు ఇంకను బద్ధుడు ఇతనిని జన్యేశ్వరు డని యందురు

(14) 'మహదాఖ్య మాద్యం కార్యం తన్మనః' సాం కా

(15) ఏతే [షడవిశేషాః] సత్తా మాత్ర స్యాత్మనో మహతః ష డ విశేష పరిణామాః యత్త త్పరమవిశేషేభ్యో లింగమాత్రం మహత్తత్త్వం తస్మి న్నేతే సత్తామాత్రే మహ త్యాత్మ న్యవస్థాయ వివృద్ధికాష్ఠా మనుభవన్తి, ప్రతి సంసృజ్యమానాశ్చ తస్మి న్నేవ సత్తామాత్రే మహ త్యాత్మన్యవ స్థాయ యత్త న్నిస్సత్తాసత్తం నిస్స దస న్నిరస దవ్యక్త మలింగం ప్రధానం తత్ ప్రతియన్తి ' [౨-౧౯]

'ఇంద్రియములను మనస్సునందును,మనస్సును జ్ఞానాత్మయందును,జ్ఞానాత్మను మహదాత్మ యందును, (16) మహదాత్మను శాంతాత్మయందును నియమించునది' అను కఠశ్రుతికి ఫలము—'అల్ల నలుసంత తన్నెఱిగి నేనే అల్లంత అని ఎఱుగు(17) ట'ని పంచశిఖాచార్యు లందరు -'అస్మితా సమాపన్నమగు చిత్తము అలలు లేని మహోదధివలె శాంతమును అనంతమును అస్మితా మాత్రమును అగును' అని వ్యాస భాష్యము (18) ఈ దెస పురుషోపదృష్టమగు మహత్తత్త్వము లేక మహదాత్మ జగత్కర్త. ఇతడే ప్రథమజీవుడు

ఇక శ్రుతులను విందము

ఆత్మ-అక్షరుడు-హిరణ్యగర్భుడు

'మొదట ఆత్మ ఒకటియే యుండెను......అది లోకములను సృజింపజూచెను' అని(19) ఐతరేయము. అస్మితాబోధకంబు వేఱ ఆత్మ యుండదు. బ్రహ్మాండసృష్టికిని మున్మొదట ఆత్మ అనగా అస్మితామాత్రము పిదప సంకల్పము వ్యక్తద్రవ్యములలో అనులోమముగా తొట్టతొలుతటిదియు విలోమముగా చిట్టచివరదియు మహదాత్మ ఇదియ శ్రుత్యుక్తమగు ఆత్మ

'మనః ప్రాణాదు లక్షరునుండి పొడమి అక్షరునందే లయ మగు ననియు ఇంతియు కాక అక్షరునుండియే యీబ్రహ్మాండ మావిర్భవించి అక్షరునందే లీనమగు ననియు ముండకము(20) చెప్పును. మహదాత్మ యిట్టిదని వెనుకచూచియుంటిమి ఇక. హిరణ్యగర్భుడు బ్రహ్మాండము సృజించి ధరించు ననియు శ్రుతిచెప్పుటచే ఈ హిరణ్యగర్భరూప పురుషుని మొదటి అస్మిత-మహదాత్మ, అక్షరుడు 'నేను పలువుర గుదును గాక, పుట్టుదును గాక' అని(21) ఆత్మ తలపోసినటులు శ్రుతి వర్ణించుటచే స్రష్టకు మున్మొదట 'నేను' -'అహమ్'- ఉన్నది కావున ఆ 'నేను'- ఆ 'అహమ్'- జగత్ కారణము

---

(16) యచ్ఛే ద్వాఙ్మనసీ ప్రాజ్ఞ స్తద్యచ్ఛేజ్ జ్ఞాన ఆత్మని జ్ఞాన మాత్మని మహతి తద్యచ్ఛే చ్ఛాంత ఆత్మని.

(17) —త మణుమాత్ర మాత్మాన మనువి ద్యాస్మీ త్యేవం తావత్ సంప్రజానీతే'

(18) -'తథా చాస్మితాయాం సమాపన్నం చిత్తం నిస్తరంగ మహోదధికల్పం శాంత మనంత మస్మితామాత్రం భవతి' [౧-౩౬]

(19) 'ఆత్మా వా ఇద మేక ఏవ అగ్ర ఆసీత్ స ఐక్షత లోకా న్ను సృజా ఇతి'

(20) యథా సుదీప్తాత్ పావకా ద్విస్ఫులింగాః
సహస్రశః ప్రభవంతే సరూపాః
తథాఽక్షరాద్ వివిధా స్సోమ్య భావాః
ప్రజాయంతే తత్ర చైవాపి యన్తి [౨-౧]
ఏతస్మా జ్జాయతే ప్రాణో మన స్సర్వేంద్రియాణి చ
ఖం వాయుర్ జ్యోతి రాపః పృథివీ విశ్వస్య ధారిణీ. [౨-౩]

(21) బహు స్యాం ప్రజాయేయ [తై].

అక్షరునుండి మనః ప్రాణాదుల పుట్టుకకదా! కాగా ఈ యక్షరుడు మన అందఱిలోనును కలడనియు మన అందఱకును ఆత్మవిశేష మనియు తెల్లము. ప్రాణాదు లందఱియు కరణములు. అవి మన అస్మిత-లేక-అభిమానము నుండి పొడముసు. ఇటులగుటచే మన అందఱిలో నున్న అక్షరుడు మన మొదటి అస్మిత లేక మహత్తత్త్వము. ఇది మన కరణములన్నిటికిని మూలము.

మహదాత్మ అవ్యక్తమున లయించును అవ్యక్తము పైని చిద్రూపుడగు పురుషుడు. పురుషపద మిచట జాతిపరము కావున ఇతడు (మహదాత్మ) మన అందఱిలోను జీవాత్మగా భాసించువాడును హిరణ్యగర్భునిలో ప్రథమజీవుడుగా భాసించువాడునగు పురుషుడు అసలితడు నిర్గుణుడు, అసంగుడు దీనివలన మన అందఱియు హిరణ్యగర్భునియు మహదాత్మయే శ్రుతియందలి అక్షరపురుషుడు అహంకారాది వికారములతో పోల్చిచూడగా నిత డక్షరుడు ఇంతియకాక నిర్వికార పురుషుని ప్రతిచ్ఛాయ కాన నిత డక్షరుడు. ఇక పరమాక్షరుడో శాంతాత్మ లేక నిర్గుణపురుషుడు అతఁడు -'అక్షరునికంటె చాల పరు డ'ని(22) శ్రుతి చెప్పును ఇతడు -అక్షరుడు- అందఱిలోను హిరణ్యగర్భునిలోను ఉన్న పురుషుడే. అనగా అందరిలోగల మహదాత్మ చిజ్జడగ్రంథ (23). ఇతడు ముక్తేశ్వరుడు కాడు అని గుర్తింపనది.

మహదాత్మ - హిరణ్యగర్భుడు

మహదాత్మ పురుషు లందఱియు చరమ-అస్మిత. కావున మహదాత్మ అసంఖ్యము మహదాత్మలలో నెవరి మహదాత్మ నుండి వారివారి అహంకారము మనస్సు ప్రాణము పొడమును.

హిరణ్యగర్భుని మహదాత్మనుండి- అక్షరునుండి- ఐశసంకల్పము దాన బ్రహ్మాండము పొడమును అత డన్ని రూపములందును ప్రతిరూపము. మఱియు నతడు భూమి మొదలుగా ఎల్ల భూతములకును ఏకమాత్రాంతరాత్మ అంతరాత్మ యనగా లింగశరీరము. హిరణ్యగర్భుని భూతాది (24)యను పేరి యహంకారమున నీ బ్రహ్మాండము నిలిచియున్నది. బండిచక్రపు కుండలో ఆకులున్న చందముగా భూతము లన్నియు అతనిలో నున్నవి- 'ఏకస్తథా సర్వభూతాంతరాత్మా.' ఈభూతములను సృజించినది హిరణ్యగర్భుని అంతరాత్మ లేక అంతఃకరణము అనగా లింగము.

(22) అక్షరాత్ పరతః పరః[ము-౩-౨]

(23) ఉపనిషత్తులలో పలు తావుల నిర్గుణ పురుషపరముగా అక్షరశబ్ద ముపయోగింపబడెను బృహదారణ్యక మీయర్థమున ఎక్కువగా వాడెను. ముండకము ఎవరికిని సందియము కలుగకుండ అక్షరపదమును నిలిపెను. ఇది సగుణపరము. కావుననే ప్రాకృతోపాధి గల ఏపురుషుడేని అక్షరుడు, అక్షరుడే హిరణ్యగర్భుడని శ్రుతియే విశదీకరించెను.

(24) 'సంప్రజ్ఞాతే సోపాధికావస్థాయాం సర్వభూతే ష్వాత్మాన మనుస్యూతం పశ్యతి- 'అహమేవేదమ్; సర్వోఽస్మీత్య' నుభవ తీత్యర్థః' అని భారతమునందలి- సర్వభూతేషు చాత్మానమ్-' అనుదానికి నీలకంఠుని వ్యాఖ్య

ఈబ్రహ్మాండమున రూపరూపముననను ప్రతిరూపముగా పరిణతమయిన 'ఆత్మ' అనగా అంతఃకరణముఒకటియే వేలువేలుప్రాణుల ఆత్మవేలువేలు ఆ యీ హిరణ్యాగర్భు డొకడే-ఏకః. శ్రుతి యిచట నిర్గుణ పురుషజాతిపరముకాదు. రూపురూపునను ప్రతిరూపుగా పరిణతమయిన అంతఃకరణము హిరణ్యాగర్భునిదే. కావున బ్రహ్మాండ మునకు హిరణ్యా గర్భరూపనుగు ఆత్మ ఒకటియే.

హిరణ్యాగర్భుడు జన్యేశ్వరుడగుటచే అనగా పుట్టినవాడగుటచే నితనికి జాత్యా యురోభోగములున్నవి సాస్మితసమాధిసిద్ధి శాంతము సర్వజ్ఞము సర్వగతము సర్వా ధీశము: హిరణ్యాగర్భుడు ఈజ్ఞానముతో పుట్టును జ్ఞానమనగా లింగము లేకకరణశక్తి. లింగము నిరాశ్రయమై ఉండజాలదు కాన హిరణ్యాగర్భునకును ఒక శరీరము ఉండ వలెను సంస్కారము లేదుగాన స్థూలశరీరముఉండదు శ్రుతి యీ హిరణ్యాగర్భుని-మహా దాత్మను పెక్కుచోటుల ప్రాణమని వ్యపదేశించును ప్రాణముశరీరమును నిలువరించు నట్టులు ఇతడు ఈబ్రహ్మాండమును నిలువరించును శ్రుతి యితనినిమనస్సనియు చెప్పును- మనోమయః ప్రాణశరీరనేతా' జ్ఞానబాహుళ్యమిట వివక్షితము కాగా ఇచ్ఛామాత్ర మున వికసించు దివ్యశ్రవణాదికరణశక్తియు సర్వవ్యాపిత్వమునకును సర్వభావాధిష్ఠా తృత్వమునకును ఉపయుక్తమగు ప్రాణశక్తియు 'ఇది యెల్లయు నేనే, నేనే యీ యెల్లయు' అనుఅనుభవరూపమగు జ్ఞానశక్తియుగల ద్రష్టకు ఛాయకాన ద్రష్టవంటి వాడు. సూక్ష్మశరీరమితని కుండును దీనిని సూక్ష్మశరీరమనుటకంటె అస్మితాశరీర మనుటయ క్షేమము దీనికి బ్రహ్మాండాభివ్యక్తిరూపమగు కర్మయు కలదు

మఱియు అందఱిలో నున్న మహాదాత్మయే గ్రహీత లేక జీవుడు(25). ఇతడు నిర్వికారుడగు ద్రష్టకు ఛాయకాన ద్రష్టవంటివాడు. ఇతడు ద్రష్ట కత్యంతము విరూపు డును సరూపుడును కాడని యోగులందురు (26) కాన నితనినిగూడ అజుడనియు అమృతు డనియు నందురు

మఱియు మహాదాత్మ ప్రత్యక్చేతనుడు. ఈశ్వరు డెటులు ధర్మాధర్మరహితుడో అవిద్యాదిస్పర్శహీనుడో జాత్యాయుర్భోగశూన్యుడోబుద్ధి ప్రతిసంవేదియగు పురుషు

---

(25) ఇది ఈశ్వరప్రకృతి అని గీత-జీవభూతా, మాయావాదులును జీవాఖ్యయగు బుద్ధి అని అందురు.

(26) సబుద్ధేర్న సరూపో నాత్యంతం విరూప ఇతి-౨-౨౦. [యో.ద. భాష్య]

డును అట్టి వాడు, అట్టి యీప్రత్యక్ చేతనుని(27)లేక ప్రత్యగాత్ముని సాక్షాత్కార మొదవునని(28)యోగభాష్యము.జీవాత్మ తొలుతశుద్ధమహదాత్మ యనిదీనికి సారము. మనసుతో తాదాత్మ్యము చెందినవాడుజీవాత్మ చెందనివాడు మహదాత్మ, చిన్న అక్షరుడు

మనసుతో తాదాత్మ్యము చెందిన జీవుడు మహదాత్మను తెలిసికొనియో ప్రత్యక్శ్మ మహదాత్మోపలబ్ధి నెనసియో, హిరణ్యగర్భుని ధ్యానించియో మఱి పర మేశ్వర ప్రణిధానమున అంతరాయము లెడసి నిర్బీజసమాధి గొనియో నిర్వికార ద్రష్టకావలయును. అనగా శాంతాత్మ ఇదియ స్వరూపస్థితి'

ఇటులు అనుమానముచేతను ఆగమము చేతను జగత్కర్త ఒకడు సిద్ధించు చున్నాడు పూర్వసిద్ధుడు అక్షరుడు హిరణ్యగర్భుడు ప్రజాపతి బ్రహ్మ సగుణబ్రహ్మ ఈశ్వరుడు మొదలగున వితని నామవిశేషములే.క్లేశకర్మాదు లంటని యీశ్వరుడు నిత్య ముక్తుడు అతడు ఈశ్వరేశ్వరుడు.

హిరణ్యగర్భుడు మహదాత్మను (29)విడనాడి శాంతాత్మతను బడసి ముక్తుడగు నెడల బ్రహ్మాండము లీనమగును. ఈ దెస ముక్తిపదమునకు క్రిందనున్న సగుణ బ్రహ్మ జగత్కర్త

---

(27) ప్రతీపమ్- విపరీతమ్, అంచతి-విజానాతి. ఆత్మకు విపరీతమగు అనాత్మభావము చెందువాడు, అని వాచస్పతి.

(28) యథై వేశ్వరః పురుషః శుద్ధః ప్రసన్నః కేవలో నుపసర్గ స్తథైవాయమపి. బుద్ధేః ప్రతిసంవేదీ యఃపురుష ఇ త్యేవ మధిగచ్ఛతి. [౧-౨౯]

(29) శంకరుల మహాన్ ఆత్మ మహత్తత్త్వము కాదు వారి మతమున మహత్తత్త్వము శ్రౌతముకాదు. మహాయానబౌద్ధుల మహాత్మ అద్వైతులు చెప్పు ఆత్మ- transcendental Self

సవరణ

10వ పేజీలో మూడవపంక్తిలో -నేనే అల్లంత అని ఎఱుగు- అనుదానికి బదులుగా తానే అల్లంత అని ఎఱుగు అని చదువుకొనవలెను.

భామినీ విలాసము

ఆంధ్రీకర్తలు

శతావధానులు. శ్రీ శ్రీనివాస సోదరులు

౧

బురదలేని చెఱువు మురిపంబు లొలికించు
ఖలులు లేని సభయు గణన కెక్కు
కటుకు పలుకు లేని కావ్య మింపులు నింపు
కోర్కె లేని మనసు కోటిసేయు

సరస కావ్య నిగూఢమై వఱలు తత్త్వ
మెవ్వడో కోటి కొక్కడే యెఱుగజాలు
కలికి విరి తేనె తరితీపు విలువ గట్టు
తుమ్మెదకు దప్ప నెవరికా యెమ్మె గలుగు?

ఎంత యాడంబరంబు గావించె నేని
సుగుణములు లేక మనుజుండు శోభ గనడు:
సమధికాపాత రమ్య పుష్పాఢ్య మయ్యు
శాల్మలీ వృక్షమేమి ప్రశస్తి గాంచు?

తానంబులేని రాగము
మానంబున విలువలేని మనుజాధిపుడున్
దానంబులేని హస్తియు
జ్ఞానము లేనట్టి యతియు సములు ధరిత్రిన్.

ఉన్న గుణంబు తనంతన
యెన్నిక గను వారు వీరు నేలా చూపన్?
సన్నుత మృగమద పరిమళ
మున్న దనుచు నొక్కిచెప్ప నొక్కండేలా?

అమృతమ పలుకు, మహార్ణవ
మ మనస్సు, యశంబు పూర్ణిమా శారద శీ
త మరీచియు, సంతతము ప
ర మనోభీష్ట ప్రదాన రసికుల కెందున్.

సకుడ! ఘనమైనకార్యంబు సలిపినావు,
మచ్చ లేనట్టి గురుకీర్తి తెచ్చుకొంటి,
మఱవలేనింక జన్మ జన్మముల కేని,
బ్రతికి యున్నంతవఱకు దీవనల నిత్తు.

రోసి సత్రముపై ఊూలు రువ్వ పనికి
కలుగ బోవరు చతురులు ఖలుల కన్న·
తెరువునకు రాని వారి యుసురుల దీయ
ఘనుల కన్నను గలరె నేర్పరులు ధరణి?

ఎప్పుడు పరోపకారము
తప్పక కావింప నెంచు ధన్యుల పలుకుల్
దెప్పరముగ గనిపించును
తప్పక పనిచేయు నౌషధంబులు వోలెన్.

తేటి కదుపులు కీర్తి గీతికలు పాడ
చాల వినయభరంబున నేల కంట
వంగిన పటంచు దోచు నీ వనము నందు
నున్నతములైన యవనీ రుహోత్కరములు.

మృతుడు కోరుకొనుట, కృపణు డీ నెంచుట,
అసతి మగనిమీద నాస గొనుట
వక్రబుద్ధి చెలిమి, ఫణి శాంతగుణమును
ఎప్పుడైన బ్రహ్మ సృష్టిగలవె?

కోరకయె సుఖంబు కోకొల్లగా నిచ్చు
నెంత వేడికొనిన నేమి యీాడు
అంతబోక యున్న దంత యూాడిచి వైచు
బ్రహ్మ కేమి కట్టుబాటు లేదు!

ఎందొ కొండ కొమ్మునందు జన్మించితి,
కట్టె జాతి, పాపగములు చెలులు,
అట్టులయ్యు గుణమహత్త్వంబుచే గంటి
వుత్తమ ప్రశస్తి నో పటీర!

మలినుడవైన నీ పయ్యిన్ని మానని ప్రేమభరంబు నూనె, నీ
పలుకు నవాకులున్ మఱి చెవాకుల కింతయు నప్రసన్నకా,
దలి! యధరామృతం బొసగు నాత్మ నెఱింగియు నీదు వృత్తమున్,
విలసిత పద్మినీ సతిని వీడగ నీ మనసెట్టు లొప్పెడిన్?

విత్తనము లాకసమ్మున వెదలువెట్టు,
కర్మ చిత్రమ్ము రచియించు గాలిలోన
సలిల తలముల నోలి లేఖలు లిఖించు,
ఖలుని మంచితనమ్మున గాంచునతడు!

గురులగు గిరు లన్నింటను,
ధరణి గురువు గిరుల కంటె, ధారుణి కంటెన్
గురువగు నజాండ, మంతకు
గురువు మహాత్ముడు, లయమునగూడ నచలుడౌ.

లీల హాలాహలంబును గ్రోల గోరు
వేడ్క గాలానలంబు జుంబింప గోరు
ప్రేమ వ్యాలాధిపుని గౌగిలింప గోరు
దుర్జను వశీకరించుకో దొడరు నతడు.

ప్రియ యశస్సౌరభమునకు వెల్లిపాయ
శాంతి శైత్యమునకు మహోజ్వలనమూర్తి
హారి కారుణ్యసుమమున కాకసంబు
దుర్జనుడు సజ్జనానీక దుఃఖదాయి.

ఆత్మ గుణజాలములను శూన్యముల నేని
గుణమయమ్ముల నొనరించి కొమరు గూర్చు,
డాసి వివరము లెల్లను మూసిపెట్టు
సాలెపురుగు విధమ్మున సజ్జనుండు.

వేదాంతమెల్ల నెంతగ
చాదుక త్రాగినను ఖలుడు సజ్జను డగునే?
బొదక చిరవాసమ్మున
నేదీ మైనాకు డెంత మృదుతం గనియెన్?

శ్రీమద్రామాయణ కల్పవృక్షము - శిల్పదృష్టి

సీతాకల్యాణము - ధనుర్భంగానంతరకథ

౪

శివధనుర్భంగమైన తరువాత జనకమహారాజుపొందిన సంతోషము చెప్పనలవికాకపోయెను. కన్నకూతురుకాదు. జన్నము కొఱకు నేలదున్ను చుండగా కనుపించిన కూతురు అయోనిజ ఆమెకనిపించిన వేళావిశేషము చేత మరల తనకడుపు ఫలించినది ఆమెమీదజనకరాజున కెంతమక్కువో! శ్రీరామచంద్రుడు ధనుస్సువిరిచినంతనే, ఆయన బరువంతయు తీఱినట్లు ఒక్కనిట్టూర్పువిడిచెనట! కూతురునకు సంబంధము కుదిరినతరువాత తండ్రిగుండె ఎంతకుదుటపడును! అందులోనీకూతునకు సంబంధము తానింటిపద్ద కూర్చుండెను దానియంతట నదిరావలెయును ఊరకేవచ్చుటగాదు అవచ్చినవాడు శివధనుస్సును విఱువవలయును. ఆసంబంధము కుదురుటయనగా-దైవమనుకూలించుటగాని వేఱుకాదు దైవమనుకూలించెను. ఆతండ్రిగుండె ఎంతసంతోషించి యుండవలయును! ఆయన సంతోషమునకవధిలేదు. దానిని ఈకావ్యమునందు అయిదుపద్యములలో కవివ్రాసెను

ఆయజ్ఞధాత్రికర్షణ
మైయెసఁగిన హృదయ భారమంతయుఁదీరన్
శ్రీయుతుఁడు జనకభూపతి
యాయత నిశ్వాస మొక్కఁడంతటవదలెన్.

ఆయనహృదయభారము 'ఆయజ్ఞధాత్రి కర్షణమై' యెసగినది. ఈసమాసము ఆబాలగోపాలము—ఆసేతుశీతాచలము వంటిది. 'ఆఙ్మర్యాదాభివిధ్యోః'-జన్నకునేలదున్నుట మొదలుగా అనియర్థము అప్పటినుంచిఈహృదయభారమున్నదన్నమాట ఆయనవదలిననిశ్వాసముఆయతము-చాలదీర్ఘమైనది ఈఆయతశబ్దముచేత ఆయనహృదయభార మెంతటిదోతెలియుచున్నది ఈబరువుదిగినతోడనే జనకుడు విశ్వామిత్రునకు నమస్కారముచేసెను రామచంద్రునివంక ఒక్కనిమేషముచూచెను అని తరువాత పద్యములోనున్నది. ఈరెండు పనులెందుకు జరిగెను? ఆయనతన యానందమును పట్టలేకపోయెను. ఆయావేశములో ఈమహోపకారము విశ్వామిత్రునివలన జరిగినదిగదా,-అని పోయి ఆయనకాళ్ళమీదపడెను. లోకములోనిబ్లైజరుగునుగదా! అంత రామచంద్రునివంక ఒక్కనిమేషము చూచెనట! ఎందుకుచూచెను? ధనుస్సు విఱువకముందటి రామచంద్రుడు వేఱు విఱిచినతరువాతి రామచంద్రుడువేఱు ఆయనదశరథరాజుకొడుకు. విశ్వామిత్రుని వెంటవచ్చినవాడే ఆగౌరవము, అపద్ధతివేఱు ఇప్పుడుతనకల్లుడైనాడు. తొలుత నతనిని సామాన్య రాజపుత్రునిగాచూచెను. ఇప్పుడో? తనవానినితాను ప్రశంసించు కొన్నట్లుచూచెను అందగాడేనా? మాసీతకుతగిపోవునా? -ఈదృష్టితోచూచెను. సంతృప్తిపడెను రామచంద్రునిచూచిన తరువాత ఆయనకెంతయో యానందమయ్యెను. అప్పుడుమంత్రులతో నిట్లనెను - అన్నమాటల యొక్కసారాంశ మేమనగా అయోధ్యకు పోయి ఈవార్తచెప్పవలయునట! వెంటనేచెప్పవలయునట! ఆయాజ్ఞయీయవలసినవారెవరు? విశ్వామిత్రుడట! వెంటనే జనకరాజుమనస్సులోనికి వచ్చినవాడు దశరథుడు. ఆదశరథుడు పూర్వము తనయందు నెఱపినగౌరవమంతయు నొక్కసారి మనస్సులోనికివచ్చినది

నేనును బ్రహ్మవేత్తనని నిల్పెను నన్నునుగర్భలేశర
క్షానిధినంట నేనని నిజంబుగ నాయనప్రేమ యా యయో
ధ్యానరనాథు ప్రేమయును నాతనిగౌరవమేమిచెప్పగా
దానునునాకు వియ్యమగుదానికి దానె పునాదివేసెనో.

నాకున్ బ్రాహ్మవిధిన్ సమర్థ్యమును సంధానించెగా దన్ననున్
నాకన్నన్ గడువృద్ధు డెంచగ ధరానాథుండునేనన్నచో
నాకౌతూహలమంత గౌరవముకట్టా! భావిసంబంధ సం
జ్ఞాకంబై హృదయంబుదాచిన యవిస్పష్టోహమే కావలెన్.

దశరథుడుచేసినయజ్ఞమునాడు-అనగానప్పటికిపంద్రెండేండ్లక్రింద (ఇప్పుడురామునకుపంద్రెండేండ్లు) తానుఅయోధ్యకువెళ్ళెను. అప్పుడుదశరథుడు జనకరాజును గౌరవించెను అపుడుదశరథుడు తనయూరుపోవుచున్న జనకునితో నిట్లనెను-ఇవియవతార ఖండములోని పద్యములు

తా నేగుదుననిచెప్పగ
నైనన్ జనకుండువచ్చి యంతర్జ్యోతిః
స్థానమున దృష్టినిలుపుట
తో నిలబడ దశరథుడు తోడ్తోనగుచున్.

యజ్ఞమైపోయినది వచ్చినబంధువులందరు వారిదారినవారు పోవుచుండిరి జనకమహారాజు కూడ 'నేను వెళ్ళెద' ననిచెప్పుటకువచ్చినాడు. వచ్చిదశరథునివద్ద నిలబడినాడు నిలబడినప్పుడు తనదృష్టిని యంతర్జ్యోతి స్థానమున నిలిపినాడు అనగా, సాక్షాత్తుపరమేశ్వరుడు దశరథుని గర్భముననుదయింప వలయునని యాయనసంకల్పమన్నమాట అప్పుడుదశరథుడిట్లనెను, వచ్చినబంధువులెవ్వరినీ దశరథుడు నెలనాళ్ళవరకుపోనియ్యలేదు. అందుచేతనిట్లనుచున్నాడు-

మీరలుబ్రహ్మవేత్తలు క్షమింపుడు నాదెసగర్భలేశర
క్షారధి మిమ్ము నాపితి నుపర్బుధనిత్యుని నేడుపంపెదన్,
మీరలువచ్చి నాతురగమేధము బ్రహ్మపరమ్ముచేసి రం
చారనిబత్తి మెయి వినతులంజలులున్ సలిపెన్ బ్రియమ్మునన్.

దశరథుడన్నమాటలివి మీరుబ్రహ్మవేత్తలు నన్నుక్షమించవలయును మిమ్మినాళ్లుయాపితిని ఎందుకాపితిననగా, మీరిచ్చటనున్నచో నా భార్యలువహించు గర్భములు రక్షింపబడునని నాయుద్దేశ్యము అంతియేగాని వేఱుకాదు. అందుచేత క్షమించవలయును మీరుపర్బుధ నిత్యులు ఉపర్బుధుడనగా, అగ్నిహోత్రుడు. ఉపర్బుధునియందు నిత్యుడు. నిత్యాగ్నిహోత్రుడు, అందుచేత మమ్మాపరాదు నేడుపంపెదన్-నేడుతప్పకుండ పంపింతును మీరువచ్చుట మూలముగా-నాయశ్వమేధము బ్రహ్మపరమైనది ఈమాటలో చాలయర్థమున్నది. జనకుడు బ్రహ్మవేత్తగనుక తనయజ్ఞము బ్రహ్మపరమైనదనుట న్యాయమైనమాటయే. మర్యాదానుకూలమైనమాట వట్టిమార్యాదకాక యందులోయాథార్థ్యము కూడనున్నది.

ఇందులో నింకొకయర్థమున్నది, ప్రధానముగానశ్వమేధయాగము,బ్రహ్మపరమైనయాగము. బృహదారణ్యకోపనిషదాది నీ విషయమువ్యక్తమగును అంతియేకాక, ఇష్టిఖండము మొదట కూడనీసంగతి వ్యక్తముచేయబడినది.దశరథుడు తనసర్వధాత్రియు ఋత్విక్కులకిచ్చి, తాను తపస్సుచేయుటకు పోబోవుచుండెను. వారుబ్రతిమాలియాపిరి. ఇదియశ్వమేధము యొక్క రహస్యము. అదినిజముగా బ్రహ్మపరమైనయజ్ఞము. దానియందికొక యర్థముకూడనున్నది సాక్షాత్పరమేశ్వరుడైన శ్రీరామచంద్రుడు, జనకమహారాజా! నీయనుగ్రహమువలన నాగర్భమం దుదయించబోవుచున్నాడు'-అని దశరథుడనుట స్ఫూర్తిగానున్నది.

ఇదియంతయు జనకునకు రామచంద్రుని చూచినంత నేజ్ఞాపకమునకువచ్చినది. వచ్చి ఇట్లనుకొన్నాడు- నేనుబ్రహ్మవేత్తనట! అన్నాడు. నేనుగర్భలేశ రజానిధినట! అన్నాడు (ఈమాటలునిజమైనను, బ్రహ్మవేత్తయైనవాడు లోకదృష్ట్యా తన్నితరులు పొగడిన పొగడి కనుకూర్చి ఇట్లుమెచ్చుకొనుట సహజముగదా!) నిజమ్ముగ నాయనప్రేమ-ఈమాటకు పద్యములోనన్వయములేదు ఇదివట్టి యాశ్చర్యార్థకము లోకము నందిట్లందురు- మరియు నిట్లనుచున్నాడు- ఆనాడు దశరథుడు తనకుచేసినగౌరవమునకు వ్యాఖ్యానము చేయు చున్నాడు ఆ దశరథుడు చేసినగౌరవమంతయు జనకుడు తనకు వియ్యంకుడగుదానికి పునాదివేయుటయా, అని ఊహించినట్లు చెప్పుచున్నాడు. తానుబ్రహ్మవేత్త తనకది తెలి యును, తెలిసినను లోకవృత్తమునందు తెలియనివాడే! లోకమునుండి దీని నుత్ప్రేక్షించు చున్నాడు ఇది యెకచమత్కారమైన రచన మరియుననుచున్నాడు-నేనుకాదనుచున్నను- నాకు బ్రాహ్మవిధి నర్ఘ్యమునుసంధానించెను ఆయననాకంటెవృద్ధుడు కాని నేననగా ఏమి కౌతూహలము?ఏమి గౌరవము? అన్నాడు లోకములోవృద్ధులైన వారియందు పిన్నవాండ్రు గౌరవముంచుట కలదు వృద్ధులు పిన్నవాండ్రను గౌరవించుట యుండదు. దశరథునకు గల యాగౌరవమును జనకుడు వ్యాఖ్యానించుచున్నాడు యీగౌరవము దశరథుని హృద యములో అవిస్పష్టముగానున్నయూహ ఆయూహను హృదయముదాచినది ఆ దాపరిక మెట్టిది? భవిష్యత్తులో తామిద్దరు వియ్యంకులగుదురన్నది. ఇదిదశరథుని యాత్మలోనున్నది- ఆయన మనస్సునకు తెలియదు తెలియకపోయినను ఆత్మయొక్కప్రేరేపణవలన, దశరథు డట్లుగౌరవము చేసెనని జనకు డనుచున్నాడు అదియట్లేకావలయును లేనిచోనట్లెందుకు జరుగును? అన్నయర్థము "కావలెన్" అన్నమాట చేతస్ఫురించుచున్నది "భావిసంబంధ సంజ్ఞాకంబై హృదయమ్ముదాచిన యవిస్పష్టోహమేకావలెన్." ఈమాటాడినది జనకుడు ఆయన బ్రహ్మవేత్త, ఋషికల్పుడు. ఆయన నేదిమాటాడిననిట్లేయుండును ఇదియాధునికుల శిల్పదృష్ట్యా పాత్రపోషణ మనవచ్చును.

జనకుడీమాటలు తనసచివులతోననెను. నిజానికీమాటలలోని యర్థమంతయుబ్రహ్మ వేత్తయైనజనకునకు తెలిసినదే కానిలోకదృష్ట్యా మంత్రులతోనట్లుచెప్పుట, తనసంతోషమును వెలిబుచ్చుటగానున్నది.

“కారణ వైచిత్ర్యే సతికార్య వైచిత్ర్యమ్”

పండిత, శ్రీ గోపదేవ్

దృశ్యమానమగు నీప్రపంచమునకు మూల భూతములగుపదార్థములు మూడని వేద శాస్త్రములు ప్రతిపాదించుచున్నవి.

1 ప్రకృతి
2 జీవులు,
3, పరమేశ్వరుడు.

ఋగ్వేదము ప్రాచీనతమ గ్రంథము. అందొకచోనిట్లే ప్రతిపాదింపబడి యుండుట జూడనగును.

“ద్వాసుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి,
అనశ్నన్నన్యో ఽభి చాకశీతి,”

‘చైతన్యము లక్షణముగాగల రెండు సుపర్ణము లొకేవృక్షము నాశ్రయించియున్నవి. అందొకటి వృక్షఫలముల నాస్వాదించుచున్నది రెండవది యనుభవింపక ప్రకాశించుచున్నది.’ ఇందుప్రకృతి వృక్షముగాను, జీవేశ్వరులు సుపర్ణములుగాను వర్ణింపబడినవి. వర్ణన మాలంకారికము. ఈవిషయమునే యుపనిషత్తు శబ్దాంతరములతో నిట్లువర్ణించుచున్నది.

“అజామేకాం లోహితశుక్ల కృష్ణాం
బహ్వీఃప్రజాః సృజమానాం సరూపాః
అజోహ్యేకో జుషమాణో ననుశేతే
జహాత్యేనాం భుక్తభోగా మజోఽన్యః”

సమాన రూపముగల బహుసంతతిని సృజించు లోహిత శుక్లకృష్ణరూప యగునజను నొకయజుడాలింగన మొనర్చి యనుశయన మొనర్చుచున్నాడు. మరియొక యజుడాయజను భోగించి విడుచుచున్నాడు.

ఇందలి మొదటియజ ప్రకృతి రెండవ యజుడీశ్వరుడు. మూడవ యజుడె జీవుడు ప్రకృతి సత్వరజస్తమోగుణాత్మకము. సత్వము శుక్లశబ్దముతోను, రజస్సు లోహితశబ్దముతోను, తమస్సు కృష్ణశబ్దముతోను సూచింపబడినవి. ఈశ్వరుడిట్టి ప్రకృతిని వ్యాపించి యున్నాడు జీవుడుప్రకృతిసంబద్ధుడై సుఖదుఃఖరూప ఫలములననుభవించి భోగముక్తుడైన పుడుప్రకృతిని విడుచునని స్పష్టముగా నిందు వర్ణింపబడియుండుట జూడనగును, ప్రకృతిని. ఈశ్వరుని, జీవుని అజశబ్దముతోవ్యవహరించి యున్నందున నీమూడు పదార్థములును జన్మరహితములనియు నందువలన నవి నిత్యమూల పదార్థములనియు తేటతెల్లమగుచున్నది.

వ్యాసమహర్షియు భగవద్గీత యందీప్రపంచ మూలపదార్థముల నిట్లు వర్ణించియున్నాడు.

“ద్వావిమౌ పురుషౌలోకే
క్షరశ్చాక్షర ఏవచ
క్షరఃసర్వాణి భూతాని
కూటస్థోఽక్షర ఉచ్యతే
ఉత్తమః పురుషస్త్వన్యః
పరమాత్మే త్యుదాహృతః”

ఈశ్లోకములందు వర్ణింపబడిన సర్వభూతాత్మకము, నాశవంతమునగు క్షరముప్రకృతి అక్షరుడైన, కూటస్థుడు జీవుడు. ఈరెంటికిని భిన్నుడైన ఉత్తమ పురుషుడు పరమాత్మ ఇట్లుజీవేశ్వర ప్రకృతులు మూడును స్పష్టముగా ప్రపంచమునకు మూల పదార్థములని వ్యాస మహర్షి గీతలోవర్ణిం చియున్నాడు.

ఇందు పరమేశ్వరుడు సచ్చితానంద స్వరూపుడు. సత్తు, చైతన్యము, ఆనందము నతని స్వరూపమని భావము అతడీసృష్టికికర్త, ధర్త, సంహర్త యునని శాస్త్రములు వర్ణించు చున్నవి, వ్యాసుడు ‘జన్మాద్యస్యయతః’ అను సూత్రమును రచియించి దృశ్యమాన ప్రపంచముయొక్క సృష్టిస్థితిలయములకు పరమేశ్వ

రుడేమూలమని వర్ణించియున్నాడు. మూలమన చేతననిమిత్త కారణమని యెరుంగవలెను. ప్రపంచమున రచియింపబడు కార్యపదార్థము లకునిమిత్త కారణము లనేకము లుండును అందుచేత ననిమిత్త కారణము మాత్రమే కర్త యనిపించుకొనును. అట్లేప్రపంచమనెడి కార్యమునకుకర్త, చేతన నిమిత్తకారణము పరమేశ్వరుడు అతడీప్రపంచము నెప్పటినుండి రచియించుచున్నాడో యెంతవరకు రచియించునో యేరికిని తెలియదు. 'యాథా తథ్యతోఽర్థాన్ వ్యదధా చ్ఛాశ్వతీభ్యః, సమాభ్యః' అతనియాకృతి యనాద్యనంత మనినుడువదగును.

రెండవ మూలపదార్థము జీవుడు జీవులు సంఖ్యలోననేకులు. సుఖము, దుఃఖము, రాగము, ద్వేషము, జ్ఞానము, ప్రయత్నము నను నీయారుగుణములు జీవునకు స్వరూపమనదగును.

'ఇచ్ఛాద్వేషప్రయత్నసుఖదుఃఖ జ్ఞానాన్యాత్మనో లింగమ్, అనిగౌతమ న్యాయసూత్రము. జీవుల స్వరూపములో భేదమొకింతయునులేదు. జీవులును నిత్యులే. జన్మమరణములు శరీరములకే కాని జీవులకులేవు.

మూడవ మూల పదార్థము ప్రకృతి. ఇయ్యది సత్వరజస్తమోగుణాత్మకమని యిది వరకే వ్రాసియుంటిమి. 'సత్వంరజస్తమ ఇతిగుణాః ప్రకృతిసంభవాః' సత్వరజస్తమస్సుల సామ్యావస్థయేప్రకృతియని ప్రకృతి విదులందురు. ఈప్రకృతియు నిత్యమేయని యిదివరికే సూచించి యున్నాము. చేతన సంయోగముచే నియ్యది పరివర్తించుచుండును.

ఉపద్యుక్తములగు మూడు పదార్థములతో నీప్రపంచమంతయు సంఘటితమైయున్నది. ఇందేదిలేకున్నను నీప్రపంచమిట్లుండ నేరదనిభావము.

కొందఱు దృశ్యమాన ప్రపంచమునకు మూలపదార్థమొక్క-బ్రహ్మమేయందురు. మరి కొందఱు కేవలము ప్రకృతి ప్రపంచమునకు మూలమందురు. ఈరెండు వాదములు వేదశాస్త్రములకు విరుద్ధములని పైపంక్తులను జదివినవారికి సులభముగా స్పష్టమగును. ఆలోచించిచూచిన మీదట నావాదములు తర్క-విరుద్ధములనియు బోధపడును,

'కారణగుణ పూర్వకాః కార్యగుణాః' ఉపాదాన కారణమునకుండుగుణములనుండియే కార్యగుణము లుత్పన్నములగును. తంతువులు తెల్లగానున్న వస్త్రము తెల్లగానుండును' తంతువులు చిత్రవర్ణము గలిగియున్న వస్త్రము చిత్ర వర్ణముగలదగును. ఇట్లుకారణమున లేని గుణములు కార్యమున నుండ నేరవని స్పష్టమగుచున్నది. న్యాయదృష్టితో కార్యమునుజూచి కారణమునూహింపదగును.

దృశ్యమాన ప్రపంచము చిత్రవిచిత్ర దృశ్యమయమనుట లోకవిదితము. 'ఈప్రపంచమునగల యీవైచిత్ర్యమునకు కారణమేమైయుండును?' అనునీప్రశ్నము విచారకులకు స్ఫురింపక యుండదు. ప్రపంచమునగల పదార్థములన్నియు నొండొంటితో కలియక విభిన్నములై యగపడుచుండుట యెల్లరెరిగిన విషయమే ఒకేజాతికి సంబంధించిన ప్రాణుల శరీరములలోకూడ పరస్పరమెంతో భేదము దృగ్గోచరమగును ఇట్లే ప్రతివస్తువునందును భేదముండుట స్పష్టము- ఈభేదమునకు-విలక్షణతకుకారణమేమి? ఇదియొక సమస్యకాదా? మనీషుల మనస్సున కిదిస్ఫురింపదా! తప్పక స్ఫురించును. అటులయిన దీనికి సమాధానమేమి?

కొందఱుకేవల బ్రహ్మాస్తిత్వ వాదులు బ్రహ్మనుండియే యీవిచిత్రసృష్టి కలిగినదని చెప్పుదురు. అదిసత్యమని యంగీకరింతు మేని దృశ్యమాన ప్రపంచమున గలవైచిత్ర్యమునకు కారణమేమి? ఈప్రపంచము బ్రహ్మకార్యమగు నెడల ప్రపంచము కార్యమనియు, బ్రహ్మము దానికినుపాదాన కారణమనియు నంగీకరింపవలసివచ్చును అప్పుడు బ్రహ్మమునగల గుణగణములే ప్రపంచమున నుండవలసివచ్చును. బ్రహ్మవాదుల మతమున బ్రహ్మము సచ్చిదా

నందలక్షణముగలది. సత్తు, చిత్తు, ఆనందము బ్రహ్మలక్షణములు దానినుండి యుత్పన్నమగు ప్రపంచముకూడ సచ్చిదానందమై యుండవ లెను. కాని, ప్రపంచమునకు సత్త(ఉనికి) యున్నను, నందుచైతన్యములేదు అదిజడము. ఆనందమంత కంటెను సున్న. ప్రపంచము వికారము నందుచుండును బ్రహ్మమునిర్వికారి ప్రపంచ వస్తువులు ప్రతిక్షణము నశించు చుండును. బ్రహ్మము నాశములేనిది ఇట్లు ప్రపంచమునగల జడత, వికారము, నాశము మున్నగుగుణములకు కారణము బ్రహ్మమున గానము కాబట్టిప్రపంచము బ్రహ్మోపాదాన కారణకమనుటయు, బ్రహ్మతక్క యన్యపదా ర్థములేదనుటయు హేతుబద్ధము కాదనవలసి వచ్చును. అంతేకాక ప్రపంచమున గల వైచిత్ర్యము బ్రహ్మమూలక మనుటయు తగదు.

కొందఱు ప్రకృతివాదులు ప్రకృతి వలననే యీ విచిత్రప్రపంచ మేర్పడుచున్నది, జీవేశ్వరులెవరును లేరందురు. వారిమతము ననుసరించిచూచిన ప్రపంచవైచిత్ర్యమునకు కారణమేమగును?

ప్రకృతి-సత్వరజస్తమాత్మకము అందు వలన దానినుండి యేర్పడుకార్య జాతము సత్వరజస్తమో గుణాత్మకమై యుండుట యుక్తమే ప్రపంచ పదార్థములన్నియు త్రిగు ణాత్మకములనుటలో సందేహమునులేదు కాని, యీత్రిగుణాత్మక పదార్థములన్నియు నొకేయా కృతిలో నొకేపరిమాణములో నేర్పడుట న్యాయ మగునుకాని, భిన్నభిన్నములగు నాకృతులలో భిన్నములగు పరిమాణములలో నేర్పడుటకు కారణమేమి? ప్రతిప్రాకృతిక పదార్థము నందునుగల సత్వరజస్త మాత్మకగుణములు భిన్న పరిమాణములలో నేలయుండవలె? దీనికి ప్రయోజకమేమి? ఒక పదార్థమున సత్వ మెక్కుడుగాను. రజస్తమస్సులుతక్కువగాను మరియొకట రజోగుణమెక్కుడుగాను మిగిలిన గుణములు తక్కువగాను, ఇట్లేయింకనొకట తమోగుణాధిక్యము, సత్వరజస్సులన్యూనతయు నుండనేల? జడాత్మకమగు నీప్రకృతినుండివిచిత్ర విచిత్ర పదార్థములేర్పడుటకుగల హేతువేమి? కేవల ప్రకృతివాదు లిందులకేమి సమాధానము చెప్పుదురు?

ప్రపంచమున నేడు ప్రసిద్ధిలోనున్న మతములలో క్రైస్తవము, జైనము, బౌద్ధము, మహమ్మదీయము ననుమతముల వారిని ప్రశ్నింతుమేని వారును మౌనమువహింతురు లేదా! భగవంతుని లీలయని సమాధానము నుడువుదురు. ఈలీలాపదమున కర్థమొకింతయు నుండదు దేవుడు తక్కయన్యమేమియులేదను క్రైస్తవులను మహమ్మదీయులను జీవులెట నుండి వచ్చిరి? వారికి భిన్నభిన్నాకృతిరూపా దులుగల దేహము లెట్లులభించు చున్నవని ప్రశ్నించినచో వారదియంతయు దేవుని మహిమయనియో లీలయనియో చెప్పుదురు, ఇదిహేతుబద్ధమైన సమాధానము కాదనిపాఠకు లకు వేరేచెప్పనవసరము లేదనియెంచెద.

వైదికులు జీవేశ్వర ప్రకృతులను స్వతంత్రసత్త గలవిగా నంగీకరింతురు వారికిని ప్రపంచమునగలవైచిత్ర్యము సులభసాధ్యమన జాలము

జీవు లసంఖ్యాకములయినందున సృష్టి యందు వైచిత్ర్యమేర్పడిన దనుటకును వలను పడదు. జీవులు సంఖ్యలో ననేకులయినను వాని స్వరూపములో భేదములేదు. జ్ఞానేచ్ఛాద్వేష ప్రయత్న సుఖదుఃఖములను కలిగి యుండుట యెల్లజీవులకును సమానమే కాబట్టి జీవుల స్వరూపములో పరస్పరము భేదము లేదనుట నిస్సంశయము. అట్టియెడ జీవుల కొరకై యేర్పడు శరీరములలో నింతభేదమేల? భార తీయులోకోక్తిని బట్టిచూడగా నెనుబదినాలుగు లక్షల యోనులున్నట్లు తెలియు చున్నది. ఒక్కొక్క యోనికి సంబంధించిన కోట్లకొలది శరీరములలోను పరస్పరమెంతో రూపభేద మున్నది. ఇదియంతయునేల? ఒక్క మానవ యోనిని దిలకించుడు! ఎంతటి వైచిత్ర్యము గనిపించుచున్నదో తెలియనగును. ఒకే తల్లి దండ్రుల కేర్పడిన సంతానశరీరములలో కూడ

నెంతో భేదముచూడగలము. ఒకరి శరీరము స్థూలమైన మరియొకరిది దుర్బలము ఒకరిది యున్నతకాయము. మరియొకరిది హ్రస్వము. ఒకరి దేహము శ్యామ వర్ణముగలదైన మరియొకరిది గౌరవర్ణము గలదగును. ఇంతటి వైచిత్ర్యమునకు కారణమేమి

ఈశ్వరు నంగీకరించువారు కొంద రిందులకుపూర్వము నుడివిన సమాధానమునే చెప్పుదురు ఈశ్వరుడు స్వతంత్రుడు సర్వశక్తిమంతుడు, కాబట్టి తన యిష్టమువచ్చినట్లనేక విధములైన శరీరములను జీవులకొరకునిర్మించును, కాబట్టి యీ ప్రశ్నమునకు తావేలేదందురు కాని, ఈశ్వరుడు స్వతంత్రుడైనందున తన యిచ్ఛవచ్చినట్లు జీవులకు వివిధ శరీరములను రచించునందుమేని యతడు న్యాయకారి కాక పక్షపాతముగలవాడన వలసివచ్చును ఈశ్వరుడు పక్షపాతియనుట ఈశ్వరవాదులంగీకరింపరు అతడున్యాయకారియనియు రాగద్వేషములులేనివాడనియు నెల్లరు నంగీకరింతురు పక్షపాతములేని యీశ్వరుడు తన యిచ్ఛవచ్చినట్లు భిన్నసుఖముల నొసంగు శరీరములను నిర్మించుననుట పొసగదు కాబట్టి శరీర భేదమునకు కారణమేమి? అనుప్రశ్న మట్లేనిలిచియుండును

ఈ సృష్టివైచిత్ర్యమునకు కారణము వాస్తవమున త్రైతవాదము నంగీకరించువైదికులుతప్ప మరియొకరు చెప్పజాలరు వైదికులమతమున జీవేశ్వరప్రకృతులునిత్యములు ఈశ్వరుడు సృష్టికర్త ప్రకృతినుపాదానకారణముగ గ్రహించి ప్రపంచ రూపకార్యము నతడు సృష్టించుచుండును ప్రకృతిలోననేకరూపముల పరిణతినొందుటకుతగినయోగ్యతయున్నది. కానియదిస్వయముగ పరిణమింపదు. చేతన పరతంత్రమై యది పరిణమించును జీవులనేకులు. వారు స్వరూపమున భిన్నులుకాకున్నను కర్మలనాచరించుటలో స్వతంత్రులైయున్నారు. అందువలన వారు స్వేచ్ఛతో ననేకములగు కర్మలనొనరింపగలరు కర్మాచరణమున స్వతంత్రులేకాని ఫలానుభవములో జీవులకు స్వాతంత్ర్యములేదు, పరతంత్రులై ఈశ్వరతంత్రులై ఫలము ననుభవించువారై యున్నారు. వైదికుల మతమునజీవేశ్వర ప్రకృతుల స్థితిగతులిట్టివి.

ఈశ్వరుడు సూక్ష్మమగు ప్రకృతిని స్థూలము చేసి దానిని దృశ్యమాన ప్రపంచరూపమున మార్చును ఇదియే యతనిసృష్టి కార్యము. ఈశ్వరుడిట్లుచేయనేల యన జీవులొనర్చుకర్మలకు తగినట్లువారికిఫలములను చేకూర్చుటకు గాను ఈశ్వరుడుసృష్టిలోనుండు పదార్థములనురచించుచున్నాడు జీవులుకర్మలొనర్చుటలోస్వతంత్రులు కావున వారికర్మలలోనెంతోభేదము వైచిత్ర్యము నుండుటసహజము ఆయాకర్మలకు తగినట్లుఫలమునిచ్చుసామర్థ్యము భగవంతునకేగలదు అందువలన కర్మ వైచిత్ర్యమునకను గుణముగఫలవైచిత్ర్యమునను భవింప జేయుటకు తగినట్లు విచిత్రసృష్టి నీశ్వరుడు చేయుచున్నాడని స్పష్టమగుచున్నది ఇట్లుచేయుటలోనీశ్వరుడు పక్షపాతికావలసిన యవసరమెుందును నుండదు జీవులొనర్చుకర్మలలోభేదమున్నది కావున కర్మానుగుణముగఫలములను(సుఖదుఃఖములను)అనుభవించుటకు తగినట్లుభిన్నభిన్న శరీరములనురచియించుట భగవంతునికర్తవ్యమగుచున్నది ఇందుపక్షపాతమునకు తావేయుండదు ఈశ్వరుడు తన యిచ్ఛవచ్చినట్లు విభిన్నశరీరములను నిర్మించి జీవులకొసంగినపక్షపాతియగుననిభావము ఇదియే వైదికకర్మసిద్ధాంతమునగలవైశిష్ట్యము ఇట్టి కర్మసిద్ధాంతమునంగీకరింపనితాత్త్వికులుకానీ మతవాదులుకానీ, విజ్ఞానవేత్తలు కానీ యీసృష్టివైచిత్ర్యమునకుగలకారణమును సరిగా నిరూపింపజాలరనుటనిస్సంశయము.

జన్మలకు,జన్మల ద్వారమున ననుభవించు ఫలములకుమూలము జీవులొనర్చు కర్మలు.కర్మల నొనర్చుటలో జీవులు స్వతంత్రులు కావున నానావిధములగు కర్మల నొనర్తురు ఆకర్మలలో నెంతో వైచిత్ర్యమును నుండును ఇట్టికర్మల వైచిత్ర్యమును ప్రయోజనకముగా నంగీకరించి పరమేశ్వరుడు ప్రపంచమును విచిత్రముగాసృష్టించుచున్నాడు కారణమున వైచిత్ర్యముండుపక్షమున కార్యమున వైచిత్ర్యముండుటలోనెట్టిదోషమునులేదు. ఈతత్త్వమును గ్రహించిన క్రాంతదర్శిమహర్షియే 'కారణవైచిత్ర్యేసతికార్యవైచిత్ర్య' మనినుడివియున్నాడు

ప్రేమ రహస్యం

(రూపకం)

శ్రీ "అమరేంద్ర"

(గ్రీకు పురాణగాథని అనుసరించిన రచన)

పాత్రలు

వీనస్ - కళాధిదేవత

ఈరోస్ - వలపువేలుపు

సైకీ - ఆత్మ

-గ్రీకుదేశీయుల సౌందర్యరాశి కళాధిదేవత వీనస్ ఆమెకు స్వాగతం పలుకుతూ బృంద గానం-

స్వాగతమో భువనైక మోహినీ
దివ్యనవ్య సౌందర్య వాహినీ
సురుచిర సుమధుర మందహాసినీ
శుభ్రస్వర్గ ద్యోత్స్నా విభాసినీ...
నృత్యశిల్ప సంగీత రమ్య సాహిత్య-
మధురసదనా
నిత్యనవ్యలావణ్య స్వప్న సందీప్త భవ్య
వదనా...

వీనస్. (చికాకుగా) ఆపండి మీస్తోత్రాలు ఆపండి. అబ్బా...ఇంక వినలేను ఆపండి

పరిచారిక దేనికి దేవీ మామీద అంతకోపం? మేమేదైనా అపచారం చేస్తే మన్నించు దేవీ! అనుగ్రహించు.

వీనస్. ఇక నాతో వాదించకు ఈనాడు భరించలేని అవమానంతో నాగుండె మండి పోతోంది

పరి. సకల కళా సామ్రాజ్యసముజ్జ్వలవైభవానికి మహారాణివైన నిన్ను అవమానించగల సాహసం ఎవరికున్నది దేవీ?

వీనస్. ఎవరికా? ఒక సామాన్య వనితకు. భూలోకంలో ఒక రాజకుమారికి

పరి. నిజంగానా? నమ్మశక్యంకాకుండావుంది దేవీ...

వీనస్. ఆ రాజకుమారి అపురూప లావణ్యరాశిననివిర్రవీగుతోంది. తనే సౌందర్యాధిదేవతనని మిడిసిపడుతోంది దానిపాదాల మీదనే యువకులంతా తమహృదయాలను పూజాప్రసూనాలుగా సమర్పించి ఆరాధిస్తున్నారు ఇంతకిమించిన అవమానమేముంది నాకు?

పరి ఎవరు చెప్పారుదేవీ ఈ సంగతి నీకు?

వీనస్. అస్తమానం అలసటలేకుండా అన్ని తావుల్లోనూ సంచరించే పవనకుమారుడే ఈవార్త నా చెవిలో ఊదివెళ్ళాడు ఎక్కడా నిలవని తనకే దాని అందాన్ని చూడగానే అక్కడే ఆగిపోవాలనిపించిందట! అంత సౌందర్యాన్ని తనెప్పుడూ చూడనేలేదుట

పరి పనీ పాటలేక నీలిమబ్బులతోనూ పూల రేకులతోనూ అలల నురుగులతోనూ చిలిపిగా ఆటలాడుకుంటూ తిరిగే పవనకుమారుడి గాలిమాటలికి విలువ ఇవ్వటం దేనికి దేవీ?

వీనస్ మంటలు రేగే మనసును మాటలతో ఊరడించలేవు

పరి. కాదు దేవీ ఆకాశంలో లెక్కలేనన్ని నక్షత్రాలున్నయ్. కాని జాబిల్లి ఒక్కడే కదూ? ఈ సౌందర్యాకాశంలో నువ్వే నిండుకళల జాబిల్లివి...

వీనస్ నీ స్తోత్రాలిప్పుడు నాచెవిలోదూరవు. దానికి తగిన పరాభవంచేసేదాకా నా మనస్సుకి శాంతిలేదు. మిడిసిపడుతున్న దాని అందాన్ని వాడిన పువ్వులాగా నా పాదాలక్రింద నలిపివేసేదాకా నాకునిద్ర పట్టదు

పరి. దేవి తలుచుకుంటే అదెంతపనీ?

వీనస్. కాని ఏంచెయ్యాలో నాకు తోచటం లేదు-

ఈరోస్ (ప్రవేశిస్తూ) ఏమిటీ తోచడం లేదంటున్నావ్ ? ఎందుకల్లా ముఖమంతా కందిపోయింది?

పరి. వచ్చావా ప్రణయమూర్తీ ప్రణామం అందుకోస్వామీ! సమయానికి వచ్చావు. దేవికి జరిగిన దుస్సహమైన అవమానానికి ప్రతీకారం చెయ్యాలి అందుకు నువ్వే సమర్ధుడివి

ఈరోస్ అవును మరి మీకు అవసరంవస్తే నన్ను ఆకాశానికి ఎత్తుతారు లేకపోతే-

పరి. ఎంతమాటన్నారు స్వామీ! మీశక్తి అప్రతిహతమన్న సంగతి జగద్విదితం కదా...

వీనస్ నీ పూలబాణాలకి లొంగని వారెవరున్నారు? అవును. నా అవమానానికి ప్రతీకారం చేసేందుకు నువ్వే తగినవాడివి

ఈరోస్. ఇంతకీ సంగతేమిటో చెప్పనేలేదూ-

వీనస్ నాకంటే అందగత్తెనని విర్రవీగుతోంది ఒకరాజకుమారి

పరి మిణుగురు పురుగు మిడిసిపడినంత మాత్రాన చంద్రబింబం అవుతుందా? సామాన్య మానవస్త్రీకి ఎందుకింత అవివేకం?

వీనస్ దాని గర్వం అణచాలి నువ్వు

ఈరోస్ ఓస్ అదెంత పనీ? ఈ భాగ్యానికి నువ్వింత దిగులుపడాలా? ఇదిగో ఇప్పుడే ఎగిరిపోతాను

పరి జాలిలేని నీ పూలబాణాలతో ఆ రాజబాల గుండెల్లో ఆరని వలపు రగిలించాలి

వీనస్ గుడ్డి వలపులో మసకవేసిన కళ్ళతో అది ఒక పరమకురూపి మెళ్లో పూలమాల వేసేట్లు చెయ్యాలి

పరి దాని అందం బూడిదలో పోసినపన్నీరయిపోవాలి.

వీనస్ దాని గర్వం మట్టిలో కలిసిపోవాలి

ఈరోస్ నా పూలబాణమేకదా నేలనీ గాలినీ, నీటినీ నిప్పునీ సంధించి ఆఅపూర్వసమ్మేళనంలో ఈసృష్టిని వికసింపజేసింది? నా పూలబాణమే ఆ అందాలబాలని కురూపి పాదాలమీద వాలేట్లుచేస్తుంది

వీనస్ మంచిది త్వరగా వెళ్ళిరా తిరుగులేని నీబాణాల మహిమ మరొక్కమారు ప్రదర్శించు

ఈరోస్ శలవు మరి,

2వ సన్నివేశం.

-ఉద్యానవనంలో రాజకుమారి సైకీ విహరిస్తూ పరవశానందంతో పాడుతూ-

ఎవరె చెలీ? ఎవరె చెలీ?
నాజీవన సుమవనమున
నవవసంత పరిమళధర
మందమధుర మారుతమై
ఎవరె చెలీ? ఎవరె చెలీ?
నా జీవన నీలగగన
మేదుర నీరద పటలిని
విదలించుచు నటియించే
వింత మెరుపు కాంతులలో
ఎవరె చెలీ? ఎవరె చెలీ?

ఈరోస్, ఎవరు చెలీ ఆ భాగ్యశాలి?

సైకీ ఈ ఏకాంతవనంలో ఎవరిదీ కంఠస్వరం? ఎవరు నువ్వు?

ఈరో నేనా? ప్రబల విరోధిగా వచ్చి నీ ప్రజ్వల సౌందర్యానికి జోహారులు చేస్తూ పాదాక్రాంతుడినై పోయిన బానిసని నేను

సైకీ కంఠం వినపడుతుందికాని మనిషి కనపడడేం? కళ్ళు చెదిరే ఈకాంతి ఏమిటి? అంతా వింతగావుంది- ఎవరు నువ్వు? నిజంచెప్పు

ఈరో నిన్ను శిక్షించడానికి దేవలోకం నించి ఎగిరివచ్చిన శత్రువుని నేను

సైకీ శిక్షించడానికా? నేనేం అపరాధం చేశానూ?

ఈరో నీ అద్భుతసౌందర్యమే నీ అపరాధం జగదేక సుందరిగా పేరొందిన వీనస్‌కే

నీమీద ఆగ్రహం వచ్చింది. నిన్ను పరాభ వించడానికే నన్నిక్కడికి పంపింది

సైకీ. నిజం చెప్పు? నువ్వెవరివి?

ఈరో. సుందరి! నీ సందర్శన సౌభాగ్యంతో నాజన్మ ధన్యమయింది యుగయుగాల సౌందర్య స్వప్నాలు నీ స్వరూపంలో మూర్తీభవించి నన్ను ముగ్ధుణ్ణిచేస్తున్నయ్.

సైకీ. మాటలతో దాటేస్తున్నావా, అసలు సంగతిచెప్పు. నువ్వెవరివి?

ఈరో. నేనా? పూలబాణాల వేలుపుని నేను ఆశనిరాశలతో అశ్రుదరహాసాలతో హృదయాలని ఊయలలూగించే ప్రణయ మూర్తినినేను ...

సైకీ నిజంగానా, స్వామీ?

ఈరో. శత్రువునై వచ్చాను. కాని నీ సముజ్జ్వల సౌందర్యప్రభలలో, కరిగిపోయే వానకారుమబ్బులాగా నా కార్పణ్యమంతామటుమాయమైపోయింది.సఖీ! నీ కారుణ్యమే నాజీవితాని కేకైకశరణ్యం. దీనంగా నీ ప్రణయభిక్ష వేడుకునే ఈపాద దాసుడి మీద ఒక్క కటాక్ష వీక్షణం ప్రసరించవూ?

సైకీ ఏదో స్వప్నంలాగావుంది. నమ్మలేను. నమ్మలేను.

ఈరో ఇంకా నన్ను శంకించి శిక్షించదలచుకున్నావా? ఇతరుల హృదయాల్లో ఇన్నాళ్ళనించీ నేను రగిలించే విరహ వేదన ఎంతదుర్భరమైనదో ఇప్పుడు నాకు అర్థమౌతున్నది అనుగ్రహించవా సుందరీ?

సైకీ నేనేపాటిదాన్నిస్వామీ నిన్ను శిక్షించటానికి? నీమాటలలోని వ్యథ నామనస్సుకి సుధ ఆ మాధుర్యంలో నా సర్వస్వమూ కరిగిపోతుంది కాని నీ స్వరూపాన్ని చూసే అదృష్టంలేదా నాకు?

ఈరో. దిగంతాలనుంచి వసంత లతాంత పరిమళాలని మోసుకువచ్చే మలయపవనానికి రూపం ఏముంది?

సైకీ. కొలను అలలలో విలాసంగా తేలే కలువకన్నె, గిలిగింతలు పెట్టే చలువ వన్నెల కిరణాలని, ఎవరు మీరు? అని అడగటంలో తప్పేముంది ప్రభూ?

ఈరో లేదు కాని నాకు రూపంలేదు ఏ రూపం కావాలనుకుంటే ఆ రూపాన్ని ధరించగలను, నా నిజస్వరూపం మాత్రం ఎవరికీ కనబడదు.

సైకీ అయితే శూన్యాన్ని నేనెల్లా ప్రేమించగలను ప్రభూ?

ఈరో. నీ మనసుని తన పసిడి రెక్కలమీద ఎక్కడికో ఎత్తుకుపోయే మధుర సంగీతానికి రూపమేముంది సఖీ?

సైకీ నిజమే లేదు. కాని నేను గాలిని కౌగలించుకోలేని మానవ వనితను

ఈరో రూపంతో పనిలేన్ని అమందానంద సుధతో నీ ఆత్మని నింపుకోవచ్చును మధురగానంలాగా, మలయమారుతం లాగా మహాప్రణయానికి కూడా రూపం లేదు, సఖీ

సైకీ నీ మాటలలో ఏదో నిర్మల సత్యం వినిపిస్తోంది ప్రభూ. నేను అనుగ్రహించేపాటిదాన్నికాను, సాధారణ రమణిని నీ చరణదాసిని

ఈరో కాదు కాదు,నాహృదయానికిరాణివి. సుందరీ నేనింత భాగ్యశాలి నవుతానని కలలోకూడా అనుకోలేదు.

సైకీ. నేటికి నాజన్మ ధన్యమయింది

ఈరో సఖీ! ఇక సంకోచాలకి సందేహాలకి స్వస్తిచెప్పి స్వర్గసౌఖ్యాన్నికొల్లగొందాం పద

సైకీ. ఎక్కడికి? నేను మానవలోకాన్ని విడిచివుండలేను ప్రభూ...

ఈరో. పగలంతా నువ్విక్కడే వుండచ్చు. రాత్రి రహస్యంగా మనం కలుసుకోవచ్చును.

సైకీ ఎక్కడ కలుసుకుందాం?

ఈరో. గాలిగుఱ్ఱాలమీద నిన్ను తేల్చుకు పోతాను. నీలాకాశపు గుండెల్లో పాల వెల్లిచేరువలో మనకొక మహోజ్జ్వల మణిమయసౌధం నిర్మిస్తాను అక్కడ నువ్వూ నేనూ అమరసుఖంలో తేలి పోదాం సూర్యుడు కళ్లుతెరిచేసరికే ఉదయ పవనం తన వీపుమీద మోసుకు వచ్చి పదిలంగా నిన్ను తోటలోదెంపి వెళ్తుంది సరేనా?

సైకీ ప్రభూ నా ఆనందం మాటలకి అంద కుండా పొంగిపోతోంది

ఈరో సఖీ! ఇదిమాత్రం మరవబోకు నానిజ రూపాన్ని చూడటానికి మటుకువిన్నవుతూ వీలులేదు. ఈఒక్క నిషేధాన్ని పాటించి తీరాలి దీన్ని అతిక్రమించిన క్షణమే మన ప్రణయం నీటిమీద బుడగలాగా పేలిపోతుంది. మెలుకవరాగానే కరిగి పోయే మధుర స్వప్నంలాగా తేలిపో తుంది

సైకీ వద్దు వద్దు. ఆ మాటలు ములుకుల్లాగా గుచ్చుకుంటున్నయ్ అల్లా ఎన్నటికీ జర గదు మన ప్రణయం కలకాలమూ తీయనికలగా నిలిచిపోవాలి.

ఈరో మన ఆనందం అక్షయమై పోవాలి,

సైకీ మన అనుభవం అనంతమైపోవాలి.

ఈరో సంధ్యాకాశంలో పెనవేసుకునేచీకటి వెలుగులలాగా నువ్వూ నేనూ ఏకమై పోవాలి. లీనమైపోవాలి

3వ సన్నివేశం.

(ఈ విచిత్ర ప్రణయం కొన్నాళ్లు కొనసాగిన తరువాత ఒకరోజున)

(ఉద్యానవనంలో సైకీ, చెల్లెలూ విహరిస్తూ ఉంటారు)

చెల్లెలు అక్కా! నువ్వు పగలంతా ఇంకేదో లోకంలో విహరిస్తున్నట్లుగా, ఇక్కడ వున్నా ఇంకెక్కడో తిరుగుతున్నట్లుగా వుంటున్నా వెందుకు?

సైకీ. ఆఁ ఏముంది? నేనూ అందరిలాగే వున్నాను

చెల్లెలు కాదు కాదు కారణం చెప్పితీరాలి

సైకీ ఏముందీ చెప్పేందుకు?

చెల్లెలు. నిన్ను గురించి లోకం ఏమను కుంటు న్నదో తెలుసా?

సైకీ. అనుకోనీ, మునిగిపోయిందేముంది? నాలోకం వేరు, మీలోకంతో నాకు నిమిత్తంలేదు

చెల్లెలు నీకు మతిచలించింది నిన్నేదో పాడు భూతం పట్టుకుని పీడిస్తోంది. నీగదిచుట్టూ కాపలా పెట్టించి నిన్ను కదలకుండా కట్టుదిట్టం చేయిస్తాను నీస్వైర విహా రం ఇంతటితో అంతమైపోవలసిందే

సైకీ. నీకుపుణ్యముంటుంది. ఆ పనికిమాత్రం పూనుకోకు నా ప్రాణేశ్వరుడికి ఎడమై ఒక్కరాత్రికూడా నేను జీవించలేను ఆ ప్రణయమూర్తి సన్నిధానంలో ఒక్కొక్కరాత్రి ఒక్క రెప్పపాటులో మధురంగా గడిచిపోతోంది.

చెల్లెలు ఎవరినీ నివ్వువలచింది? ఈకట్టుకథతో నాకళ్లు కప్పలేవులేవే అక్కా...ఇవాళే నీ సంగతి నాన్నకు చెప్పేసి రాత్రివేళ నీ సంచారాలు అరికట్టేస్తాను నిజంగానువ్వు ప్రేమించినట్లయితే ఈ చాటుమాటు లెందుకు? నిర్భయంగా నీ ప్రియుడి పేరు నాన్నతో చెప్పేసిహాయిగా వివాహం చేసుకోక, ఎందుకంటా ఈ తిప్పలు?

సైకీ. పేరు తెలియనంతమాత్రాన ప్రేమకి కొరత ఏముంటుంది? పూర్ణిమరాత్రి పరవడిత్రొక్కే తరంగానికి చంద్రుడి పేరు తెలియకపోతే నష్టమేముంది?

చెల్లెలు. ఊరు పేరుల ఊసు అక్కర్లేదన్న మాట, బాగుంది నీ ధోరణి. అందుకే నిన్నందరూ పిచ్చిదానికింద జమకట్టారు. పోనీ నీ ప్రియుడికి ఆకారమైనావుందా? అదీ అక్కర్లేదంటావా?

సైకీ. ఆకారంలేకపోతే ఆకర్షణ వుండకూడదూ? రూపంలేకుండా ఆనందం వుండకూడదూ?

చెల్లెలు. మతి తప్పిన వాళ్ళకి అన్నీ సంభవంగానే తోస్తయ్

సైకీ. కోకిలపాటకి రూపంవుందా చెల్లీ? అందులో ఆనందం లేదంటావా?

చెల్లెలు ఇదుగో ఆఖరిసారి చెపుతున్నాను. ఈరాత్రికి నీ ప్రియుడిరహస్యం తెలుసుకొనిరా లేకపోతే నేనిక వూరుకోను. అతని వూరుపేరులు, అతని అందచందాలు అన్నీ తెలుసుకొనిరావాలి లేకుంటే నేటితో నీ రహస్యవ్యవహారానికి ఆటకట్టు

సైకీ నువ్వుకూడా ఇంతనిర్దయగా నిలవదీస్తావెందుకు చెల్లీ? తన రూపం ఒరులకంటపడకూడదని నా ప్రాణేశ్వరుడి ఆజ్ఞ

చెల్లెలు. వాడు రాక్షసుడో పిశాచమో-అందుకే తనబండారం బైటపడిపోతుందని ఈ పన్నాగం ఈరాత్రి నువ్వునిజంతెలుసుకురావాలి, ఈ మోసపు వలలోంచి ఇకనైనా నువ్వు బైటపడాలి

సైకీ (దీనంగా) కాని— కాని...

చెల్లెలు కన్నీరెందుకే అక్కా? నేను నీ మంచి కోరేచెబుతున్నాను. నిజంగానువ్వు ప్రేమించింది పరాజకుమారుడో అయితే ఈ రహస్యపు తెరమడుగును విడచి హాయిగా మీరు వివాహం చేసుకోవచ్చు.

సైకీ ఊరూ, పేరూ అందం చందం— ఈ ప్రశ్నల పెనుగాలికి నా ప్రేమసౌధం పేకల మేడలాగా నేలకూలిపోతుందేమోనని భయంగా వుందే చెల్లీ.

చెల్లెలు ఏం భయంలేదు వెళ్లు. నిద్రపోతున్న సమయంచూసి దీపం పట్టుకువెళ్ళిచూడు నిజస్వరూపం బైటపడుతుంది

(క్షణంసేపు మధుర రాగాలాపన)

సైకీ నా ప్రాణేశ్వరుడి మధుర రూపం చూడనిదే నాఆరాటం తీరదు, తనివితీరేదాకా రెప్పవాల్చకుండా చూస్తాను ఆ రూపమధువుతో నా హృదయకలశాన్ని అంచులు తాకేదాకా నింపుకుంటాను

ఈరోం ఇంకా నిద్రపట్టలేదా సఖీ? నాకెందుకో కళ్లు కూరుకుపోతున్నయ్ నిద్రపోవాలి, వెళ్తాను.

సైకీ అప్పుడేనా? ఈ వెన్నెలరాత్రి అంతా ఇల్లా మత్తునిద్రతో వ్యర్థం అయిపోవలిసిందేనా?

ఈరో మన్నించు సఖీ! కళ్ళు మూసుకుపోతున్నయ్

సైకీ. నిద్ర నెరుగని తారలతో పాటు నేనూ మేలుకుంటాను

(ఆకస్మికంగా మృదంగనాదం క్షణం వినిపించాలి)

ఈరో **(అదిరిపడి లేచి కంగారుగా)** ఎవరదీ ఎవరూ? వేడిగా, వాడిగా పొడుస్తున్న ఈ వెలుగెక్కడిది?

సైకీ ప్రభూ...

ఈరో. ఛీ మూర్ఖురాలా, ఎంత పనిచేశావ్? నా నిజరూపం చూడకూడదని చెప్పలేదూ? ఎందుకుఅతిక్రమించావు నాఆజ్ఞ?

సైకీ. చాపల్యంతో చేసిన అపరాధం మన్నించండి స్వామీ! నిద్రపోతున్న సమయంలో మీ ముఖం చూడాలనే ఆశతో ఈదీపంతో మీ దగ్గరికి వచ్చాను. రాగానే మీరు ఉలిక్కిపడిలేచాగు ఎన్నడూ జవదాటని మీ నిషేధాన్ని అతిక్రమించినందుకు మన్నించండి ప్రభూ! ఇంతకోపం వస్తుందని, ఇంత అపచారం చేస్తున్నానని తెలుసుకోలేకపోయాను స్వామీ...

ఈరో ఛీ నిర్భాగ్యురాలా! నీ ఆనందధామానికి నీ చేతులతోనే చిచ్చుపెట్టుకున్నావు.

సైకీ నా తప్పిదం క్షమించవా? ప్రభూ! నన్ను మన్నించవా?

ఈరో. మన స్వప్నం అంతమైపోయింది ఇక నీకు నేనెన్నడూ కనిపించను. మన ప్రణయగాధకి ఇదే పరిసమాప్తి

సైకీ ఇంత కఠోరమైన శిక్షదేనికి ప్రభూ?

ఈరో నీ వివేకదీపపు వాడి కిరణాలవేడికి తాళలేని తరుణమంజుల ప్రసూనం మన ప్రణయం ఇప్పుడది వసివాడి ధూళిలో రాలిపోవలసిందే. నీ చాపల్యానికి ఇదే తగిన ప్రతిఫలం.

సైకీ ప్రభూ కరుణించరా?

ఈరో ఇక నా నిర్ణయానికి తిరుగులేదు, ఇదే మన కడసారి కలయిక.

సైకీ అయ్యో, ఎంత మూర్ఖురాలిని? వెళ్లిపోయావా స్వామీ? ఇక నాకు కన్నీరే మిగిలిందా? ఇక నాకు ఎడారి బతుకే మిగిలిందా ప్రభూ?

వీనస్ (ప్రవేశిస్తూ) జరిగిందా నీకు తగిన పరాభవం? అణిగిందా నీ మితిమీరిన గర్వం? పద నీ ఉద్యానవనంలో నిన్ను దింపి వెళ్ళిపోతాను. ఇప్పటికైనా తెలిసిందా నేను జగదేకసుందరినని. నీకు మంచిపాఠం నేర్పానుకదూ? పదమరి.

సైకీ. ఇదంతా ఏదో అర్థంకాని ఇంద్రజాలంలాగుంది.

వీనస్. అవునవును. అర్థంకాదు, అర్థంలేదు

[బృందగానం]

పూలలో తావిలో
పూలకారుగాలిలో
జాలిగుండె కరుణలో
కాల రథపుపరుగులో
దవ్వుదవ్వుల పిలుపులా
చిరునవ్వుల మెరుపులా

మిణుగురు జిలుగుల తళుకులలో
మిటారి కులుకుల బెళుకులలో
ఝుణ ఝుణ అందెల సందడిలో
జడివానల వాగుల ఎరవడిలో

ఇది అందరాని ఆనందం
తుదిమొదలు లేని ఆశ్చర్యం
ఇదే ప్రాణరహస్యం
ఇదే ఇదే ప్రేమరహస్యం...

కౌటిల్యార్థశాస్త్రమ్

ఆంధ్ర వివరణము

శ్రీ పిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రి

మూ వ్యవహారస్థాపనా వివాదపద నిబంధః వివాహసంయుక్తం దాయ విభాగః వాస్తుకం సమ యస్యానపాకర్మ ఋణాదానాం ఔపనిధికం దాసకర్మ కదకల్పః సంభూయసముత్థానమ్ విక్రీతక్రీతానుశయఃదత్తాస్యానపాకర్మ అస్వామి విక్రయః స్వస్వామి సంబంధః సాహసమ్ వాక్పారుష్యమ్ దండపారుష్యం ద్యూతసమాహ్వయమ్ ప్రకీర్ణకాని ఇతిధర్మస్థేయం తృతీయమధికరణమ్.

మూడవ అధికరణము ధర్మస్థేయము ధర్మవిచారణము చేయువాడు ధర్మాధికారి, ధర్మస్థుడు. ధర్మాధికారి సంబంధమైన విషయములుగల అధికరణము ధర్మస్థేయము ఇందు 20అధ్యాయములు(ప్రకరణములు)గలవు. 1 ప్ర వ్యవహారస్థాపనము, వివాదపద నిబంధము, వివాదము గలిగినపుడు వివాద విషయమును ధర్మస్థునకు చెప్పవలెను. అ వివాదము నందదగిన విషయములు, వివాదము నంది ధర్మస్థునకు నివేదించు పద్ధతులు శిక్షించు పద్ధతి మొదలగు విషయములిందుగలవు, 2 ప్ర వివాహసంబంధ వ్యవహారము. ఇందు వివాహ ధర్మము, స్త్రీ ధన కల్పము, పునర్వివాహ విచారము గలవు. 3 ప్ర. వివాహసంబంధ వ్యవహారమునందే చెప్పినట్లు నడచుకొనుట, పోషించుట, కారిన్యము, ద్వేషము, అతిక్రమించి సంచరించుట. నిషేధింపబడిన వ్యక్తికి ఉపకారముచేయుట, నిషేధింపబడిన వ్యక్తితో వ్యవహరించుట, నిషేధములు లిందుగలవు 4 ప్ర వివాహ సంయుక్తమునందే లేచిపోవుట, మార్గమునందనుసరించి నడచుట, స్వల్పకాల ప్రయాణము. దీర్ఘకాల ప్రయాణము వీటి వివరము వీటియందు శిక్షాప్రకారము ఇందుగలవు. 5 ప్ర దాయ విభాగమునందు దాయక్రమము (వారసుల క్రమము) ఇందు వివరింపబడినవి 6 ప్ర అంశవిభాగము ఆస్తిని పంచుకొనుట 7 ప్ర పుత్రవిభాగము పుత్ర భేదములు, ఆ భేదమునుబట్టి ధనాంశప్రాప్తి. అనులోమ విలోమజాతి భేదములుగలవు 8 ప్ర. గృహవాస్తుకము, ఇండ్లు, స్థలములు, తోటలు, చెరువులు, నూతులు, మొదలగువాటి సంబంధమైన వివాదములు 9 ప్ర. వాస్తువిక్రయము. ఇండ్లు, స్థలములు, భూములు మొదలగువాటి అమ్మకము. అందుగలుగు సరిహద్దు వివాదములు, సరిహద్దు నిర్ణయము మొదలగు విషయములు గలవు 10. ప్ర వివీతక్షేత్ర పథహింస, సయయముయొక్క తిరస్కరింపక పోవుట సర్వజనోపయోగముగల అరణ్యములు చెరువులు మొదలగునవి వివీతములు అట్టివివీత భూములను, వివీతప్రదేశములకు పోవుమార్గములను, వివీతప్రదేశ సంబంధములగు మార్గములు (అనగా కాలము మొదలగునవి) ఆక్రమించుట మొదలగు కృత్యములు, హింస, నియమితకాలము సమయము, నియమము సమయము. చేయదగిన వ్యవహార నియమమును గాని పరిష్కారమునకు నియమిత కాలమునుగాని, నియమమునుగాని అతిక్రమింపపోవుట సమయానపాకరణము అట్లు నియమితమగు సమయమును నియమమునుఉల్లంఘించినచో చేయదగినదండనము మొదలగువిషయములు గలది 11 ప్ర ఋణాదానము. ఋణమును పుచ్చుకొనునపుడు సాక్షివ్యవహారము, వృద్ధి నిర్ణయము మొదలగు విషయములు గలది 12 ప్ర ఔపనిధికము ఉపనిధి, ఋణమును గ్రహించునపుడు ఋణముకంటె ఎక్కువ వెలగలవస్తువు అప్పిచ్చువానియొద్దనుంచబడినది. (తాకట్టువస్తువు) దీనిని సంబంధించిన వ్యవ

హారము. 13 ప్ర. దాసకల్పము స్త్రీనిగాని పురుషునిగాని బానిసగా క్రయవిక్రయముల చేయుట, దాసీదాసులసొత్తు మొదలగు విషయముల వ్యవహారముగలది. 14 ప్ర. కర్మకర కల్పము, సంభూయ సముత్థానము ఇందు పని చేయు కూలిమనుష్యుడుగాని వారిసంఘముగాని చేయదగినపని అందలి నిబంధనములు, యజమానికిని కూలీలకును మధ్యగలుగు వివాదములు వాటి పరిష్కారములు మొదలగు విషయముల నిర్ణయముగలదు కూలిపని అనగా డబ్బుపుచ్చుకొనిచేయుపనులన్నియు చేర్పబడినవి యజ్ఞమునందలి ఆర్త్విజ్యముగూడ కూలిగ గణింపబడినది. 15 ప్ర విక్రీతక్రీతానుశయము అమ్మబడినది విక్రీతము. కొనబడినది క్రీతము. అమ్మకమునకు ధనముసుగ్రహించి వస్తువు నియ్యకపోవుట మొదలగు విషయములందలి వివాదములు విక్రయ ద్రవ్యమునిచ్చుటకు వస్తుభేదముచే గడువు మొదలగు విషయములిందుగలవు 17 ప్ర. దత్తానపాకరణము అస్వామి విక్రయము, స్వస్వామి సంబంధము అనువిషయములు గలది తత్కాలోపయోగము కొరకుగాని సంరక్షించుటకుగాని ఇతర కారణాంతరములచేగాని ఒకరియొద్దనుంచబడినది దత్తము. దానిని సంబంధించిన నియమము నతిక్రమింపక తిరిగియిచ్చుట దత్తానపాకరణము (దతశ్యఅనపాకర్మ) తనదికాని వస్తువును విక్రయించుట అస్వామి విక్రయము తనకు తనసొమ్మునందుగల (హక్కు) అధికారము ఎప్పుడుతగ్గును. ఈవిషయములు వీటిని సంబంధించిన విషయములనిర్ణయము ఇందు గలదు 17 ప్ర సాహసము. ఇతరుల పశు ద్రవ్యాదులుగాని మనుష్యులనుగాని సాహసముచే తాను ఉపయోగించుట సాహస కృత్యము. వస్తుభేదముచే వేయదగినదండనము ఇందు వివరింపబడినది 18 ప్ర. వాక్పారుష్యము, సత్యముగాని అసత్యముగాని పరకీయ దోషము నుద్ఘాటనముచేయుట, నిందించుట, భయపెట్టుట ఇత్యాదికము వాక్పారుష్యము. వీటిభేదములు వాటి చేసగు శిక్షాభేదములు. 19 ప్ర దండపారుష్యము ముట్టుకొనుట, గెంటుట, కొట్టుట మొదలగునవి దండపారుష్యము. పరకీయ వృక్షాదులను ఛేదించుటయు ఇందు చేర్పబడినది. ఇట్టికృత్యములందు వేయదగినశిక్షలు ఇందుగలవు. 20 ప్ర. ద్యూత సమాహ్వయము ప్రకీర్ణవిషయములు నియమితకాలమందు నియమిత స్థలమందుగాక ప్రభుత్వానుమతిలేక జూదమాడినచో వేయదగు శిక్షాభేదములు, ఇతర అపరాధములు వాటికి వేయదగిన శిక్షలు మొదలగు విషయములు గలవు. ఇది తృతీయాధికరణము

మూ॥ 4. చతుర్థాధికరణము, కంటకశోధనము
కారుకరక్షణమ్। వైదేహకరక్షణమ్। ఉపనిపాతప్రతీకారః। గూఢాజీవినాంరక్షా। సిద్ధవ్యంజనైర్మాణవప్రకాశనమ్ । శంకారూపకర్మాభిగ్రహః। ఆశుమృతకపరీక్షా । వాక్యకర్మానుయోగః । సర్వాధికరణరక్షణమ్। ఏకాంగవధనిష్క్రియః । శుద్ధశ్చిత్రశ్చదండకల్పః। కన్యాప్రకర్మ। అతిచారదండః॥ ఇతి కంటకశోధనం చతుర్థ మధికరణమ్.

1 ప్ర॥ కారుకరక్షణము ప్రభుత్వమునకు దేశమునకు ద్రోహముచేయువారు కంటకములు, అట్టివారు లేకుండాచేయుట, దేశోపకారులను రక్షించుట కంటకశోధనమును ఈ నాల్గవ అధికరణమున చెప్పబడును. అందు మొదటిది కారుకరక్షణము. కారుకులనగా శిల్పవృత్తిచే జీవించువారు. కర్రపని చేయు వడ్రంగులు, లోహపుపనిచేయు కమ్మరులు, బంగారపు పనివాండ్రు, వస్త్రము లనునేయు సాలీలు మొదలగువారు, వస్త్రములను శుద్ధిచేయు రజకులు, పట్టు. ఉన్ని నేయువారు రత్నముల గనులందు లోహముల గనులందు పనిచేయువారు, వర్తకులు వైద్యులు, నటులు మొదలగువారు వారు చేయు మోసములు మోసములు చేసిన యెడల వేయదగిన శిక్షలు, మొదలగు విషయములు ఇందుగలవు 2 ప్ర వైదేహక రక్షణము. వైదేహకులనగా వర్తకులు తూనికగగాని కొలతచేగాని కొనుట అమ్మట, చేయు

టలో తూనికమానములు కొలమానములు సరిగా నున్నదియు లేనిదియు పరీక్షించుట, తక్కువగా నున్నచో శిక్షించుట మొదలగు విషయము లిందుగలవు 3 ప్ర ఉపనిపాత ప్రతీకారము. దైవికములు, భౌతికములు, మొదలగు ఉప ద్రవములను నివారించు ఉపాయములిందుగలవు 4 ప్ర. గూఢాజీవుల రక్షణము అబద్ధసాక్ష్యము చెప్పువారు, లంచముపుగ్రహించు ఉద్యోగులు వ్యవహారములందు ఉపాయములను చెప్పి జీవించు లోకవ్యవహారజ్ఞులు(ఏజంట్లు), గ్రామములందు తగవులనుతీర్చు పెద్దమనుష్యులుగా నుండి రహస్యముగ ధనార్జనము చేయువారు మొదలగువారు రహస్యవ్యాపారము గలవారు వీరే గూఢాజీవులు వీరిని గనుగొనుట, శిక్షించుట ఇందుగలదు 5 ప్ర సిద్ధవ్యంజనములచే మాణవప్రకాశనము మంత్ర తంత్రములచే మోసగించు విద్యలు మాణవవిద్యలు ఆవిద్య గలవాడు మాణవుడు సిద్ధచిహ్నములచే మాణవులనెరింగి వారిని శిక్షించుట ఇందు గలదు 6 ప్ర శంకారూప కర్మాభిగ్రహము అనుమానముచేతను, స్వరూపముచేతను, కర్మ (పని) చేతను నేరము చేసినవారినెరుంగుట ఇందు గలదు, 7 ప్ర. ఆశుమృతకపరీక్ష శీఘ్రముగ మరణించినవాడు విషముచేగాని గొంతు కను పిసుగుట, ఉరిపెట్టుట, నీటముసుగుట మొదలగువాటిచేగాని దేనిచే మరణించినదియు తెలియుటకు లక్షణములిందు గలవు. 8 ప్ర. వాక్యకర్మానుయోగము నేరముచేసిన వానిని కార్యమునుబట్టియు, వాక్యములబట్టియు రెండిటిని బట్టియు గ్రహించుట వాక్యకర్మానుయోగము. రెండిటినిబట్టియు గ్రహించి నేరము చేసినవానిని ఎట్టివానిని ఎట్టిపనులందు నియోగింపవలెనో ఆవిషయమిందు గలదు. 9 ప్ర. సర్వాధికరణ రక్షణము రాజ్యపాలనమునందు గల రాజకీయశాఖలు అధికరణములు. అన్ని అధికరణము (శాఖ) లందునుగల అధ్యక్షులను వారివారి క్రింది ఉద్యోగులను, పరిశీలించుట, తప్పుచేసినయెడల శిక్షించుట ఇందుగలదు. 10 ప్ర ఏకాంగవధనిష్క్రియము కొన్ని నేరములందు ఒక్కొక్క అవయవమును ఖండించుట పెద్దనేరములందు కారాగార శిక్షయు, ధనదండము (జరిమానా), కొరడా మొదలగువాటిచే కొట్టుటయు చాలక కాలునుగాని చేతినిగాని కాలివ్రేలునుగాని చేతివ్రేలునుగాని లేక ఇతర కర్ణనాసాద్యవయవములనుగానిఛేదించుట శిక్షగా చెప్పబడినది. ఏనేరమునందు ఎట్టిశిక్ష విధింపవలెనో ఇందుగలదు. 11 ప్ర, శుద్ధము చిత్రము అగువండనపద్ధతి మిక్కిలిపెద్దనేరమునుచేసిన యెడల ఆనేరము చేసినవానిని వధింపవలెను అవధించుటను ఏనేరమునకెట్లు వధింపవలెను? ఒక్కొక్క నేరమునకు చిత్రవధ చేయవలెను కొన్ని నేరములకు శుద్ధవధ మాత్రమే చేయవలయును ఆవివరమిందు గలదు 12 ప్ర కన్యాప్రకర్మ ఒకకన్యనుచూపి మరియొక కన్యనిచ్చుట కన్యను బలాత్కరించుట (చెరుచుట) కన్యగాక యువతినైనను బలాత్కరించుట లేక వ్యభిచరించుట (పరయువతిని కామించుట) మొదలగు నేరములు, ఆనేరముల చేసిన నగుశిక్షలు ఇందుగలవు 13 ప్ర. అతిచార దండము ఇతరునిచే బలాత్కారముగ నభక్షమును తినిపించుట, బలాత్కారముగ పరగృహమునందు ప్రవేశించుట పరకీయ పశుక్షేత్రాది హింస మొదలగు నిరంకుశ వ్యాపారములు, వాటియందు వేయదగిన శిక్షలు ఇందు వివరింపబడినవి ఇది కంటకశోధనమను నాల్గవయధికరణము.

మూ॥ 5. పంచమాధికరణము, యోగ వృత్తము,

దండకార్మికమ్। కోశాభి సంహరణమ్।
భృత్యభరణీయమ్।
అనుజీవివృత్తమ్। సమయాచారికమ్। రాజ్య ప్రతిసంధానమ్। ఏకైశ్వరమ్। ఇతియోగవృత్తిం
పంచమమధికరణమ్.

యోగమనగా ఉపాయము యుక్తి, వీటిని ప్రవర్తింపచేయుట యోగవృత్తము. అందు 1 ప్ర దండకార్మికము. ప్రభువు విషయమై

కంటకములుగను రాజ్యపాలనమునందు కంటకములుగనుండు స్వపక్షీయులనుగాని ఇతరులనుగాని గ్రహించి ఉపాయముచే శిక్షించుట దండకార్మికము 2 ప్ర. కోశాభిసంహరణము. ధనాగారము-కోశము ధనసమూహమును వృద్ధి చేయవలయును. దానికి వలసిన ఉపాయములు ప్రభుత్వము గ్రహింపవలసిన కరము (పన్ను) ఆపన్నును సరిగ చెల్లింపనిచో వేయదగినశిక్ష, మొదలగు విషయములుగలవు. 3 ప్ర. భృత్యభరణీయము. ప్రభువు తనసంపద ననుసరించి భృత్యవర్గమును భరించుట ద్వారపాలకాది భృత్యులు మంత్రి పురోహిత సేనానాయకాదులు గజాశ్వాద్యధ్యక్షులు మొదలగువానిని ఎట్లు చూడవలెను? ఎట్లు పోషించవలెను? ఇత్యాదికమిందు గలదు. 4 ప్ర. అనుజీవివృత్తము. ప్రభువుతో మైత్రిగలిగి ప్రభువునకు ప్రియహితమగు ప్రవర్తనగలవారు అనుజీవులు. వారి నడవడిక మొదలగునది యిందుగలదు. 5 ప్ర. సమయాచారికము ఆ అనుజీవులు ప్రభువు యెుద్ద ప్రవర్తింపవలసిన పద్ధతి ఇందుగలదు. 6 ప్ర. రాజ్యప్రతి సంధానము, ఏకైశ్వర్యము ఇందు గలవు ప్రభువునకు సంతతిలేక రాజ్యము విచ్ఛిన్నమగునపుడును ఇతర కారణములచే రాజ్యతంత్రము భగ్నము అగునపుడు గాని రాజ్యమును భగ్నముగాకుండా కాపాడుట రాజ్యప్రతి సంధానము అట్టి సమయములందు ప్రభువుతో సమానమైన ఐశ్వర్యముగలవానినిగ చూచుట, సమానమైన ఐశ్వర్యము గలవానిగ భావించి కార్యమును సాధించుట మొదలగు రాజ్యతంత్రమిందు గలదు ఇది యోగవృత్తమను ఐదవ యధికరణము.

ఆంధ్రతర్క సంగ్రహము

అనుమాన పరిచ్ఛేదము

శ్రీ కుప్పా బైరాగిశాస్త్రి

౭

మూ॥ సవ్యభిచార విరుద్ధ సత్ప్రతిపక్షాఽ సిద్ధబాధితాః పంచహేత్వాభాసాః.

ఇంతవరకు సద్ధేతువులను నిరూపణచేసి అసద్ధేతువులను నిరూపణచేయదలచి వాట్ల విభాగము వేయుచున్నారు "సవ్యభిచార" అని అసద్ధేతువులనే, హేత్వాభాసలు అని యందురు "హేతువత్ ఆభాసంత ఇతి" అను వ్యుత్పత్తిచే హేతువుల మాదిరి కనబడునవి హేత్వాభాసలనియు లేక అసద్ధేతువులనియు చెప్పుదురు.

ఉన్నవస్తువును తెలుపుటకుగాను ఒకరు పర్వతము, నిప్పుగలది పొగవలన అని చెప్పగా పొగవలన అనునది పంచమీవిభక్తిక పదముగాన అటులనే పంచమీవిభక్తికపదము లన్నియు అనుమితిని కలుగజేయును అను భ్రమకలుగజేసి యింకొకడు "నీటిమడుగు, నిప్పుగలది, పొగవలన" అని ప్రయోగించగా రెండవవాడు ప్రయోగించిన హేతువునందు దోషము చూపుటకు దుష్టహేతువులను నిరూపించుట అవసరమైనది

హేతువత్ ఆభాసంత ఇతి హేత్వాభాసాః

అనుచోట వత్ అనుపదమునకు సాదృశ్యము ఆఙ్ పూర్వక భాసధాతువునకు భ్రమయు ఆభాసంత ఇతి అనుచోట ధాతూత్తరవర్తి ఆఖ్యాతకు విషయత్వము అర్థములు హేతు పదార్థమైన సద్ధేతువు ఆధేయత్వ సంబంధము చేత సాదృశ్యమందును, సాదృశ్యమునకు ఆభాసయందు ప్రకారతా నిరూపకత్వ సంబంధముచేతను అన్వయము చెప్పుకొనగా సద్ధేతువుయందలి సాదృశ్యము ప్రకారముగా గల భ్రమ విషయములు హేతువులు అని తెలుగులో అర్థము వచ్చును ఇవియే దుష్ట హేతువులు దుష్టత్వమనగా దోషముకలిగి యుండుట దోషములు, వ్యభిచార, విరోధ, సత్ప్రతిపక్ష అసిద్ధి, బాధలని అయిదు విధములు—

దోషముల లక్షణము తెలిపిన దోషము కల దుష్టహేతువులను తెలుసుకొనవచ్చును గనుక దోషముల సామాన్య లక్షణమును చెప్పుచున్నాము

అనుమతి, దాని కరణము ఈ రెంటిలో ఒకదాని యందలి ప్రతిబధ్యతచే నిరూపితమైన ప్రతిబంధకత కల యథార్థ జ్ఞానములో విషయమగుట లోకములో ఆ వస్తువు కలది అనుబుద్ధిని ఆవస్తువుయొక్క అభావము కలది (ఆవస్తువు లేనిది) అను నిశ్చయము ప్రతిబంధించును. ఆవస్తువుకలది అనుజ్ఞానము ప్రతిబధ్యము గాన ఆ జ్ఞానమందు ప్రతిబధ్యత యుండును ఆ వస్తువుయొక్క అభావము కలది అను నిశ్చయము ప్రతిబంధకముగాన నిశ్చయమందు ప్రతిబంధకతయుండును ప్రతిబధ్యతకు ప్రతిబంధకతకు నిరూప్య నిరూపక భావము. ప్రతిబధ్యతా నిరూపితము ప్రతిబంధకత అగును. నీటిమడుగు నిప్పుగలది అనుచోట, నీటిమడుగు నిప్పుయొక్క అభావము కలది. (నిప్పులేనిది) అను నిశ్చయము బాధనిశ్చయము అని అందురు, యీ బాధ జ్ఞానము ప్రతిబంధకము యీ జ్ఞానమందు ప్రతిబంధకత ఉన్నది మడుగు నిప్పుగలది అను అనుమితి ప్రతిబధ్యము ఈ జ్ఞానమందు ప్రతిబధ్యత యున్నది. ప్రతిబధ్యత ప్రతిబంధకతలకు నిరూప్య నిరూపక భావసంబంధము గాన మడుగు నిప్పుగలది అను అనుమితి యందలి ప్రతిబధ్యతచే నిరూపితమైన ప్రతిబంధకత మడుగునిప్పు యొక్క అభావము గలది. (నిప్పులేనిది) అను యథార్థజ్ఞానమందుగలదు ఆ జ్ఞానములో మడుగు నిప్ప

యొక్క అభావముగలది అనునది విషయము గాన యథార్థజ్ఞాన విషయత్వము మడుగు నిప్పు లేనిదిఅను బాధరూపదోషమందుగలదు అందుచే అయిదుదోషములలో ఒకటి అయిన బాధయందు సమన్వయమైనది ఇటులనే ఇతర దోషములయందును సమన్వయము చేసుకొనవలయును

దోషసామాన్య లక్షణములో అనుమతి లేక దానికరణము అని చెప్పినాము దాని కరణము అని చెప్పక అనుమతి యందిలి ప్రతిబధ్యతా అని మాత్రమే చెప్పిన వ్యభిచార రూపదోషమందు అవ్యాప్తివచ్చును. యీలక్షణము అన్నిదోషముల యందును సమన్వయము కావలయును పర్వతము, నిప్పుగలది ప్రమేయమగుటవలన, అనుచోట సాధ్యము యొక్క అభావముగలదాని యందు హేతువు ఉండుట అను సాధారణ రూప దోషము, అనుమతిని ప్రతిబంధించక దానికి కరణమైన వ్యాప్తిజ్ఞానమును మాత్రమే ప్రతిబంధించును. గాన లక్షణములో తత్కరణ అని లేనిచో అవ్యాప్తివచ్చును అందుకొరకు దానికరణము అనికూడా ఉండవలయును అనుమతి దానికరణము యీ రెంటిలో ఒక దానియందలి ప్రతిబధ్యతచే నిరూపితమైన ప్రతిబంధకతకల యథార్థజ్ఞానములో విషయమగుట దోషసామాన్యలక్షణము—

మూ॥ సవ్యభిచారోఽనైకాంతికః। సత్రివిధః సాధారణ అసాధారణ అనుపసంహారిభేదాత్

వరుసలో వచ్చిన సవ్యభిచారమను దుష్టహేతువును విభాగము చేయుచున్నాడు సాధారణమని అసాధారణమని అనుపసంహారియని సవ్యభిచారము మూడువిధములు వ్యభిచారము దోషము వ్యభిచారముగలది సవ్యభిచారము దుష్టహేతువు అటులనే సాధారణ్యము అసాధారణ్యము, అనుపసంహారిత్వములు దోషములు, అవికలవి దుష్టములు—

ఏకాంతము అనగా నియమముగలది, న ఏకాంతికః అనైకాంతికః, నియమము లేనిది అనైకాంతికము

మూ॥ తత్ర సాధ్యాభావ వద్వృత్తిః సాధారణః యథాపర్వతో వహ్నిమాన్ ప్రమేయత్వాత్ అత్రప్రమేయత్వ స్యవహ్న్యభావవతి హ్రదే విద్యమానత్వాత్.

సవ్యభిచారమును విభాగముచేసి మొదటిదైన సాధారణమునకు లక్షణము చెప్పుచున్నాడు. తత్రఅని సాధారణ అసాధారణము అనుపసంహారులలో సాధారణము, (సాధ్యాభావవద్వృత్తిః) సాధ్యము యొక్క అభావముగల దానియందు ఉండనది పర్వతము నిప్పుగలది ప్రమేయమగుటవలన అనుచోట ప్రమేయమగుట అను హేతువు నిప్పు యొక్క అభావము (నిప్పులేని) గల నీటి యందు ఉండుటను కలిగియున్నందున సాధారణ రూపదుష్టమైనది

ఇచ్చట సాధారణ్యము దోషము. దాని లక్షణము సాధ్యాభావ వద్వృత్తిత్వము అనగా సాధ్యము యొక్క అభావమేగలదాని యందు ఉండుట సాధ్యము యొక్క అభావము అనగా సాధ్యము ప్రతి యోగిగాగల అభావము సాధ్యము ప్రతియోగి గాన సాధ్యమందు ప్రతి యోగిత ఉండును. ఈ ప్రతియోగితాకము అభావమగును. ప్రతి యోగితాక మనగా ప్రతి యోగితా నిరూపకము సాధ్యమందలి ప్రతి యోగితచే నిరూపకమైన అభావము కలదాని యందు ఉండుట సాధారణ్యమునకు లక్షణము

పర్వతము నిప్పుగలది ప్రమేయమగుట అను హేతువు సాధారణ రూప దుష్టహేతువు. దోషముగలది దుష్టముగాన సాధారణ్య రూపదోషము ప్రమేయమగుట (ప్రమేయత్వ) యందు సమన్వయము చేయవలయును.

సాధ్యమునిప్పు నిప్పు యందలి ప్రతి యోగితచే నిరూపకమైన అభావము. నిప్పు లేదు అను ప్రతీతి సిద్ధమైన నిప్పు అభా

వము అది కలదినీరు అచ్చటగూడాఉన్నది ప్రమేయత్వము ప్రమేయత్వమనగా ప్రమలో విషయమగుట ప్రమఅనగా నిజమైన జ్ఞానము లోకములోసర్వవస్తువులు నిజమైన జ్ఞానము (ఈశ్వర జ్ఞానము)లో విషయములే ఆ విషయత్వము అన్నిటియందు ఉండును. అందుచేత నీటియందుగూడా ప్రమేయత్వము ఉన్నది. నీటియందు ఉండుట ప్రమేయత్వ మందు కలదని అర్థము సాధ్యాభావవత్ అయిన నీటియందు ఉండుట ప్రమేయత్వ మందు కలదు గాన సాధ్యము యొక్క అభావము కలదాని యందు ఉండుట అను సాధారణ్యము (సాధారణ లక్షణము)సాధా రణరూపదుష్టమైన ప్రమేయత్వమందుగలదు. గాన లక్షణ సమన్వయమైనది. దోషసామాన్య లక్షణము సాధ్యము యొక్క అభావము కల దానియందు ఉండుట అను దోషములో సమన్వయము చేయవలయును. అనుమతి లేక దానికరణము యీ రెంటిలో ఒకటి అనగా కరణమును తీసికొన వలయును పర్వతము నిప్పుగలది ప్రమేయమగుట వలన అనుచోట అనుమతి కరణము నిప్పుచే వ్యాప్తమైన ప్రమేయత్వము అను వ్యాప్తి జ్ఞానము వ్యాప్తి రెండురకములు. పూర్వ పక్ష వ్యాప్తి సిద్ధాన్తవ్యాప్తి అని. దీని విష యము ముందుగ్రంథములో చెప్పబడును ఇచ్చట పూర్వపక్షవ్యాప్తిని స్వీకరించిన పక్ష మందు వ్యాప్తిజ్ఞాన స్వరూపము యీ క్రింది విధముగా నుండును సాధ్యముయొక్క అభావముకలదాని యందు ఉండని హేతువు అని ప్రకృతములో నిప్పుయొక్క అభా వముకలదానియందు ఉండని ప్రమేయత్వము వ్యాప్తిజ్ఞానము యీ వ్యాప్తిజ్ఞానమును నిప్పుయొక్క అభావము కలదానియందు ఉన్నది, ప్రమేయత్వము అను సాధారణ్య నిశ్చయము ప్రతిబంధించు చున్నది. దానిని కలిగియున్నది అను జ్ఞానమును గురించిదాని యొక్క అభావము కలిగియున్నది అను నిశ్చయము ప్రతిబంధకము అటులనే దాని యొక్క అభావముచే వ్యాప్తమైనది కలిగి యున్నది అను నిశ్చయముగూడా ప్రతిబంధ కమే ప్రకృతములో నిప్పుయొక్క అభా వము కలదానియందు ఉండనిది ప్రమేయత్వ ము అనుఅనుమితి కరణబుద్ధిని నిప్పుయొక్క అభావముకల నీరుయందు ఉన్నది ప్రమే యత్వము అను నిశ్చయము (తద్వత్తాబుద్ధి నితదభావ వత్తా నిశ్చయత్వేన) ప్రతిబంధిం చునుగాన ప్రతిబంధకత ఆ నిశ్చయమందు ఉండుటచే ప్రతిబంధక యథార్థజ్ఞానము నిప్పుయొక్క అభావముకల నీటియందు ఉన్నది ప్రమేయత్వము అనుజ్ఞానము దాని విషయము నిప్పుయొక్క అభావముకల నీటియందు ఉండుట అనునది విషయత్వము. నిప్పుయొక్క అభావముగల నీటియందు ఉండుట అను సాధారణ్య రూపదోషమందు ఉండుటచే సమన్వయమైనది

మూ॥ సర్వ సపక్ష విపక్ష వ్యావృత్తో హేతుః అసా ధారణః। యథాశబ్దోనిత్యః శబ్దత్వాత్ అత్ర శబ్దత్వం సర్వేభ్యోనిత్యేభ్యః అని త్యేభ్యశ్చ వ్యావృత్తం, శబ్దమాత్ర వృత్తి,

అసాధారణమును చెప్పుచున్నాడు సర్వ సపక్షేతి. ఒకడు శబ్దము నిత్యము శబ్దమగుట వలన అని నప్పుడు ఈశబ్దమగుట అను హేతువు అసాధారణ రూపదుష్టహేతువు సపక్షములు అనగా సాధ్యనిశ్చయములో విశేష్యములు విపక్షములు అనగా సాధ్యా భావ నిశ్చయములో విశేష్యములు శబ్దము పక్షము నిత్యత్వము సాధ్యము శబ్దత్వము హేతువుఅయిన స్థల ములో శబ్దము పక్షముగాన అనగా సాధ్యము ప్రకారముగా గల సందేహ విశేష్యమే గాన సపక్షము శబ్దముగాదు సపక్షములు సాధ్య ప్రకారక నిశ్చయ విశేష్యములు ఆకాశా దులు, విపక్షములు సాధ్యాభావ ప్రకారక నిశ్చయ విశేష్యములు కుండ,చెట్టు మొదలగు నవి. వీటియందు ఉండకపోవుటయే వ్యావృ త్తత్వము! శబ్దత్వము శబ్దమందు మాత్రమే ఉండునుగాన సర్వసపక్షములైన ఆకాశా

దులయందు సర్వవిపక్షములయిన కుండ
మొదలగు వాట్లయందును ఉండకపోవుట
శబ్దత్వ రూప అసాధారణమందు ఉండుటచేత
సమన్వయమైనది వ్యాప్తిజ్ఞానము హేతు
వ్యాపకమైన సాధ్యముయొక్క అధికరణ
మందు ఉండుటఅనునది గాన ప్రకృతము
సర్వసపక్షములు అనగా సాధ్యాధికరణములు
అందు వ్యావృత్తము (ఉండకపోవుట)
హేతువు అయిన శబ్దత్వమందు కలదు గాన
సాధ్యాధికరణమందు ఉండుటఅను అంశలో
ప్రతిబంధకమైనందున దోషమైన సాధ్యాధి
కరణ వృత్తిత్వా భావరూప దోషమందు
సమన్వయముగుండా అయినది. మూలములో
అత్ర అనగా శబ్దోనిత్యః శబ్దత్వాత్ అను
చోట శబ్దత్వంవా శబ్దత్వము అను హేతువు
సర్వేభ్యోః నిత్యేభ్యోఃనిత్యములయినసమస్త
ఆకాశాదులయందును అనిత్యేభ్యః అనిత్యము
లైన సమస్త ఘటపటాదులయందు వ్యావృ
త్తం-ఉండనిది అని అర్థము

**మూ॥ అన్వయవ్యతిరేక దృష్టాంత రహితోఽ
నుపసంహారి। యథా సర్వమనిత్యం ప్రమే
యత్వాత్ అత్ర సర్వస్యాపి పక్షత్వాత్
దృష్టాంతోనాస్తి-**

అన్వయ దృష్టాంతములేని దిన్నీ వ్యతిరేక
దృష్టాంతములేని దిన్నీ అనుపసంహారి.
సర్వము అనిత్యమైనది ప్రమేయమగుట
వలన అనుచోట సర్వము పక్షముగాన పక్ష
మందు సాధ్యసంశయముండుటచే సాధ్యనిశ్చ
యములేదు అనగా సాధ్యనిశ్చయములో
విశేష్యమైనది దీనినే సపక్షమనియు అన్వయ
దష్టాతమనియు చెప్పుదురు. పర్వతము నిప్పు
గలది పొగవలన అనుచోట ఎచట ఎచట
పొగ ఉండునో అచట అచట నిప్పుఉండును
ఎటులననగా వంటియిల్లు ఇచ్చట వంటయిల్లు
అన్వయదృష్టాంతను ఎచట ఎచట సాధ్యము
యొక్క అభావము (అనగా నిప్పుయొక్క)
ఉండునో అచట అచట హేతువుయొక్క
అభావము(పొగయొక్కఅభావము)ఉండును
ఎటులననగా నీరు ఇచ్చట నీరు విపక్షము
అనగా వ్యతిరేక దృష్టాంతము అన్వదృష్టాత
మువ్యతిరేకదృష్టాతములేకపోవుట సర్వము
అనిత్యము ప్రమేయమగుటవలన అనుచోట
ఉండుటచే సమన్వయ మయినది ఇచ్చట
అన్వయ దృష్టాతాదులు లేక పోవుటచేత
వ్యాప్తికలుగదు వ్యాప్తిలేనిచో పరామర్శ
ఉండదు తద్వారా అనుమితి కలుగదు దోష
లక్షణమైన అనుమితి దానికరణమువిట్లలో
యేదియో ఒకదానియందలి ప్రతిబధ్యతచే
నిరూపితమున ప్రతిబంధకత కలిగి యుండుట
అనుదోషలక్షణము లేకపోయినప్పటికీ పరం
పరయా అను ప్రతిబంధకత్వము ఇచ్చట
ఫలముగా చెప్పవలయును—

**మూ॥ సాధ్యాభావవ్యాప్తో హేతుర్విరుద్ధః। యథా
శబ్దోనిత్యః కార్యత్వాత్। అత్రకార్యత్వం
నిత్యత్వా భావేన అనిత్యత్వేన వ్యాప్తం।**

దుష్టములలో రెండవది అయినవిరుద్ధము
నకు లక్షణము చెప్పుచున్నాడు సాధ్యాభావ
వ్యాప్తమని శబ్దము నిత్యము కార్యమగుట
వలన అని చెప్పినప్పుడు యీ కార్యత్వ
హేతువు విరుద్ధ హేతువు—

సాధ్యాభావవ్యాప్తమైనది విరుద్ధహేతువు
సాధ్యాభావేన వ్యాప్తఃసాధ్యాభావవ్యాప్తిః
వ్యాప్తః అనగా వ్యాప్త్యాశ్రః అని ఇచ్చట
వ్యాప్త పదముచే వ్యతిరేక వ్యాప్తిని తీసు
కొనవలయును. దాని స్వరూపము తదభావ
వ్యాపకీభూత అభావప్రతియోగిత్వ మనిదాని
యొక్క అభావాధికరణమందలి అభావము
నకు అప్రతియోగి యయిన అభావమునకు
ప్రతియోగి అగుట సాధ్యాభావము
మొదటి అభావములోకి సమన్వయించగా
సాధ్యాభావాభావముఅని అర్థమురాగా తద
భావాభావము తత్స్వరూపముగా సాధ్య
రూపమై సాధ్యముయొక్క అధికరణ మం
దలి అభావమునకు అప్రతియోగి యయిన
అభావమునకు ప్రతియోగియగుట విరుద్ధము
నకు లక్షణము అని తెలును సాధ్యము
నిత్యత్వము దానికి అధికరణము ఆకాశా
దులు అచ్చట ఉన్న అభావము కార్యత్వా

భావముగాని కార్యత్వా భావా భావము (కార్యత్వ స్వరూపము) గాదు అందుచే అచట అభావమునకు ప్రతియోగి కార్యత్వము అప్రతియోగి యయిన అభావము కార్యత్వా భావము దానికిప్రతియోగి కార్యత్వముగా నతత్ప్రతియోగిత్వము కార్యత్వమందు ఉండుటచే సమన్వయమైనది మూలములో అత్ర-శబ్ద నిత్యముకార్యమగుటవలన అనుచోట కార్యత్వం-కార్యత్వమను హేతువు సాధ్యాభావమైన యేనిత్య త్వాభావము కలదో ఆనిత్యత్వాభావరూపమైన అనిత్యము చేత వ్యాప్తం-అనగా వ్యాప్త్యాశ్రయము.

మూ॥ యస్య సాధ్యాభావసాధకం హేత్వన్తరం విద్యతే సస్సత్ప్రతి పక్షః। యథాశబ్దోనిత్యః శ్రావణ త్వాత్ శబ్దో అనిత్యః కార్యత్వాత్।

యస్య శ్రావణత్వరూప హేతువుకు సాధ్యాభావ సాధకం సాధ్యం- నిత్యత్వం సాధ్యాభావః-నిత్యత్వా భావము. తత్సాదకం-సాధ్యాభావమైన అనిత్యత్వమునకు సాధకమైన, హేత్వన్తరం- మరియొక హేతువు విద్యతే-ఉన్న, సః-ఆమొదటి హేతువుశ్రావణత్వరూపమైనది సత్ప్రతి పక్షము అని చెప్పబడును- ఇచ్చట నిత్యత్వాభావముచే వ్యాప్తమైన కార్యత్వము గలది శబ్దము అనుసత్ప్రతి పక్ష నిశ్చయము శబ్దము నిత్యము అను అనుమితిని ప్రతిబంధించును గనుక ప్రతిబంధకయథార్థ జ్ఞానవిషయత్వ రూపదోష లక్షణము నిత్యత్వాభావముచే వ్యాప్తమైన కార్యత్వము గలది శబ్దము అను సత్ప్రతి పక్షరూపదోషమందు ఉండుటచేత ఆదోషము గల, దుష్టము శబ్దము నిత్యము శ్రావణ్వము వలన అనుచోట శ్రావణత్వమందు సమన్వయమైనది శ్రావణత్వమనగా శ్రవణేంద్రియము (చెవు) వలన గలిగిన ప్రత్యక్షములోవిషయమగుట -

మూ॥ అసిద్ధ స్త్రి విధః ఆశ్రయాసిద్ధో స్వరూపాసిద్ధోవ్యాప్యత్వాసిద్ధశ్చేతి। ఆశ్రయా సిద్ధో యథాగగనార విందంసురభి అరవిందత్వాత్। సరోజారవిందవత్। అత్రగగనారవిందం ఆశ్రయః। సచనాస్త్యేవ।

అసిద్ధము ఆశ్రయాసిద్ధమని స్వరూపాసిద్ధమని వ్యాప్యత్వాసిద్ధమని మూడు విధములు—ఆకాశతామర పుష్పము పరిమళము కలది తామర పుష్పమగుటవలన చెరువు యందలి తామర పుష్పమువలె అనుచోట తామరపుష్పమగుట అను హేతువు ఆశ్రయాసిద్ధము. ఆశ్రయము ఆకాశ తామర పుష్పము, అది అప్రసిద్ధము ఆకాశమందు తామర పుష్పము లేదు గాన ఇచ్చట ఆకాశతామర పుష్పము పరిమళముగలది అను అనుమితి,ఆశ్రయరూప పక్షమైనఆకాశ తామర పుష్పము అప్రసిద్ధముగాన అనుమితిని ప్రతిబంధించును—

మూ॥ స్వరూపా సిద్ధో యథా శబ్దో నిత్యః చాక్షుషత్వాత్-అత్ర చాక్షు షత్వం శబ్దేనాస్తి శబ్దస్య శ్రావణత్వాత్-

శబ్దము నిత్యమైనది చాక్షుషము అగుట వలన అనుచోట చాక్షుషము అగుట అను హేతువు స్వరూపాసిద్ధము చాక్షుషము అనగా చక్షురింద్రియము (కన్ను) వలన కలిగిన ప్రత్యక్షములో విషయమగుట శబ్దమందు చాక్షుషత్వము (కంటివలన కలిగిన ప్రత్యక్షములో విషయమగుట) లేదు ఎందుకనగా శబ్దము శ్రావణముగాన (చెవువలన కలిగిన ప్రత్యక్షములో విషయమగుట) ఎప్పుడయితే హేతువైన చాక్షుషత్వము శబ్దమందుఉండదో నిత్యత్వముచే వ్యాప్తమైన చాక్షుషత్వము కలది శబ్దము అనుపరామర్శ కలుగదు తద్వారా అనుమితి ప్రతిబంధకత్వము ఫలము—

**మూ॥ సోపాధికో వ్యాప్యత్వాసిద్ధః సాధ్య వ్యాపకత్వేసతి సాధనా వ్యాపకత్వం ఉపాధిత్వం। సాధ్య సమానాధి కరణాత్యంతా భావాప్రతి యోగిత్వం సాధ్య వ్యాపకత్వం। సాధన వన్నిష్ఠాత్యం తాభావ ప్రతియోగిత్వం సాధనా వ్యాపకత్వం। యథాపర్వతో ధూమవాన్ వహ్నేరిత్యత్ర ఆర్ద్రేన్ధన సంయోగః ఉపాధిః యత్రధూమః తత్రఆర్ద్రేన్ధన సంయోగ ఇతి సాధ్య వ్యాపకత్వం। యత్ర వహ్నిః తత్ర ఆర్ద్రేన్ధన సంయోగ ఇతినాస్తి అయోగోలకే ఆర్ద్రేన్ధన సంయోగాభావాత్। ఏవంసాధ్య

వ్యాపకత్వే సతిసాధనా వ్యాపకత్వాత్ ఆర్ద్రేన్ధన సంయోగః ఉపాధి సోపాధికత్వాత్ వహ్నిమత్వం వ్యాప్యత్వాఽసిద్ధం।

ఉపాధి కలిగినటువంటిది, వ్యాప్యత్వాసిద్ధము సాధ్యవ్యాపకమైసాధనావ్యాపకమైనది ఉపాధి యనబడును పర్వతముధూమము కలది (అగ్ని) నిప్పువలన అనుచోట తడికట్టెపేళ్ళ సంయోగము (ఆర్ద్రేంధన సంయోగము) ఉపాధి ఆ తడికట్టె పేళ్ళసంయోగమందు సాధ్యవ్యాపకత్వము సాధనావ్యాపకత్వాలు సమన్వయము చేయవలయును సాధ్య వ్యాపకత్వమనగా సాధ్యాధికరణమందు ఉన్న అభావమునకు అప్రతియోగి యగుట సాధనా వ్యాపకత్వమనగా సాధనము (హేతువు) యొక్క అధికరణమందు ఉన్న అభావమున ప్రతియోగి యగుట పర్వతము పక్షమైపొగ(ధూమము) సాధ్యమై, నిప్పుహేతువైన(సాధనమైన) స్థలములో తడికట్టె పేళ్ళసంయోగము ఉపాధి గాన దానియందు సమన్వయము చేయవలయును సాధ్యము పొగ ఆ పొగకు అధికరణము వంటయిల్లు మొదలగునవి. అచ్చట తడికట్టె పేళ్ళసంయోగము ఉన్నది. వాట్ల అభావములేదు తడిపేళ్లులేనిచో పొగరాదు అధికరణమందు ఉన్న అభావము కుండ పగైరాల అభావము దానికి ప్రతియోగికుండ అప్రతియోగి తడికట్టెపేళ్ళ సంయోగము. సాధనము నిప్పు దానికి అధికరణము బాగుగాకాలిన యినుముముక్క అచ్చట ఉన్న అభావము తడికట్టెల సంయోగముయొక్క అభావము. అచ్చట పొగఉండదుగనుక తడికట్టెల సంయోగము లేదని చెప్పవలయును ఆ అభావమునకు ప్రతియోగి తడికట్టె పేళ్ళ సంయోగము గాన సాధ్యవ్యాపకమున్నూ సాధనా వ్యాపకమున్నూ అయినది తడికట్టె పేళ్ళసంయోగము దీనిని ఉపాధియందురు యీఉపాధి కలది గనుక నిప్పురూపహేతువు సోపాధికమైనది. అందువలననే వ్యాప్యత్వాసిద్ధము అని అందుము దీనిని చూపించుటకే మూలములో యత్రధూమః తత్ర ఆర్ద్రేన్ధన సంయోగః అని సాధ్యవ్యాపకత్వమును, యత్ర వహ్నిః తత్ర ఆర్ద్రేన్ధన సంయోగ ఇతినాస్తి. అయోగోలకే ఆర్ద్రేన్ధన సంయోగాభావాత్ అని సాధనా వ్యాపకత్వమున్ను చూపినారు. గాన సోపాధికము గనుక నిప్పుగలిగి యుండుట అను హేతువు వ్యాప్యత్వాసిద్ధము అయినది

మూ॥ యస్య సాధ్యాభావః ప్రమాణాంతరేణ నిశ్చితః సబాధితః। యథా వహ్నిరనుష్ణః పదార్థత్వాత్ జలవత్। అత్ర అనుష్ణత్వం సాధ్యం। తదభావః ఉష్ణత్వం త్వాచ ప్రత్యక్షేణ గృహ్యతి ఇతిచోద్యం.

ఇత్యనుమాన పరిచ్ఛేదః
సమాప్తః

యే హేతువుయొక్క సాధ్యముయొక్క అభావము ఇతర ప్రమాణముచేత గ్రహించబడునో ఆ హేతువు బాధితమనేదుష్టహేతువు నిప్పువేడిలేనిది పదార్థము అగుట వలన జలమువలె అని చెప్పినచోట పదార్థముఅగుట అను హేతువు నిప్పుయందు వేడిలేక పోవుటను సాధించవలయును సాధ్యము వేడిలేకపోవుట దాని అభావము వేడిలేకపోవుట యొక్క అభావము వేడియుండుట ఆ వేడి ఉండుట, అనునది త్వాచ ప్రత్యక్షము వలన అనగా చేతితో ముట్టుకొనుటవలన తెలిసికొంటిమిగాన ఆపదార్థమగుట అను హేతువు బాధితము అని చెప్పబడును. ఇచ్చటదోషమును బాధఅని అందురు సాధ్యముయొక్క అభావముగల పక్షము బాధ, దోష సామాన్యలక్షణములో అనుమితి దాని కరణము యందు ఒకటి అనగా నిప్పువేడిలేనిది అను అనుమితిని తీసుకొనిన యెడల దానికి ప్రతిబంధకమున యథార్థ జ్ఞానము నిప్పువేడిగలది అను నిశ్చయము దానిలో విషయము నిప్పు వేడిగలది అను బాధకాక విషయత్వముబాధలో ఉన్నందున దోషసామాన్యలక్షణము సమన్వయమైనది ఇంతటితో అనుమాన పరిచ్ఛేదము పూర్తిఅయినది

గోవిందరామాయణము
పరశురామ శరణాగతి

శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులు

ఇనకుల దంపతుల్ మును లహీనతపోధను డా వసిష్ఠుఁడున్
జనములు గోసలేశుఁడును సైన్య చయమ్ము నయోధ్య కేఁగుచున్
గనిరి, శుభాశుభమ్ములనఁగన్ శకునమ్ములు కొన్ని దారిలోఁ
జనుచును, వానిఁగాంచుచు విశాంపతి క్రుంగు మహా భయమ్మునన్.

అంతన్ఘోర నినాదముల్చెలఁగి భూమ్యాకాశము ల్నిండె నా
శాంతమ్ముల్ గడు మాఱుమ్రోగ జనులాహాకారముల్సల్ప నం
తంతన్లోకము ధూళిసంభరితమై వ్యాపించెఁ బెంజీకటుల్
సుంతైన న్రవి కాంతి లేక జగముల్ క్షోభించెడిన్ భీతిమై.

అపుడా పంక్తిరథుండు భీతమతియై యట్లట్లు చూడన్జనుల్
నృపసైన్యంబులు బంధుమిత్త్రతతియున్ నిశ్చేష్టులైకూల నా
తపసుల్ రాఘవులున్ గనన్ బరశువున్ ధర్మమ్మునుం గొన్న రౌ
ద్రపు మూర్తిన్ జమదగ్ని పుత్త్రు నృప విధ్వంసాత్మకున్ భీకరున్.

ఓహో దాశరథీ! యిఁకన్నిలువుమీ, యోడింతునే నిన్నిదే
బాహా బాహిరణమ్ము సల్పి శివచాపం బెత్తుటే గొప్పయా
హాహా యయ్యది సీతయున్కిఁగని రెండయ్యెన్సుమా యంతె నీ
దేహంబెంత? బలం బదెంత? విను సందేహింపకేఁ జూచెదన్.

హరు ధర్మమ్మది యద్భుతమ్మెటుగ నీ హస్తమ్మునన్జిక్కె, శ్రీ
హరి ధర్మమ్మిది నాదుచాపమును మహాఖ్యాతమ్మనన్యమ్ము స
త్పురుష శ్రేష్ఠు డొకండె మాత్రమె సుమా పూనంగలాడీ గుణా
కరమున్, రాఘవరామ? నీదుబల మూ కాంక్షించునే దీనినిన్.

పరపురము ల్జయింపఁగల బాణము నీదేకదా? యిదే దివా
కరకుల సూన! నా ధనువిఁకన్ ఘటియింతువె నంప విందువే
జరిపెద ద్వంద్వయుద్ధము దిశావలయమ్ము వడంకి గ్రుంగ నే
నిరుపదియొక్కమారు లవనీశ్వరుల న్దునుమాడితిన్జుమా.

అనుచున్భార్గవ రాముఁడు గనఁగన్ దీవ్రాగ్నిఁ బోలు కనుల న్రామున్
జనవిభుఁడు దశరథుండును దనువెల్లను గంపమొందఁ దహాఁహాఁబలుకున్.

శాంతమునొంది యుంటివి విశాంపతులన్ మునుజంపి చంపి యా
శాంతము బ్రాహ్మణుండవు మహాయశము న్గడియించి నాఁడ వీ
పంతము సెల్లునొక్కొ పసిబాలురు వీరలు నాదుపుత్రు లి
ట్లెంతువె క్రౌర్య మివభయ మీ యఁగ వేఁడెద భార్గవాన్వయా!

వ్రతమున స్వాధ్యాయంబున
నతులిత వంశంబు నంద నన్యుఁడవీ వై
వితరణ సేయవె పృథ్విని
గతమాయెను గాదె యిహము కాంక్షల్ రామా.

అస్త్ర సన్యాస మొనరింపవయ్య మున్ను
స్వర్గలోకాధి నాథుండు సాక్షిగాఁగ
గాశ్యపునకిచ్చి భూమిని గాన నమ్మె
యిల్లుగా నుందువీవ మహేంద్ర మందె.

పటుతర బాహు విక్రమ విభాసుర భార్గవరామ సన్మునీ
యిట కరుదెంచి నావిఁక, లయించు మదీయ మహోఘజాల మి
చ్చటి, కొనుమీ సపర్య, రఘుచంద్రులు మ్రొక్కెడివారు వీరి న
క్కటికము జూపి దీవెనలఁ గావవె, బాలుర నీకు శాత్రవుల్?

శ్రీరామునిఁ జంపెదవా
మారాచకులమ్ము మేము మడిసెద మిపుడే
వీరా! తండ్రి ఋణమ్మును
దీఱెంగద నీపు ధర్మ తృప్తింగనవే.

అని కరము ల్మోగిడ్చి పలుకాడెడి కోసలరాజు జూడఁడా,
యని మొనగాఁడు క్షత్రియకులాంతకుఁడా జమదగ్ని సూనుఁ డా
త్మను రఘురాము నిల్పి తనధర్మము నాతఁడెటుల్ గ్రహించునో
కను తమకమ్మునన్ బడి యొగాదిగ నాతనిఁ జూచి పల్కెడిన్.

విని యుంట న్భవ దీయ చిత్రకథ నిస్వీక్షింపఁగా వచ్చితిన్
గనలేనైతిని నేఁటిదాఁక నొరు నీ కంటెన్మహావీరుఁ బృ
థ్విని శైవంబని వైష్ణవంబని కడున్పేర్గన్న ధర్మద్వయ
మ్మున మున్నివొక దానిఁ ద్రుంచితివిగా భూరిప్రతాపమ్మునన్.

వినుటను నీ గుణోద్ధతిని విశ్రుతవీరుఁడ వీవ యంచు నె
మ్మనమున నెంచి నా సరిసమానున కిప్పుడె ద్వంద్వమీయఁగా
బనివడి వచ్చితిన్మహిత వైష్ణవ ధర్మముఁ గూడఁబూని నీ
ఘనశర ముంచు దే యిపుడు గాంతువు నా గుణ రూపసంపదన్.

ధర్మమొకండె యుండె నిదె ద్వంద్వమున న్భవదీయ శక్తిచే
వర్మ! యిదే ప్రతిజ్ఞ మన ద్వంద్వము నందొకరుండె నిల్చు స
ద్ధర్మము వైష్ణవమ్మ గని దానన ద్వంద్వ మొసంగనెంతు నీ
ధర్మము క్షాత్ర మెంచఁ బరధామ జయమ్ము శరమ్ము రాఘవా.

పరపురము న్జయింపగల బాణము నీయది నాదు చాపమున్
బరపురము న్జయించునది పట్టెను రెంట సమాన ధర్మమే
యిరువుర మొక్క నామముననే పిలువం బడుచుంటి మన్నిటన్
సరియగు నంశమొందుట గనన్ దగు ద్వంద్వ విధమ్మ నంతయున్

పరపురము న్జయింపఁగల ప్రజ్ఞ సగమ్ము శరమ్ము రూపునన్
బరఁగు ద్వదంశమై సగము వట్టె నమున్నను రాకృతిన్ నీఁకన్
బరపురము న్జయింప గల ప్రజ్ఞను నైక్యమొనర్పఁ జెల్లదే
శరమును వింటఁగూర్చి రఘుసత్తమ ద్వంద్వమిఁకేల రాములన్.

పరపురము న్జయింపఁ గల బాణము నీయదె నిశ్చయమ్ము నా
పరపురము న్జయించు విలు భార్గవుఁడైన ఋచీకు చేతికిన్
హరియె యొసంగె మున్ను నాతఁడా జమ దగ్నిని బుత్రుఁబిల్చి యా
దరమున నిచ్చె నాకు జమదగ్ని గురుండు మహాత్ముఁడాతఁడే.

కార్త వీర్యార్జునుఁడు కన్నుగానకుండ
నస్త్ర సన్యాసియై తపమాచరించు
నాదు తండ్రిని జంప నన్యాయముగను
ధార్మికుఁడ నైతి ధర్మ సంస్థాపనమున.

ధర్మ సంస్థాపనకుఁ బూనఁ దగిన బలము
తపసిఁ జంపుట కను వేట దాని కలిగి
క్షత్రియుల నెందఱనొ జంపఁ గల్గినాఁడు
బ్రాహ్మణుఁడ నయ్యుఁ బలుమాఱు బాలరాము.

పుడమినంతను నాచేతఁ బూనియిట్లు
క్షత్త్రియ వినాశ యజ్ఞమ్ము సమయునంత
యుగసమాప్తిని దక్షిణ నొసఁగి పృథివి
నల మహాత్ముఁడు కాశ్యపుం డనఘునకును

తపసి నయ్యు మహేంద్ర భూధరమునుండి
నిన్నుఁగని ద్వంద్వము జయించి సన్నుతిఁగన
వచ్చియుంటిని క్షాత్త్రమ్ము వదల వలదు
వీర్య గుణపరాక్రమ శీల! విల్లుగొనుము.

అను నా భార్గవు సశ్చలాత్ముఁగను పరారాధ్యుఁడా రాఘవుం
డను నమ్రుండయి, మెచ్చితి న్పరశురామా తండ్రికిన్ దృప్తి గూ
ర్చిన వీరుండవు క్షత్త్రధర్మమున నే శ్రీనాథు ధర్మమ్మిదే
కొని నా తేజమ్మును నా పరాక్రమము నీకుం జూపెద న్జూచెదే.

అని హస్తమ్మును జూచి భార్గవ కరంబందున్న ధర్మమ్ము నా
తని యందు గల వైష్ణవాంశముఁ ద్రుటిన్ దాఁబొంది రాఘవుం
డనుసంధాన మొనర్చె స్వీయ విశిఖంబా విష్ణు ధర్మమ్మునన్
మును దానింగడు వాడియున్న గతి సమ్మోహమ్ము సంధిల్లఁగన్.

చూచితె నా పరాక్రమము చూచితె తేజము రామబాణమున్
జూచితివే యమోఘమిది చూపుము లక్ష్యము దీనికింక నిన్
గాంచితి బ్రాహ్మణుండ వని, గాధిసుతాప్తుడవంచు, రాఘవుం
డేఁచఁడు బ్రాహ్మణోత్తము లయింపదు లక్ష్యము బాసి బాణమున్.

పరపురము న్జయింపఁ గల వైష్ణవ దివ్యశరమ్ము నాది నీ
చరణ గతిన్సమర్పణము సల్పెదవా తప మాచరించి నీ
పర మొనరించు కొంటి విభవమ్ముల వానిఁ ద్యజింపనెంతువా
పరశుధరా యథేచ్ఛ నని వార్య మొసంగుట రెంట నెద్దియో.

రాముఁడు బాణమెత్తగ సురల్ దివిజేశుఁడు, బ్రహ్మ వెంటరా,
"రామనమోనమో"యని పరాత్పరుఁ జూడఁగ వచ్చినారు శ్రీ
రాముని గాంచుచు న్పరశు రాముఁడు వీర్యవిహీనుఁడై "పరం
ధామ కృపాపరా" యనుచు ధారణ సల్పెడి స్తబ్ధచిత్తుఁడై.

కమల నాభునిఁ గనినాఁడఁ గాంచినాఁడఁ
గంజ దళనేత్రు విష్ణుని గమల విభుని
నాద్యు నప్రతి ద్వంద్వు మహాత్ము నాశ
రహితు ధన్యుండ ధన్యుండ రామమూర్తి

జపము తపమ్ము సల్పితిని జన్నిదమూనితి నంతె కాని నీ
కృప గననైతి లోకముల నెల్లజయింప తపమ్ము సర్వమే
నుపకరణ మ్మొనర్చితిఁ బ్రభూభవదర్పణ సేయకుండ నా
తపమునఁ గొన్నలోక సముదాయము నాహుతి సేతు నీశిఖిన్.

బాహాబాహి రణమ్మిఁకేల నిను గెల్వంజాలితి న్నేఁడె నా
కాహా యోటమి లేదు లేదిటుల నిన్నాద్యున్గ నన్వేచితిన్
దేహిన్సర్వ సమర్పణమ్మిదె కృపన్నీవే గ్రహింపం గదే
యోహో రామ రఘూ ద్వహాశరణ మోహో సర్వలోకేశ్వరా

పరమ కృపాపరా! భువన భారహరా! కమలా మనోహరా!
శరమును వీడు మీ యిఁక నిశ న్వసియింపఁగ రాదు భూస్థలిన్
త్వరితగతిన్ మహేంద్ర గిరిపై నివసింతు మనోజవమ్మునన్
ధరఁగొని కాశ్యపుండు నను ధారుణి వీడఁగఁగోరె రాత్రులన్.

శరణగతిన్ ద్వదర్పణము సల్పఁగ రాదు నిరంతరమ్ము నీ
చరణ సమాశ్రమంబయిన స్వాంతము నన్మనుదీక్షగొన్న నా
కరయ జగమ్ము సర్వము మహాంధతమో వృతమయ్యె దాన నో
పరపురనాధ నీ యెదుటఁ బ్రాంజలినుంటి రజస్స్వరూపుఁడన్.

తిమిరము నిండి యున్న జగతి న్బరు లెవ్వరుఁ గాననట్టి నిన్
సమర మిషం గనుంగొనఁగఁ జాలితినోయి విరాట్స్వరూప యీ
తమమును గొట్టినా రజము దాఁకి మదీయ తపః ఫలమ్ము లు
త్తమ భవముల్విదల్చు మిఁక దాసున కిచ్చి త్వదీయ సత్త్వమున్.

అనుచు న్భార్గవ రాముఁడల్లై కను లోకాతీత వేగమ్మునన్
జనునా వైష్ణవ సాయకమ్ముటుల వే నాశమ్ము గావించెనో
తన పుణ్యార్జితలోక పంక్తిగనుచున్ "ధన్యోస్మి చక్రాయుధా
వనజాక్షా"యనుచున్ బ్రదక్షిణమున న్బాఱె న్మహేంద్రాద్రికిన్.

సురలు మునులె చూడ హరివీడి తొలిరూపు
పరశురాము విల్లు వరుణున కిడి
సైన్య మధ్యమందు స్థబ్ధుఁడై యుండిన
పుడమిఱేనిఁ జేరెఁ బుత్రుఁడగుచు.

నలుఁగడ వెల్గుగల్గెడి యనంతుఁడు వీడి విరాట్స్వరూపమున్
గులుకుచు బాల రాముఁడయి కుందుచు విహ్వలుఁడైన తండ్రికిన్
బలుఁడగు భార్గవుండు చనె వాసెభయమ్ము జయించినాఁడఁ ద
త్ఫలితమె చీకటుల్ చెదఱెఁ బార్థివయెల్లరు క్షేమమే యనున్.

పరశువ్రబూని భార్గవుఁడు వచ్చుటయున్ జగమెల్ల చీకటుల్
బరఁగుటయు న్జనుల్తమము వల్ల జడీకృతులౌట యు న్బరా
త్పరుఁడగు రాఘవుండె కనవచ్చుట, యున్జనకాత్మజాత దా
శరథులు గాన రామియుఁ బ్రశాంతమున న్గని రెల్ల మౌనులున్

కాంచి కమల యుక్తుఁగవ నోఁచి యహి తల్పు
శంఖచక్ర ధరుని సకల విదుని
వైష్ణవాంశ ధరుఁడు పరశరామునితోడ
మునులు తృప్తిగని రపూర్వముగను.

ముని వరుఁడా వసిష్ఠునకు మ్రొక్కుచుఁ దక్కుఁ గలట్టి మౌనులన్
వినయము నన్నమస్కృతుల విందునఁ దేల్చుచుఁ దండ్రి గూర్చి యి
ట్లను మఱియొక్క మాఱుచనెనా జమదగ్ని సుతుండు సైన్యమున్
మనమును బోఁదగున్ బురికి క్ష్మాపతి నీవ యనుజ్ఞ నిచ్చినన్.

అను రామున్గను మూర్కొనున్శిరముపై, నా భార్గవుండేఁగెనే
యను నీవున్ భవదీయ సోదరులు సౌఖ్యం బేయనుం, గౌగిలిం
చును బుత్రుల్మరల న్జనించిరని వేచున్జూచు నల్దిక్కులన్
జనగా వచ్చు నయోధ్య కింకననుచున్ క్ష్మాభర్తగాంచె న్ధృతిన్.

జయజయ నాదముల్సెలఁగె, సాధువతంసులు సంతసిల్ల న
వ్యయగుణ మూర్తిగాంచి సురవర్గము నాకము సేరె, సైన్యముల్
భయముత్యజించి వేగముగఁ బాఱఁ గడంగెను రాఘవాన్వయుల్
బయనము సేసెనంత ముని వారము తోడుగ రా నయోధ్యకున్.

సామాన్య

~~వ్యాప్తిసాధక~~ సిద్ధాంతములు

బెర్ట్రండ్ రసెల్

అనువాదం : జి. ఎస్. ఎన్.

౭

వెనుకటి యధ్యాయమున మనకు కొన్ని విషయములవగతమైనవి. సంగ్రహముగానవియివి. వ్యాప్తిసాధక సిద్ధాంతముఅనుభవముపై నాధారపడిన యుపపత్తులన్నియును సమంజసములని నిరూపించుటయావశ్యకము ' కాని యాసిద్ధాంతమునుమాత్రమనుభవమునుబట్టి నిరూపింపవలనుపడదు.అయినను నీసిద్ధాంతముస్పష్టముగా నన్వయించు నుదాహరణము లన్నింటిలోను దాని ప్రామాణ్యమును ఎల్లరు సంగీకరించియే యున్నారు. ఇట్టి లక్షణములుండుట యొక్క వ్యాప్తిసాధక సిద్ధాంతమునకేగాదు,అనుభవమౌననుటకుగాని కాదనుటకుగాని వీలులేక, అనుభూతమైనదానినిబట్టి ప్రతిపాదించు నుపపత్తులలో వినియోగించుటకు వీలైన సిద్ధాంతములు తదితరములైన పనేకములుగలవు

వీనిలో కొన్నింటికి వ్యాప్తిసాధక సిద్ధాంతమునకంటె నధిక ప్రామాణ్యము గలదు ఇంద్రియార్థముల యునికివిషయమై మనకు లభించు జ్ఞానమున నెంత నిశ్చితత్వము కలదో, పైసిద్ధాంతములవలన మనకు లభించు జ్ఞానమునకంత నిశ్చితత్వము గలదు ఇంద్రియగ్రహణము నాధారణముగా గొని యనుమాన ప్రమాణముద్వారా మనకు విషయములను తెల్చుకొనుటకా సిద్ధాంతములు సాధనభూతములగును. మనమనుమాన ప్రమాణముద్వారా తెల్చుకొను విషయము యథార్థము కావలెనన్న,మనకుగల యుపాదేయ సామగ్రి (Data) యథార్థమైయుండుట యెంత యావశ్యకమో, మనకు అనుమితి సాధకములగు సిద్ధాంతములు యథార్థములైయుండుట అంత యావశ్యకము పైకిచూచుటకీ సిద్ధాంతములు సులభగ్రాహ్యములనిపించుట చేతను,అందులోని మిడియున్న యభ్యుపగమమును అభ్యుపగమని గ్రహింపకయే దానినంగీకరించుట నేటి తత్త్వచింతకుల యాచారమైపోయినది. కాని నిర్దుష్టమగు జ్ఞానసిద్ధాంతము మనకావశ్యకమైనచో నాయనుమతి సాధకసిద్ధాంతముల ప్రాముఖ్యమును గుర్తించుటవసరము

సామాన్య సిద్ధాంతముల జ్ఞానము మనకులభించునపుడు, సాధారణముగా నిట్లుజరుగును. మొదట సామాన్యసిద్ధాంతమొక ప్రత్యేకమైన యుదాహరణము విషయమున నెట్లన్వయించునో గమనింతుము. పిమ్మట నాప్రత్యేకోదాహరణమునకు ప్రాముఖ్యము తగ్గును. తుదకు సామాన్యసిద్ధాంతము ధృవపడును ఈసంగతి గణితశాస్త్రమును బోధించుపట్ల బాగుగా విశదమగును. రెండేసి వస్తువులను రెండింటిని పరిశీలించి నాలుగువస్తువులైనవని మొదటి యుదాహరణమున తేలిన పిమ్మట, అట్టి యుదాహరణము లనేకములను పరిశీలించి, పైసామాన్యసూత్రము సజాతీయములగు నేరెండ్రెండు వస్తువులకైనను అన్వయించునని మనము గ్రహింతుము హేతుశాస్త్రసిద్ధాంతములపట్లగూడ నదే వర్తించును. నేడు ఏతేదీయను విషయమై యిరువురినడుమ వివాదమేర్పడెననుకొందము. వారిలోనొకడు నిన్న 15వ తేదీఅని నీవంగీకరింతు వనుకొందును, నిన్న 15వ తేదీయైనచో నేడు 16వ తేదీయన్న సంగతి స్పష్టమేగదా యని చెప్పును రెండవవాడు, అంతవరకు నేనును అంగీకరింతునని జవాబుచెప్పును. నిన్న 15వ తేదీ, ఆవిషయము నీడైరియే తెల్పును. నీవు జోన్సుతో భోజనముచేసిన వైనము వగైరా నీకు జ్ఞప్తిలోనుండియుండును. నిజమేయని రెండవవాడు చెప్పును. కాబట్టి నేడు 16వ తేదీయని రెండవవాడు తన వాదమును నిలువబెట్టుకొనును.

పై యుపపత్తి నవగతము చేసికొనుట యేమంతకష్టముకాదు. హేతువాక్యములలో నిజమున్నచో, నిగమనములోగూడ నిజముండి తీరునన్న విషయమును కాదనుట కెవ్వనికిని వీలులేదు కాని దాని యాథార్థ్యము, ఒక సామాన్యసిద్ధాంతముపై నాధారపడి యుండును. ఆసామాన్య సిద్ధాంతములలో నొకటి మచ్చున కిట్లుండును 'ఈవిషయము యథార్థమని తెలిసినచో, నావిషయమును యథార్థమే యగును. అట్లై ఈవిషయము యథార్థమని తేలినచో, దానిని బట్టి యావిషయముగూడ యథార్థమని తేలును ఈవిషయము యథార్థమైనచో, నావిషయము గూడ యథార్థమే యన్న సందర్భములో, నీవిషయమున నావిషయము నిమిడి యున్నదని మనము

గ్రహించు కొందుము. ఈవిషయము యథార్థము గావున నావిషయముగూడ యథార్థమని తేలుచున్నదన్న సందర్భములో, మొదటి విషయమును బట్టి రెండవ విషయము ఊహించు కొనవచ్చునని మనము తెలిసికొందుము అనగా ఒక ప్రమేయ వాక్యమున నిమిడియున్న యేయంశమైనను లేక ఒక ప్రమేయవాక్యమును బట్టి సిద్ధించునేవిషయమైనను యథార్థమేయగును.

మనము చేయునిరూపణము లన్నింటిలో నీ సిద్ధాంతము - అథమము ఈ సిద్ధాంతమునకు సంబంధించిన కొన్ని నిర్దిష్టములైన యుదాహరణములైనను ఇమిడియున్నట్లు తెలిసికొనవగును. మనము విశ్వసించు ఒకానొక విషయము మరియొక విషయమును నిరూపించుటకుపయోగించు నపుడు, ఈ సిద్ధాంతమునకు ప్రాముఖ్యమేర్పడును యథార్థములగు హేతువాక్యములపై నాధారపడిన యుపపత్తుల వలన తేలిన యంశములను మన మెందుకంగీకరింపవలయునని యెవ్వరైన నడిగినచో, 'దానికి మనమింతకు పూర్వము ఉదాహరించిన సిద్ధాంతము ననుసరించియే సమాధానము చెప్పవలసి యుండును వాస్తవమునకా సిద్ధాంతము యథార్థమగునా కాదా యన్న శంక యసలు పుట్టుటకే వీలులేదు చూడగనే అందు శంకింప వలసిన విషయమేమియు లేనట్లు కాన్పించును. ఆసిద్ధాంతము నందలి స్పష్టతయట్టిది అట్టి సిద్ధాంతములు తత్త్వచింతకునకు అత్యంతము ఉపయోగపడును ఏలన కేవల మింద్రియ గ్రాహ్యమగు జ్ఞానముకాక మరియొక విధముగా యసందిగ్ధమగు జ్ఞానము లభించుటకు మార్గమును ఆసిద్ధాంతములు నిర్దేశించును.

పైసిద్ధాంతముస్వతస్సిద్ధములగుననేకతార్కిక సిద్ధాంతములలో నొకటి ఏయుపపత్తినైనను ప్రతిపాదింప వలయుననిన, ఏనిరూపణయైనను చేయ వలయుననిన, ఈసిద్ధాంతములలో నథమము కొన్నింటినైనను అంగీకరింప వలయును వానిలో కొన్నింటి నంగీక రించినపుడు, తదితర విషయములను నిరూపింపవచ్చును. ఒక్కొక్కప్పుడు మనమాసిద్ధాంతముల వలన నిరూపించినవిషయములు గూడనాసిద్ధాంతములంత స్పష్టముగా గూడ నుండుటకలదు పెద్ద కారణమేమియునుచూపకయే,యీ సిద్ధాంతములలో కొన్నింటిని ఆలోచనాసూత్రములను తత్వశాస్త్ర సంప్రదాయము నామకరణము చేసినది. సంగ్రహము గానవి యివి.

(1) ఏకార్థకసూత్రము- ఉనికి గలిగినదెల్ల యుండనేయున్నది

(2) విరోధసూత్రము-, ఏవస్తువునకైనను ఏక కాలమున, ఉండుటయు, లేకుండుటయు అనునది పొసగదు

(3) తృతీయ పక్షాభావసూత్రము- ఏవస్తువైనను ఉండనైనఉండవలెను, లేకపోనైనలేకపోవలెను, ఇందు మూడవ పక్షమున కవకాశమే లేదు,

ఈమూడుసిద్ధాంతములుస్వతస్సిద్ధములగు తార్కికసిద్ధాంతములకు మచ్చుతునకలు,వాస్తవమునకు అవి యట్టి తదితర సిద్ధాంతముల కంటె ప్రధానములుగావు ఒక యథార్థమైన హేతువాక్యమును బట్టితేలిన విషయముగూడ యథార్థమే యన్న సిద్ధాంతమునే తీసికొందము ఆలోచనా సూత్రములని దానికి పెట్టిన పేరులోనే కొంతతికమకయున్నది. ఇక్కడ ప్రధానమగు విషయము మనమీ యాలోచనా సూత్రములను బట్టియాలోచింతుమన్న విషయముగాదు మరిమనము వాని ప్రకార మాలోచించినపుడే సవ్యముగా నాలోచించుచున్నామన్నమాట కానిఇది చాల పెద్దవిషయము దీనివిషయమైతీరికగావిచారింపవలయును

ఒకనిర్దిష్టమగు హేతువాక్యమునుబట్టి ఒకానొక విషయము నిస్సందేహముగా యథార్థమగునని నిరూపించుట కవకాశమొసగు తార్కిక సిద్ధాంతములేకాక ఒక హేతువాక్యమును బట్టి యింకొక విషయముయథార్థమౌటలోకొలదియోగొప్పయో సంభవమేనని నిరూపించుట కవకాశమొసగు తదితర తార్కిక సిద్ధాంతములుగలవు. అట్టిసిద్ధాంతముల కుదాహరణముగా పలయుననిన, మనకు వెంటనే స్ఫురించునదే వ్యాప్తిసాధకసిద్ధాంతము వెనుకటి యధ్యాయమున దీని నీవఱకు పరామర్శించియేయుంటిమి

అనుభవవాదులు (Empıncısts), హేతువాదులు (Rationalists) అను రెండుపక్షముల నడుమచెలరేగినవివాదమే తత్త్వశాస్త్రచరిత్రమున విశేషప్రాధాన్యము వహించి యున్నది. లాకే, బెర్క్లే,హ్యూమ్ అను బ్రిటిషతత్త్వవేత్తలు అనుభవవాదులు వారు మనకుగల జ్ఞానమంతయును అనుభవమువలననేకలుగునని వాదించిరి 17వ శతాబ్దమున ప్రసిద్ధిగాంచిన డెకార్టె లిబ్నిజ్-మనకనుభవము వలన గలిగిన జ్ఞానమున కదనము

గా-కొన్నిసూక్ష్మభావములును సూక్ష్మ సిద్ధాంతములును గలవనివాదించిరి. వారిసిద్ధాంతమునను సరించి వీనియునికియనుభవము పరిధి నతిక్రమించియుండును. పరస్పరము వివదించుకొనుచున్న యీ రెండు మతములలోని సత్యాసత్యములను కొంత సాహసించి నిర్ణయింపగలిగిన పరిస్థితియిపుడేర్పడినది, పూర్వోక్త కారణములచే తార్కిక సిద్ధాంతములో మనకు నవగతమైనను, దేనిని నిరూపింపవలసివచ్చినను నా సిద్ధాంతములను ప్రాతిపదికగా గొనుటచే-వానిని అనుభవమును బట్టి నిరూపించుటకు వలనుపడదు ఈ రెండు మతముల నడుమ చెలరేగిన వివాదమున నతి ప్రాధాన్యముగడించిన యీ విషయమున మాత్రము, హేతువాదులు యథార్థమునే వచించి రనవలయును

అనుభవమునకు తార్కికముగా నతిరిక్తమైన జ్ఞానము కొంతవఱకు అనుభవమువలననే కలుగుచున్నది. ఇచ్చట అనుభవమునకు నతిరిక్తమైన అనగా అనుభవము నిరూపింపజాలని అని యర్థము. కేవలమ్ము కొన్ని ప్రత్యేకానుభవములను ప్రాతిపదికగాగొని, వాని నడుమగల సంబంధములను దృష్టాంతీకరించు కొన్ని సామాన్య సిద్ధాంతములను మనము తెలిసికొనగల్గుచున్నాము. పిల్లలకు పుట్టగానే, బాగుగా పెరిగిన వ్యక్తులకువలె సర్వవిషయములను గూర్చిన జ్ఞానము ఉండునన్న యర్థములో కొన్ని సుసూక్ష్మములగుసిద్ధాంతములుగలవనియు, వానినిఅనుభూతమైనదానినిబట్టి యర్థముచేసికొనుటకు వీలు లేదనియు,భావించుట శుద్ధయవివేకము ఇందువలననేమనకు లభించు జ్ఞానమును నిర్దేశించిచెప్పుటకు సూక్ష్మమన్న పదమును మే ముపయోగింప దలచుకొనలేదు దానిని అనుభవాతిరిక్తమైన (Apriori) అన్నచోనంత విప్రతిపత్తియుండదు. తత్త్వశాస్త్రమున గడితేరిన యనేకుల రచనలలో నీ పదమునకు విశేషప్రసిద్ధిగలదు కావున సర్వజ్ఞానమునకును అనుభవమే మూలమైనను కొంత జ్ఞానముమాత్రము అనుభవాతిరిక్తమై యుండును. అనగా నట్టిజ్ఞానము మన కాలోచించుట కవకాశమొసగు ననుభవము దానిని నిరూపింపలేదు. కాని యెట్టి నిరూపణయు నక్కఱలేకయే దాని యాథార్థ్యము మనకు తేటపడును.

ఒక్క ప్రధానాంశమున మాత్రము అనుభవవాదులు చెప్పినదానిలో నిజముకలదు. అనుభవము తోడ్పాటు లేనిదే ఏ వస్తువును మనకున్నట్లు తెలియుటకు వీలులేదు. మనకు సాక్షాత్తుగ ననుభవములో లేని వస్తువొకటి యున్నదని మనము నిరూపింపవలసి వచ్చునో మనము ప్రతిపాదించు హేతువాక్యములలో, మనకు సాక్షాత్తుగ ననుభూతమైన వాని ప్రశంసకొంత యుండవలయును. పైచైనా చక్రవర్తి యున్నాడన్న విశ్వాసముశబ్ద ప్రమాణముపై నాధారపడి యుండును. ఆశబ్ద ప్రమాణముగూడ స్వయముగా చూచినదానిని బట్టియో, యింకొకరు చెప్పుచుండగ వినిన దానిని బట్టియో యేర్పడుచున్నది. ఉండవలసిన దాని విషయమై చేసిన పరామర్శమును బట్టి, ప్రపంచమున నాయా వస్తువుల యునికిని తెల్పుకొనవచ్చునని హేతువాదులు విశ్వసించిరి వస్తువుల యునికిని గురించి యనుభవమునకు నతిరిక్తముగమనకు లభింపగల జ్ఞానమంతయు హేతు బద్ధమగునూహ వలననే సిద్ధించును. ఈ క్రింది సిద్ధాంతములో నా విషయము సువ్యక్తమగును ఒకవస్తువున్నచో, రెండవ వస్తువుగూడా నుండి యుండవలెను. దేనిని సర్వసాధారణముగ చెప్పవలయునన్నచో నిట్లు చెప్పవచ్చును. ఒక ప్రమేయ వాక్యము యథార్థమైనచో, నింకొక ప్రమేయవాక్యముగూడ యథార్థమైయుండవలెను. ఈవిషయమును మనమింతకు పూర్వము ప్రతిపాదించిన సిద్ధాంతములను సాధనములుగాగొని దృష్టాంతీకరింప నగును ఆ సిద్ధాంతములివి ఈ విషయము యథార్థమైనచో అందులో నింకొక విషయమిమిడి యుండి, ఆ విషయముగూడ యథార్థమైనచో-లేక ఆ వస్తువును ఈ వస్తువునకును అవినాభావసంబంధమున్నట్లుపరిశీలకులకుతఱచుగాగానవచ్చినచో, ఆ రెండింటిలో నొకటి కన్పించిన మరియొక యుదాహరణములో రెండవ వస్తువుగూడ నుండియే యుండును. కావున అనుభవాతిరిక్తము సిద్ధాంతముల విస్తృతి మిపుల పరిమిత మగుచున్నది. ఒకానొక వస్తువు కలదని తెలుపు జ్ఞానమంతయు అనుభవము మీదనే ఆధారపడియున్నది. ఏవస్తువైన యున్నట్లు వెనువెంటనే జ్ఞాతమైనచో,దానియునికి కేవలము అనుభవము చేతనే తెలియుచున్నది. ఏ వస్తువైనను, వెంటనే జ్ఞాతముకాక, ఉన్నట్లు నిరూపితమైనప్పుడు, ఆ నిరూపణమున అనుభవమును, తదతిరిక్తములగు సిద్ధాంతములుగూడ సాధనభూతములై యుండును పూర్తిగాగాని కొంతపరకుగాని అనుభవముపై నాధారపడి యున్నపుడు ఆ జ్ఞానమును అనుభవసిద్ధ జ్ఞానమని వ్యవహరింప వచ్చును కావున అస్తిత్వమును స్పష్టముగా నిర్దేశించు సర్వజ్ఞానమును అనుభవసిద్ధమైయున్నది అస్తిత్వమునకు సంబంధించిన యనుభవాతిరిక్త

జ్ఞానము తర్కబద్ధమగు నూహవలన సిద్ధించును. అది ఉనికి గలిగిన లేక దానికి నవకాశము గలిగిన వస్తువుల నడుమ సంబంధములను కూర్చును కాని వస్తువుల యధార్థమైన యునికిని గురించి మాత్రము అది నిర్దేశింపజాలదు.

మనమింతవరకు పర్యాలోచించుచున్న అనుభవాతిరిక్తజ్ఞాన మంతయు కేవలము తర్కముచే సిద్ధించునదేగాదు తర్కసిద్ధముకాక అనుభవాతిరిక్తమై యొప్పుజ్ఞానమునకు నైతిక ప్రమాణములనుగూర్చిన జ్ఞానము నుదాహరణముగా గొనవచ్చును ఏది యుపకారియో, ఏది ధర్మ్యమో అను విషయములకు సంబంధించిన నిర్ణయములను గూర్చినేను ముచ్చటించుటలేదు. వస్తువుల స్వతస్సిద్ధమగు వాంఛనీయత విషయమై చెప్పుచున్నాను. ఏదైన వస్తువుపయోగ కారియైనచో, దాని కవాంతర ప్రయోజనమేదో యొకటి కలదు గావుననే ఫలానా వస్తువుపయోగ కరమని చెప్పవలసియుండును. కాని మరికొంత లోతుగాతరచి చూచినచో, నొకవస్తువు వలని ప్రయోజనము స్వతస్సిద్ధమైనదై యుండవలెను. మఱియది యవాంతరములగు నన్యప్రయోజనము నపేక్షింపరాదు కావున ఏది యుపయోగకరమను విషయమై జరుగు నిర్ణయములన్నియు స్వతః విలువ గలిగిన వానివిషయమై చేసిన నిర్ణయములపై నాధార పడియుండును.

ఉదాహరణమునకు, సుఖము దుఃఖముకన్న నధికముగా వాంఛనీయమనియు, జ్ఞానము అజ్ఞానముకంటె నధికముగా నభిలషణీయమనియు, కలుపుగోలుతనము ద్వేషముకంటె నెక్కువగా యపేక్షణీయమనియు నిర్ణయింతమనుకొందము. అథమము కొంతవరకైనను పై నిర్ణయములు అనుభవపరిధి నతిక్రమించినవై యున్నవి మన వెనుకటి యనుభవాతిరిక్తములగు నిర్ణయముల వలెనే, అవి అనుభవ విషయములై యుండవచ్చును. ఏలన ఒక వస్తువు మనకు అనుభవమునకు అందిననేగాని అది స్వతఃగా ఎంత యుపకారియో నిర్ణయింపజాలము, కాని దానిని అనుభవముచే నిరూపించుట మాత్రము సాధ్యముకాదు ఒక వస్తువున్నదనిగాని లేదనిగాని తెలిసినంత మాత్రమున నది మంచిదనిగాని చెడ్డదనిగాని యెట్లు చెప్పగలము? ఈ విషయమును కొంత తరచి చూడవలెనన్న ధర్మశాస్త్రము వైపుకు మనదృష్టిని మళ్ళింపవలయును. ప్రస్తుతము ఏది స్వతస్సిద్ధమైన ప్రామాణ్యము గలిగినదో యను దాని విషయమై మనకు లభించు ఆయా విషయమునందలి యాథార్థ్యమునుగాని తద్వ్యతిరిక్త లక్షణమునుగాని అనుభవమేననుటకుగాని కాదనుటకుగాని వీలులేదన్న యర్థములో-అనుభవాతిరిక్తమైయున్నదని తెలిసికొనుట చాల అవసరము

తర్కశాస్త్రమువలెనే, కేవల గణితశాస్త్రమంతయు, ననుభవాతిరిక్తమైనదే ఈ సంగతిని అనుభవవాదులగు తత్త్వవేత్తలెవ్వరును అంగీకరింపలేదు. భూగోళశాస్త్రమునుగూర్చి మనకులభించు జ్ఞానమువలెనే, గణితశాస్త్రమునుగూర్చిన మన జ్ఞానమంతయు అనుభవమునైననే ఆధారపడి యున్నదని వారు వాదించిరి మొదటి రెండు వస్తువులను, మరి రెండు వస్తువులను పదేపదే పరిశీలించి మొత్తముమీద నాలుగు వస్తువులైనవని గ్రహించినమీదట, సజాతీయములగు నే రెండు జంటల వస్తువులు కలసినను నాల్గు వస్తువులగుట నిత్యానుభవ సిద్ధమగు విషయమని వారు వాదించిరి మఱియు నిట్టి జ్ఞానము మనకు వ్యాప్తిగ్రహణవిధానము (Induction) చే లభించుచున్నదని గూడ వారభిప్రాయపడిరి కాని రెండును రెండును కలిసి నాలుగగునను మన జ్ఞానమున కిదియ యాధారమైనచో, దాని యాథార్థ్యమును గూర్చి మనము నమ్మకము గల్గించుకొనుటకు వేఱొకమార్గము ననుసరింపవలయును, 'రెండు' అను అంకెను గూర్చి నిరపేక్షముగా నాలోచింపగల్గుటకు అనేకములైన యుదాహరణములను పరిశీలించుటవసరము. కాని అప్రస్తుతమైన ప్రత్యేకోదాహరణమును గూర్చిన మన యాలోచనములను విడ ద్రొక్కుకొనగల్గిన వెంటనే, రెండును రెండును కలిసి నాలుగగునన్న సామాన్యసిద్ధాంతమును మనము గ్రహింపగలుగుదుము. మచ్చునకేదో యొక యుదాహరణము తీసికొన్న చాలును.

తదితరములైన యుదాహరణములను పరిశీలించుటనవసరము ఇదేవిషయము క్షేత్రగణితమున గూడ దృష్టాంతీకరింపబడుచున్నది సర్వత్రిభుజములకును సాధారణమగులక్షణము నొక దానిని మనము నిరూపింపగోరుచో, మనమొక త్రిభుజమును మచ్చునకు దీసికొని, దాని సామాన్య లక్షణమును హేతువిధానముచే నిర్ణయించి, దానిని తదితర త్రిభుజముల కన్వయింపజేతుము కాని తదితర త్రిభుజములలో లేని లక్షణమును మన ముదాహరింపరాదు కావున ఒక ప్రత్యేకోదాహరణమును పరిశీలించినమీదట, మనకు సామాన్యలక్షణము తేటపడును. ఎప్పటికప్పు

ఉదాహరణములు కుప్పతెప్పలుగా నుటంకించి నంతమాత్రమున, రెండును రెండును కలిసినాలుగగునన్న జ్ఞానములోని నిశ్చితత్వ మధికమగునని గట్టిగా చెప్పజాలము. కావున రెండును రెండును నాలుగగునను సిద్ధాంతమును నమ్మవలసిన యావశ్యకత బాగుగా ననిపించును ఏలన మన మెన్ని యుదాహరణములను పరిశీలించినను ఆ సిద్ధాంతమును నిరూపించుట సాధ్యముకాదు ఆయా యుదాహరణములను పరిశీలించిన పిమ్మట మనము సూత్రీకరించుకొన్నవి, కేవలము ఆ యుదాహరణములకు సరిపోవు విషయములుగనే యుండును ఆ విషయములు అయథార్థముకాని ప్రపంచమొకటి యుండిన నుండవచ్చును. కాని ఈ యథార్థ ప్రపంచమున వాని యాథార్థ్యమును తగ్గింప నెవ్వరికిని తరముకాదు ఉనికికి నవకాశముగల యేప్రపంచముననైనను రెండును రెండును కలసి నాలుగే అయి తీరును. ఇది కేవలముపేక్షింపదగిన యంశముగాదు, యథార్థమును నిరూపణయోగ్యమునునగు ప్రతి విషయమును పై సిద్ధాంతము ధృవపఱచుటచే దాని యావశ్యకతను గూర్చి నొక్కి చెప్పవలసిన యవసరములేదు

ఈ విషయము, మనుష్యులందఱును మర్త్యులేవంటి వాస్తవమై అనుభవసిద్ధమగు సామాన్య సూత్రమును పర్యాలోచించిన మీదట మఱింత విస్పష్టమగును ఈ సిద్ధాంతమును మనము విశ్వసింతుమనుట స్పష్టము ఏలన మనుష్యుడు ఒక ప్రత్యేకమగు వయఃపరిమితి నతిక్రమించి జీవించియున్న యుదాహరణము మనకు కానుపించుటలేదు. అంతేకాక మనుష్య శరీరమువంటి శరీరము నేడో రేపో నశించితీరుననుటకు శరీరశాస్త్రసంబంధములైన కారణము లనేకములు గలవు రెండవకారణమును మనమంతగా పట్టించుకొనకపోయినను కేవలము మనుష్యుని మర్త్యత్వమును పురస్కరించుకొని మనకు కలిగిన యనుభవమును పర్యాలోచించినను, ఒక్క మనుష్యుడు మరణించిన యుదాహరణమును పరిశీలించి మనము సంతృప్తి పడరాదు కాని రెండును రెండును నాలుగగునన్న యుదాహరణములో, ఒక్క యుదాహరణమును జాగ్రత్తగా పరిశీలించిన చాలును. తదితరములగు నుదాహరణములకుగూడ పై సూత్రమే యన్వయించును కాని కొంత జాగ్రత్తగ విచారించిన పిమ్మట, మనుష్యులందరును మర్త్యులేనా అన్న విషయమే సందేహాస్పదమగును మర్త్యులుకాని మనుష్యులు గలిగిన ప్రపంచము నొకదానిని, రెండును, రెండును కలిసి అయిదుగా పరిగణింపబడెడి ప్రపంచము నొకదానిని ఇట్లు రెండు వేర్వేఱు ప్రపంచములను ఊహించుకొనుటకు ప్రయత్నించిన నీ విషయము స్పష్టమగును మృతియన్ననేమో యెఱుగని జాతియొకటి యుండుట కవకాశము గలదని స్విఫ్ట్ మనలను హెచ్చరించునపుడు మనమా విషయమును మన యూహకు నొదుగునట్లు చేసికొనగలము.

కాని రెండును రెండును కలసి నాల్గుగ పరిగణింపబడెడి ప్రపంచము విషయమై మనము వేఱొకస్థాయిలో పర్యాలోచింపవలసియుండును. అట్టి ప్రపంచమొకటి యుండుటయే సంభవించినచో, మనకుగల విజ్ఞానభవన మంతయు మూలమట్టముగ కూలిపోవును మనకప్పుడు ప్రతి విషయమును సందేహాస్పదముగనే తోచును

రెండును రెండును నాలుగగునన్న సులభగ్రాహ్యములగు గణితశాస్త్ర నిర్ణయముల విషయమున, హేతుశాస్త్రమునకు సంబంధించిన తదితర నిర్ణయముల పట్లను, ఉదాహరణములను బట్టి సామాన్య సిద్ధాంతములను మనము గ్రహింపగలము కాని సామాన్యసిద్ధాంతము నవగతము చేసికొనుటకు ప్రత్యేకోదాహరణ మవసరమే కాన సామాన్యవిషయమును బట్టి విశేషాంశమును, సామాన్యవిషయమును బట్టి సామాన్య విషయమును ఊహించుటకు నవకాశమిచ్చు నిగమనవిధానము నందును, అట్లే విశేషాంశమునుబట్టి విశేషాంశమును, విశేషాంశమునుబట్టి సామాన్య విషయమును ఊహించుటకు నవకాశమొసగు వ్యాప్తిసాధక విధానమందును యథార్థమైన యుపయోగము గలదు, అసలు నిగమన విధానమున క్రొత్తవిషయము ఏమైన తెలిసికొనుటకు వీలున్నదాయన్న విషయమై తత్త్వచింతకులలో పెద్దచర్చగలదు కొన్ని సందర్భములలో నైనను ఆ విషయము యథార్థమని మనము గ్రహింపగలము రెండును రెండును కలసి నాలుగగునన్న విషయము మన కదివరకే అవగతమైనచో బ్రౌన్, జోన్స్ అను వారిద్దరు వ్యక్తులనియు, అట్లే రాబిన్సను, స్మిత్ అను వ్యక్తులు మఱి యిఱువురు వ్యక్తులనియు నవగతమైనచో, బ్రౌను, జోన్సు, రాబిన్సను, స్మిత్ అందరును కలిసి నలువురు వ్యక్తులనియు, మనకవగతమగును ఇది క్రొత్తవిషయమే, ఇది వెనుకటి హేతువాక్యములలో లేనిది ఏలన రెండును

రెండును కలసి నాలుగగునన్న సిద్ధాంతమును బట్టి స్మిత్, జోన్సు. రాబిన్సన్, బ్రౌన్ అన్న వ్యక్తులున్నారన్న విషయము మనకు తెలియదు ప్రత్యేకములగు హేతువాక్యములు అట్టివారు నలువురున్నారని తెలుపవు కాని నిగమనము మాత్రమీ రెండు విషయములను తెలుపును.

కాని మనుష్యులందఱును మర్త్యులే, సోక్రటీసు మనుష్యుడు. కాన సోక్రటీసుమర్త్యుడు అన్న హేతుశాస్త్ర ప్రసిద్ధమైన నిగమనోదాహరణమునే పర్యాలోచించినచో నీ జ్ఞానములోని సూత్నత్వము విషయమై మనకంత నమ్మకము కుదురదు ఈ సందర్భములో మన కొక్కటె నిస్సందేహముగా తెలిసినది A, B, C అని వ్యవహరింపబడెడి వ్యక్తులు మర్త్యులు ఏలన వారు మరణించిరి సోక్రటీసు ఇట్టి మనుష్యులలో నొకడైనచో, సోక్రటీసుగూడ బహుశా మర్త్యుడే అన్న విషయమును గ్రహించుటకు, మనుష్యులందఱును మర్త్యులే అన్న సామాన్య సిద్ధాంతము నాధారముగాగొనుట డొంకతిరుగుడుగా బోవుటయే

సోక్రటీసు ఇట్టి మనుష్యులలో నొకడు కాకున్నను, A, B, C అను వ్యక్తుల యుదాహరణములను పరిశీలించి, వెంటనే సోక్రటీసుగూడ బహుశః మర్త్యుడే అన్న విషయమును సాధించుట తేలిక ఏలన మనుష్యులందఱును మర్త్యులే అన్న విషయములోని సంభవత యధికము. మనుష్యులందఱును మర్త్యులైనచో, సోక్రటీసు కూడామర్త్యుడేయగును కాని సోక్రటీసుమర్త్యుడైనంతమాత్రమున మనుష్యులందఱును మర్త్యులే యన్న విషయము సాధింపబడదు కావున నుదాహరణ విధానము నాధారముగా గొనినప్పుడే సోక్రటీస్ మర్త్యుడన్న విషయమున నిశ్చితత్వము నధికముగా సాధింపగలము

కావున రెండును రెండును నాలుగువంటి యనుభవాతిరిక్తములగు సామాన్య ప్రమేయ వ్యాకములకును, మనుష్యులందఱును మర్త్యులే యన్న యనుభవసిద్ధమగు సామాన్యసూత్రము లకును గల భేదమునిది దృష్టాంతీకరించును. మొదటితెగకు జెందిన ప్రమేయవాక్యముల విషయములో నిగమనవిధానమే అనుసరణీయము. కాని రెండవ తెగకుజెందిన ప్రమేయవాక్యముల విషయములో ఉదాహరణపద్ధతియే శరణ్యము ఏలన మనము తేల్చుకొన్న విషయములో నెంత వఱకు నిజముగలదో ఆ విధానము ననుసరించి తేలికగా దెలిసికొనవచ్చును సామాన్య సిద్ధాంతములలో నిజానిజములకంటె ప్రత్యేకోదాహరణములోని నిజానిజములను నిర్ణయించుట తేలిక

ఇంతవరకును, అనుభవాతిరిక్తములని ప్రసిద్ధి కెక్కిన ప్రమేయవాక్యములు కొన్ని గలవని యును, వానిలో హేతుశాస్త్రమునకును, కేవల గణితశాస్త్రములకు సంబంధించిన ప్రమేయవాక్యములును • ధర్మశాస్త్రమునకు సంబంధించిన ప్రధానప్రమేయవాక్యములును గలవని మనము తెలిసికొంటిమి తరువాత మనము విచారింపవలసిన సమస్య యిది అనుభవాతిరిక్తమని చెప్పదగిన జ్ఞానముండుట సంభవమా? అది యునుగాక, ఉదాహరణము లనంతములుగానుండుటచే, మనమెన్నడును పరిశీలించి యెఱుగని, పరిశీలించుటకు శక్యముకూడ కాని యుదాహరణములను బట్టి సామాన్యసిద్ధాంతములను మనమెట్లు గ్రహింపగలము? ప్రప్రథమముగా కాంట్ బయలుదేరదీసిన యీ సమస్యలు చాలా క్లిష్టమైనవి. తత్త్వశాస్త్ర చరిత్రమున వానికిగల ప్రాముఖ్యము అనూహ్యము,

---

గమనిక

ఈ వ్యాసము శీర్షిక పొరపాటున 'వ్యాప్తి సాధక సిద్ధాంతము' అని అచ్చు అయినది. అదికాదు 'సామాన్య సిద్ధాంతములు' అను శీర్షికగా దీనిని చదువవలసినది

శ్రీ వేంకటేశ్వర సాక్షాత్కారము

శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి, బి. ఏ., బి. ఇడి.,

తమ సుధామధురగానము ప్రమోదుప్రమాకుల
నలరింపజేయు గాయకులతోడ
తమ రసస్ఫురితకావ్యము జాతి మనసును
కరగింపగల కవీశ్వరులతోడ
తమ భక్తి భరిత గీతము నాస్తి కత్వమున్
పారద్రోలెడు భక్తవరులతోడ
తమ ధిషణాసహాయము మహీరాజ్య ర
క్షణ గూర్చు మంత్రి పుంగవులతోడ

తమ యమోఘ ప్రతాపానలము విపక్ష
బలము నింధన మొనరించు భటులతోడ
కనులపండువు సేయుచు దనరుచుండె
సాళువ నృసింహరాజు నాస్థానసీమ.

సతతాభ్యర్చిత వేంకటేశ్వర పదాబ్జాతద్వయీ ధ్యాన సం
గత చిత్తుండు రమామనోరమణ శృంగారైక లీలాసమ
న్విత వాగ్గేయ సహస్ర దివ్యరచనా విఖ్యాతచారిత్రు డు
న్నత పీరస్థుడు తాళ్ళపాక కులరత్నం బన్నమార్యుండటన్.

చంపక గంధియొక్కతె పసందగు వేషముతో నొయారపున్
వంపుల సొంపు ప్రేక్షక జనమ్ముల నెమ్మదిఁ బారవశ్యమున్
నింపగ నన్నమార్యు రమణీయ పదంబున కుద్దిగాగ నై
లింప నటీలలామము వలెన్ బ్రకటించెను నృత్యభంగిమల్

అన్నమయ్య గానమందు మాధుర్యమో
ఆటవెలది నృత్యమందు సొగసో
పాటలో పవిత్రభావ శృంగారమో
తన్మయత్వ సిద్ధి ధన్యులైరి

రాయలు లేచి గౌరవపురస్సర మంజలి సంఘటించి వా
గ్గేయ కళాప్రవీణు దిలకించి యనెన్ "శశికొక్క పోగుగా
నాయిడినట్టి మేలి రతనాలసరమ్ము పరిగ్రహింపు మీ
నీ యనవద్య గానరస నిర్ఝరమందున నోలలాడితిన్.

"వీర రసాత్మకంబుగ కవీంద్రులు సాళువవంశగాథ లె
న్నో్న రచియించిరైనను మనోరథమొక్కటి నాకు నిల్చె శృం
గార రసప్రకర్షకముగా నను నాయకుజేసి కీర్తనల్
మీరు రచించి పాడిన ఫలించు నభీష్టము, మిమ్ము మెచ్చెదన్.

"ఏ తొలిజన్మమందు నొనరించిన పుణ్యమొ వేంకటేశ్వర
స్ఫీత వరప్రసాదము లభించె పవిత్ర కవిత్వగానముల్
ఖ్యాతలనాథ మానవులకై యవి వ్యర్థము చేయబూను ట
ల్పాతకమంచు నెంతు భగవన్నుతికే యవి అర్పితంబులా".

అని దృఢనిశ్చయుండయి యథార్థము చెప్పిన అన్నమయ్యపై
కనుగవ యెఱ్ఱజేసి అధికారమదాంధత ఆవహింపగా
మనుజవిభుండు పల్కె "నవమానకరంబుగ నేడు నిండుకొ
కొల్వున మము ధిక్కరింతువె ఎఱుంగవె మా అభిమానశౌర్యముల్.

"గానకళా రసజ్ఞులము గావున నిన్నిటు చేరబిల్చి యా
స్థానమునన్ మహోన్నతపదంబున నిల్పి అమూల్యరత్నముల్
కానుకలిచ్చి వేడుకొనగా సభలోన తృణీకరింపగా
బూనెడు సాహసంబునకు మూర్ఖుడ! పొందుము తీవ్రదండనన్."

అవనిపతి యాజ్ఞ తలదాల్చి యన్నమయ్య
కేల నినుప సంకెళ్లు బిగించినారు
గాలి వెలుతురు చొఱలేని ఖైదులోన
నీరు కూడును లేక బంధించినారు.

మనుజేంద్రు ధిక్కరించిన బీదబాపని
దురుసుతనమ్మును దూరువారు
ఇంతమాత్రమునకే యిట్టి శిక్షవిధించు
నృపతి క్రౌర్యమును నిందించువారు
నిజము పల్కుటగూడ నేరమౌ నొక్కొక్క
పర్యాయమని జాలిపడెడువారు
అన్నమాచార్యుచే నవమానితుండైన
ఱేని వెఖరి సమర్థించువారు

ఏ క్షణాన నెవరికే కష్టసుఖములు
కలుగునో యటంచు దలచువారు

నైరి కొలువులోని అఖిల జనమ్ములు
దైవ నిర్ణయమ్ము తప్పదనుచు.

పరిచారికలు వీచు సురటు లేమయ్యెనో
నెమ్మేన జెమ్మటల్ గ్రమ్ముకొనియె
దివ్య కాంతుల నీను దీపమేమయ్యెనో
అంధకారచ్ఛట లావరించె
చల్లని మధురమౌ జలము లేమయ్యెనో
తడియారి నాలుక పిడుచగట్టె
షడ్రసోపేత భోజనము లేమయ్యెనో
హెచ్చుగా ఆకలిచిచ్చు రేగె

అన్నమయ్యను చెఱసాలయందు బెట్టి
అంతిపురమున కేగిన అవని పతికి
కనివిని యెఱుంగనట్టి యీ కరినశిక్ష
ఏల కల్గెనో యంచు చింతించిరపుడు.

ఎన్నాళ్ళనుండియో సున్నమే యెఱుగని
ఖైదుగోడలు తెల్లగా వెలింగె
ఏనాడు కడుగుట యెఱుగని నేలపై
పరిశుభ్రముగ రంగవల్లు లమరె
సతత దుర్గంధపూరితమైన చోటెల్ల
అగరు ధూపపుమేలి పొగలునిండె
కమలాప్తకిరణ దుర్గమమైన గదిలోన
జాజ్వల్యమాన తేజస్సు విరిసె

అన్నమయ్య కేలనున్న శృంఖలములు
పొలుపు మీర పసిడి భూషలయ్యె
పూలు పండ్లు గలిగి పూజాగృహంబయ్యె
భక్తవత్సలుని ప్రభావమేమొ

న్యాయాన్యాయ విచక్షణ
చేయక భూసురుని ఖైదుచేసిన నేరం
బే యిట్లు ప్రతిఫలించిన
రాయలు ఖైదునకు సత్వరమ్మున నేగన్.

నవరత్నఖచిత సుందరతర కోటీర
రాజితమైనట్టి మూర్ధమ్ముతోడ
నీలమేఘద్యుతిఁ గ్రాలు నెమ్మోముపై
నమరెడు నూర్ధ్వపుండ్రములతోడ
శ్రీవత్స కౌస్తుభ క్షీరాబ్ధికన్యకా
రంజిత వక్షస్థలమ్ముతోడ
భాసుర శాతకుంభ ప్రభాజాలమ్ము
రంగారు దివ్యచేలమ్ముతోడ

మ్రొక్కుల పరిగ్రహించి సమ్యక్కృపా క
టాక్షవీక్షణముల నభయంబొసంగి
ఆర్తులను బ్రోచు కరుణైకమూర్తి వేంక
టేశ్వరస్వామి ప్రత్యక్షమయ్యెను నృపతికి.

తన యొనర్చిన అపరాధమునకు వగచి
దీనుడై క్షమాభిక్ష నర్థించెరాజు
అన్నమాచార్యు డెంతో స్నేహమ్ము నెఱపె
ధన్యులై రిర్వురును దివ్యదర్శనమున.

శ్రీ భరతముని ప్రణీత
నాట్యశాస్త్రమ్

❖

ఆంధ్రభారతి

డాక్టర్, శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం. ఏ., ఎం. లిట్, పి. హెచ్. డి.

చతుర్థోఽధ్యాయః—తాండవలక్షణమ్

64. నిస్తంభితము

పృష్ఠతః కుంచితః పాదో వక్షశ్చైవ సమున్నతమ్
తిలకేచ కరః స్థాప్య స్తన్నిస్తంభిత ముచ్యతే ౧౨౩

వెనుకకు కుడిపాదమును కుంచించి, వక్షమును నిర్భుగ్నముగా స్థబ్దముగా నిమ్నపృష్ఠముగా నుంచవలెను ఖటకాముఖ హస్తముయొక్క నడిమివ్రేలితో లలాటమున తిలకమును పెట్టుచున్నట్లు చూపవలెను. ఎడమపాదముతో భూమిని ఘట్టించవలెను. ఈ నిస్తంభితకరణము మహేశ్వరాభినయ విషయక మైనది.

65. విద్యుద్భ్రాంతము

పృష్ఠతో వలితం పాదం శిరో ఘృష్టం ప్రసారయేత్
సర్వతో మండలావిద్ధం విద్యుద్భ్రాంతం తదుచ్యతే ౧౨౪

ప్రక్కనుండి వెనుకకు వర్తులము వలె పాదములనుతిప్పుచు, శిరఃసంశ్లేషము చేయుచు, తద్ద్వారా అన్నివైపుల మండలమువలె తిరిగి పాదమును కుంచించవలెను. మెరపువలె పాదము భ్రమించుటచే కలుగు విద్యుద్భ్రాంత కరణమును ఉద్ధతగతి పరిక్రమాది విషయమున ప్రయోగించవలెను.

66. అతిక్రాంతము

అతిక్రాంత క్రమం కృత్వా పురస్తాత్ సంప్రసారయేత్
ప్రయోగవశగా హస్తా వతిక్రాంతే ప్రకీర్తితౌ ౧౨౫

ఎడమ కాలి మడమవద్ద కుడిపాదమును కుంచించి, ఎత్తి నాలుగు తాలముల దూరముచాచి, పూర్వకాయము క్రిందకు పడునట్లు చేయగా వచ్చు అతిక్రాంతా చారీని ప్రయోగించి, ఎడమపాదమును ముందుకు ప్రసరించవలెను. ప్రయోగము ననుసరించి హస్తములను పట్టవలెను. ఈ అతిక్రాంత కరణము గతిపరిక్రమాది విషయమున ప్రయోగింప వలెను.

67. వివర్తితకము

ఆక్షిప్తం హస్త పాదంచ త్రికంచైవ వివర్తితమ్
ద్వితీయో రేచితో హస్తో వివర్తితక మేవ తత్, ౧౨౬

కుడిపాదమును, కుడిచేతిని ఆక్షిప్తముచేసి భ్రమరికాచారీతో త్రికోణాకార

మైన కాలిని త్రిప్పవలెను ఎడమచేతిని హంసపక్షముగా నుంచి వేగముతో కంపింప జేయగా వివర్తితక మను కరణము వచ్చును.

68. గజక్రీడితకము

కర్ణేఽంచితః కరో వామో లతాహస్తశ్చ దక్షిణః
దోలాపాద స్తథాచైవ గజక్రీడితకం భవేత్ ౧౨౭

సమున్నతమైన లతాహస్తముగు కుడిచేతిని ఒక ప్రక్కనుండి మరియొక ప్రక్కకు ఊపుచు త్రిపతాకగా నెడమచేతిని చెవివద్ద నుంచగా కరిహస్తము లభించును ఈ త్రిపతాకాహస్తమును అంచిత క్రియావిష్టముగా చేసి దోలాపాదాచారీని ప్రయోగించగా గజక్రీడితక మను కరణము వచ్చును. అంచితక్రియావిష్ట మనగా అంగపర్యాయము కావలె నని అర్థము గజక్రీడావిషయమున నీ కరణమును ప్రయోగించ వలెను.

69. తలసంస్ఫోటితము

ద్రుత ముత్క్షిప్య చరణం పురస్తా దథ పాదయేత్
తలసంస్ఫోటితౌ హస్తౌ తలసంస్ఫోటితే మతౌ ౧౨౮

అతిక్రాంతాచారీతో గాని, దండపాదాచారీతో గాని, పాదమును వేగముతో ఎత్తి, ఆక్షిప్తముచేసి, ముందుకు వేయవలెను. అదేసమయమున పతాకహస్తములను పట్టి రెంటిని కలుపగా తలసంస్ఫోటిత కరణము వచ్చును.

70. గరుడప్లుతకము

పృష్ఠప్రసారితౌ పాదౌ లతా రేచితకౌ కరౌ
సమున్నత మురశ్చైవ గరుడప్లుతకే భవేత్ ౧౨౯

వృశ్చికచరణము వలె కుడిపాదమును వెనుకను ప్రసారించి, కుడిచేతిని లతాహస్తముగ నుంచి, హంసపక్షమగు ఎడమచేతిని వేగముతో కంపింపజేయవలెను. ఇట్లే ఎడమపాదమును వృశ్చికచరణమువలె సాచి, ఎడమచేతిని లతాహస్తముగ నుంచి, హంసపక్షమగు కుడిచేతిని వేగముతో కంపింపజేయవలెను ఇట్లు చేయునప్పుడు వక్షము బాగా ఉన్నతముగా నున్నట్లు కన్పించగా గరుడప్లుతకమను కరణము రాగలదు గరుడుని ఎగురుటను అభినయించుచో దీనిని ప్రయోగించవలెను.

71. గండసూచీ

సూచీపాదోన్నతం పార్శ్వ మేకో వక్షః స్థితః కరః
ద్వితీయ శ్చాంచితో గండే గండసూచీ తదుచ్యతే. ౧౩౦

కుడిమడమను పైకిఎత్తి, బొటనవ్రేలి చివరిభాగమును ముందుకు చూపుచు, ఎడమపాదమును స్వాభావికముగా నుంచిన సూచీపాదమగును అప్పుడు కుడిచేతిని రొమ్మువద్ద ఖటకాముఖముగానుంచి, ఎడమ అలపల్లవహస్తమును గండస్థలమువద్ద అంచితము కావింపవలెను.



64



65



66



67



68



69



70



71



72


73


74


75


76


77


78


79


80


81

72. పరివృత్తము

ఊర్ధ్వాపవేష్టితౌ హస్తౌ సూచీపాదో వివర్తితః
పరివృత్త త్రికంచైవ పరివృత్తం తదుచ్యతే ౧౩౧

వక్షమునుండి వ్యావర్తిత కరణముతో లలాటమునకు పతాకలను తీసికొని పోయి, ప్రక్కకు తెచ్చి, మండలమువలె త్రిప్పుచు ప్రసారించగా వచ్చు ఊర్ధ్వమండల హస్తములను ప్రయోగించుచు, కుడి కాలితో సూచీపాదమును పట్టవలెను. అపుడు బద్ధాచారీని ప్రయోగించగా అన్యోన్య జంఘాసంవేధతో స్వస్తిక, ఊరువలనము రాగలవు ఇది విచిత్రరూపమున ఎడమ కాలితో రాగలదు అప్పుడు భ్రమరి కాచారీతో త్రికపరివర్తనము చేయగా పరివృత్తమను కరణము సిద్ధించగలదు

73. పార్శ్వజాను

ఏకః సమస్థితః పాద ఊరుపృష్ఠే స్థితోఽపరః
ముష్టిహస్తశ్చ వక్షఃస్థః పార్శ్వజాను తదుచ్యతే ౧౩౨

ఒక పాదమును సమముగా నుంచవలెను రెండవ కాలి ఊరుపృష్ఠము ముందుకు వచ్చునట్లు ప్రక్కకు త్రిప్పవలెను అప్పుడు హృదయమువద్ద ముష్టిహస్తమును నడుమువద్ద అర్ధచంద్ర హస్తమును ఉంచగా పార్శ్వజానుకరణము రాగలదు.

74. గృధ్రావలీనకము

పృష్ఠప్రసారితః పాదః కించి దంచిత జానుకమ్
యత్ర ప్రసారితౌ బాహూ తత్ స్యాద్ గృధ్రావలీనకమ్ ౧౩౩

ప్రక్కనుండి వెనుకకు కాలినిసాచి, బొటనవ్రేలిపై నిలచి,జానువును కొద్దిగా అంచితము చేయవలెను రెండు ప్రక్కల లతాహస్తములను ప్రసరించగా గృధ్రావలీనకమను కరణము వచ్చును. గద్దను నిరూపించునపుడు దీనిని ప్రయోగించవలెను

75. సన్నతము

ఉత్ప్లుత్య చరణౌ కార్యా వగ్రతః స్వస్తికస్థితౌ
సన్నతౌచ తథా హస్తౌ సన్నతం తదుదాహృతమ్ ౧౩౪

అతిక్రాంతచారీలో చెప్పబడిన కుంచితపాదమును ఎత్తి, ఎగిరి క్రింద పడవేయవలెను. అప్పుడు అంచితపాదము జంఘాప్రదేశమున ఉంచిన విదూషకగమనమును తెలుపు హరిణప్లుతాచారీ రాగలదు ఈ చారీతో ముందుకు ఎగురుచు, పాదములను స్వస్తికగా పట్టి దోలాహస్తముల నభినయించగా సన్నతమను కరణము రాగలదు. అధమపాత్రలు సమీపించుటను తెలుపుటకీ కరణమును ప్రయోగింపవలెను

76. సూచీ

కుంచితం పాదముత్క్షిప్య కుర్యా దగ్రస్థితం భువి
ప్రయోగవశగౌ హస్తౌ సా సూచీ పరికీర్తితా ౧౩౫

కుంచితమైన పాదమును ఎత్తి, జానుపర్యంతము జంఘాభాగమును ప్రసారించి

పాదము ముందుభాగము క్రిందపడునట్లుగా వేయవలెను. ప్రయోగము ననుసరించి హస్తములను పట్టగా సూచియనుకరణము రాగలదు.

77. అర్ధసూచి

అలపద్మః శిరోహస్తః సూచీపాదశ్చ దక్షిణః
యత్ర తత్కరణం జ్ఞేయ మర్ధసూచీతి నామతః. ౧౩౬

శిరఃక్షేత్రమున కుడిచేతిని అలపద్మముగా నుంచి. కుడికాలితో సూచీకరణమున చెప్పబడిన సూచీపాదమును ప్రయోగించగా అర్ధసూచీకరణము వచ్చును.

78. సూచీవిద్ధము

పాదసూచ్యా యదా పాదో ద్వితీయస్తు ప్రవిధ్యతే
కటి వక్షఃస్థితౌ హస్తౌ సూచీవిద్ధం తదుచ్యతే ౧౩౭

కుడిపాదపు మడమవద్ద ఎడమపాదము నుంచి, కుడిపాదమును సూచీపాదముగా చేసి, తర్వాత ఎడమపాదమును గూడ నిట్లే చేయవలెను అప్పుడు పక్షవంచితక హస్తమునుగాని, అర్ధచంద్రహస్తమునుగాని నడుమువద్ద పట్టి, వక్షమున ఖటకాముఖహస్తము చూపవలెను రెండు పాదముల అగ్రతలములే భూమిని ఆనియుండవలెను. ఈ సూచీవిద్ధకరణమును చింతావిషయమున ప్రయోగించవలెను.

79. అపక్రాంతము

కృత్వోరు వలితం పాద మపక్రాంతక్రమం నయేత్
ప్రయోగవశగౌ హస్తౌ వపక్రాంతం తదుచ్యతే ౧౩౮

బద్ధాచారిలో చెప్పబడిన ఊరువలనము గావించి తర్వాత కుంచితపాదమును పైకి ఎత్తి ప్రక్కన వేయగావచ్చు అపక్రాంతాచారీ నిటప్రయోగించవలెను. తదుపరి అన్యోన్య జంఘాసంయోగముతో స్వస్తికనుపట్టి ఊరువలిత బద్ధాచారీని ప్రయోగించవలెను ప్రయోగము ననుసరించి హస్తములను చూపగా అపక్రాంతమను కరణము రాగలదు

80. మయూరలలితము

వృశ్చికం చరణం కృత్వా రేచితౌ చ తథా కరౌ
తథా త్రికం వివృత్తంచ మయూరలలితం భవేత్ ౧౩౯

వృశ్చికపాదమును పట్టి, హంస పక్షహస్తములను వేగముతో కంపింపజేయవలెను పాదమును తొడవద్ద కుంచించి భ్రమరికాచారీని ప్రయోగించగా నెమలి నృత్తము ననుకరించి మయూర లలిత కరణము రాగలదు.

81. సర్పితము

అంచితా పసృతౌ పాదౌ శిరశ్చ పరివాహితమ్
రేచితౌచ తథా హస్తౌ తత్సర్పిత ముదాహృతమ్. ౧౪౦

మడమను భూమిపైనుంచి, పాదముముందు భాగమును పైకి ఉండునట్లుచేసి, వ్రేళ్ళను సాచినచో పాదము అంచితమగును. ఇట్టి అంచితమగు కుడిపాదమును రెండవ పాదమువద్దకు తీసకొని వెళ్లుచు, కుడివైపునకు తలనువంచి, హంసపక్షముగు కుడి చేతిని వేగముతో కంపింపజేయవలెను. ఇట్లు ఎడమవైపునకూడ చేయుగా, క్రముగా రెండు ప్రక్కలకు శిరస్సు వంచబడి, పరివాహిత శిరమగును. ఇట్లు సిద్ధించు సర్పితకరణమును మద్దోపసర్పణమున ప్రయోగించవలెను.

పేద రైతు

శ్రీ "సాధన"

పొలముల పంటలక్ష్మి నగుమోమున నీయిలు నాల్గుమూలలం
గొలువును దీర్చె, సౌఖ్యములకుం గొదువేమిక? రైతురాజ!, నీ
కలిమికి లోకమంతయును కన్నులు కుట్టె? పరాయివారి లో
గిలి కరుగంగనీయకుమ, కీడుదలంతురు మేలు పొందియున్.

"ఇది తొలికారు పంటగద! ఇంకను నిల్పిన లాభమున్నదే?
మొదటికి మోసమేను పదిప్రొద్దులు దాటిన, మంచిబేర మీ
యదనునె"యంచు నిచ్చకము లాడు దళారుల నమ్మి మోసపో
యెదవు సుమీ, యమాయకుడ! యీగతి యెప్పుడు తప్పుసోదరా?

మోటకు నెద్దులం గొనగ ముద్దుల కూతురు పెండ్లికట్నమున్
పీటలమీద పోయగను, పిండికి, కల్పుకు, విత్తనాలు, సా
పాటుకు జేసినట్టి ఋణభారము వడ్డికి వడ్డితోడ నీ
పాటికి యెంత హెచ్చినదొ? పాప మదెట్టుల దీర్తువో గదా!

పొడవున నేటికష్టమొక మూలకు దెత్తువు, ఏమిలాభమా
గడియనె తగ్గిపోవుధర, కావున నీ ఋణదాత యూరకుం
డడు, పెనుబాము కప్పల తటాలున పట్టక నెట్టివేయునా?
చిడిముడిపాటు తప్పదొకొ! చీకటి వెన్నెల బారద్రోలునా?

ఎండకు వానకోర్చి కృషియే గతిగా పొలమందు రేవగల్
కండలు పిండు జీవుల మొగంబులగాయును నవ్వువెన్నెలల్
పండిన పంట జూచి: తమ భాగ్యము చేతికి రాకపూర్వమే
దండుగమారి యప్పుల హతంబగు నింటికి నేమిదెత్తువో?

కొంపకు మూడుకొంపలయి కూలె విభక్త కుటుంబ పద్ధతిన్
దింపుడు కళ్ళమై ఋణము దీర్చగదీర్చగ నాలుగింతలై
ముంపగ కోర్టువేలమున పోయెను కొంద్రపొలంబు కాస్త జీ
వింపగ 'కోరు'భూములను పెట్టితి సేద్యమదెంత నైచ్యమో!

పేరుప్రతిష్ఠలం బ్రతికి పెన్నిధులం గడియించిరే జమీం
దారులు మీదు తాతలు! స్వతంత్రముగా బ్రతుకంగ వేరు సం
సారము బెట్టి రైతులయి చచ్చిరి తండ్రులు, నీవు రైతు, నీ
వారలు కూలివారు! కనవా పడికట్లిటు క్రిందకేగెడిన్

నిచ్చెన వ్రాలిపోయినది నేలకు, నింగికి నెప్పు డెక్కలే
వచ్చును శౌర్యమొందినను నర్ధము లేక ప్రయోజనంబులే
దెచ్చటనైన కాన చరియింపుమ గాంధిమహాత్మ త్రోవ నీ
పుచ్చిన సంఘమందు నినుబోటికి నిల్వగ స్థానమున్నదే?

నీసరివాని, బంధువును, నిన్నటి మొన్నటి పిల్లవాని, "నీ
దాసుడనంచు చెప్పుకొను దైన్యముచే తలగొట్టినట్లుగా
వీసము నిల్వచేయ పదివీసము లప్పులు; నిందులోన నీ
దోసము లేదు సంఘబలదోషమె కారణమిన్ని పాట్లకున్.

చెమ్మట దోగి సేద్యమును జేసియు చిట్టెడు గింజలేనియున్
గుమ్మము నందు గన్పడవు; కూటికి గుడ్డకు కాటకంబె. రోగ
మ్ముల మందు మాకు దిన కాసుల కెక్కడ బోదువయ్య? లో
కమ్మున నిన్ను జూచి కనికారము జూపెడు వారలుందురే!

కమతపు పెద్దయై గనిమగట్టున నిల్చియదల్చు వాని భా
గ్యమునకు మేరలేదు, మరియాదకు లోటునులేదు, రాచబో
నమరుగు ముందు, సేద్యమునె నమ్మిన బంటుకు బుగ్రయంబలే
ధుమధుమ లాడు వేడిమిని దోసిట త్రావెడు పొట్టకోసమై.

సేద్యము జిమ్మి నమ్మికను సేద్యము జేసెదు స్వామి భక్తితో,
భేదము జూపి పెద్దయని పిండు పరార్ధము స్వార్ధభక్తితో,
ఏది వినిర్మలాచ్ఛ హృది? యెద్ది హలాహలమో యెరుంగరీ
మేదిని ధూర్తులే దొరలు; మెచ్చరు నీవొక సేద్యగాడవే.

బీదల రక్తమున్ పిడిచి పిండిలి చేసిన ధాన్యరాసులన్
గాదులబోసి, వానలకు కాలుటుపెట్టక మేడ మిద్దెలం
బోదమునుంగు పెద్దలకు, పువ్వులరంగల కెట్లు తోచు అం
బేదలు కూడులేక బికు బిక్కని పంచల పస్తులుండుటల్.

కారులలో షికారు జని కంటికి నింపగు వేశ్యకౌగిటిం
జేరి వినోదకేళి పరిశీలన జేయును రేసుగుఱ్ఱముల్
వారము దప్పకుండ పురవాసము నీయజమానిసేయ, నీ
నేరమదేమొ కుక్కవలె నిద్దుర గాతువు వానియింటికిన్.

వేళకు గంజిలేక కనిపెంచిరి పెద్దలు సేద్యగానిగా.
నేలినవారి కొల్వునకె యేడు తరంబులు దాటిపోయె నీ
వేల మరొక్క కార్యమున కేగవు? 'స్వామికి ద్రోహచింత పా
పాలను మూటగట్టుట'ను భావము నీ చరితమ్ము దెల్పెడిన్.

కూటికి లేకపోయినను, కోరికలున్నను, నింటిమీది జం
జాటము లాగుచుండినను స్వామికి ద్రోహము సేయరయ్య! మీ
బోటుల బోలు నుత్తముల పూజలె పూజలు మానవాళికిన్,
బాటలు మీచరిత్రములు వర్తన మన్నది ముఖ్యమైనచో.

ఎప్పుడు తల్లినిన్ను ధరియించునొ గర్భమునందు నాక్షణం
బప్పుడె కాలకూటమున కాహుతివైతివి; పుట్టినంత నీ
యప్పకు తోడునీడ వయి యాయువు క్రుంగగ సేవ జేసియున్
అప్పులవాడు నిన్వదలడాయె; కసాయికి జాలి యున్నదే?

కాకుల గొట్టి గ్రద్దలకు గ్రాసము వేసినయట్లు నీకు వే
పాకు దినంగ బెట్టి, తమపంటల కోర్టుల, లంచగాళ్ళ పే
రాకలి దీర్చు పెద్దలకు నాదర మన్నది యెక్కడున్నదో?
లోకములోన నీబ్రతుకె లోకువ, యెప్పుడు తెల్లవారునో!

చేసిన, చాకిరింత యని చెప్పవు, చెప్పిన స్వామియొప్పునా?
పోసిన గంజియే తగదె? ముందటి యప్పులు తీరుటెట్లు? నీ
కోసమె చెల్లువేసితిని; కొంచెము భారము తగ్గుగాదె! యా
యాసము వద్దు నాపయి నటంచు వచించును వక్రబుద్ధితో.

చేతికి నోటికందనిది సేద్యము, చిట్టెడు గింజలేనియున్
నీతి నిజాయితిం దెలియనేరని స్వామి మిగుల్చ నిచ్చునా?
గోతులు త్రవ్వుచున్ పరుల కొంపలగూల్చు దురాత్మకుండు చే
జేతుల నెత్తిపైకొరవి జిమ్మెడి కాలము వచ్చు నిప్పుడే.

"తిరుపతి కేగలేదు, పలు తీర్థములందు మునుంగలేదు, కా
పురమొక యేడు సేయగనె ముద్దుల బిడ్డడు రైతుభార్యకున్;
సిరుల వెలుంగ మాకు నొక చిన్నికుమారుని నేల నియ్యవో?
పరమ దయానిధీ!" యనుచు వంతల క్రుంగుదురున్నవారలున్.

పురముల వీధియంచుల ప్రభుత్వ గృహంబుల గుళ్ళ కోటలన్
పురుడులు చేసి కాపురము బుచ్చు బికారుల వెళ్ళగొట్టలే
రరకల క్రింది కొండ్రల నమాంతము మ్రింగుచు నేటికేటికిన్
దరుమగ పేదరైత! పరతంత్రత బానిసవాడ వైతివే?

బావుల త్రవ్వి యెక్కువగ పంటలుచేయ ప్రభుత్వ మిచ్చు త
క్కావి ఋణంబు చేతికి సగంబరుదెంచును, లంచగొండి మూ
దేవుల బారిదప్పి; కడతేరునె బాధలు? పేదరైత! నీ
కేవిధమైన సౌఖ్యమొసరింపరు నెప్పుడు నమ్మకెవ్వరిన్.

చీనిజపాను పద్ధతిని సేద్యము జేయగ నెచ్చుపంట మా
గాణమొసంగునంచు కలకండల మాటల కార్యమౌనె? ఏ
గానియు నిల్వలేక కృషికార్యకలాపము లెట్లు సేయగా
నౌను? ప్రబోధమాత్రమున నార్థికదుస్థితి దీరిపోవునా?

"దున్నినవానిదే పొలము, దూరముగా యజమానిద్రోయుడీ
పన్నులు మీరె గట్టుడి, యపాయములేద"ని యూదియూది ద
ద్దన్నలు పల్లెటూళ్ళ సమరాన్ని రగిల్చిరి, పూరికొంప లిం
కున్నవె? దొమ్మియుద్ధమున నూపిరి పీల్చగ వీలుగల్గునే?

"గుత్తకు గొన్న భూములకు కోరులె పంచుటయేమి వింత? లో
కోత్తరమైన బాడవలె! యూరక జారుకొనంగ జూతురే,
గిత్తలదున్న బంపితిరె? గిద్దెడు సత్తువొసంగినారె? మా
పొత్తు నిరాకరించితిరి పొండ"ని నేలలు లాగుకొందురే.

"వెట్టికి భూములిచ్చితిమి బీదలటన్న దయార్ద్రదృష్టితో,
పొట్టలుపెంచి మాపనికె మోసము దెత్తురె? రైతులార! మీ
పట్టిన దయ్యముల్ వదలు పాలిపొలంబుల నూడబీకినన్
పట్టుడి, కొట్టుడీ" యను జవాబు నొసంగరు మూగవారలై.

గాలికి వానకున్ జెరువుగట్టును గావగ, కల్జుగొట్టగా,
చేలకు 'వత్సకూడు' నిది చీడలుపీడలు పారద్రోలగా,
చాలును సేద్యగాడ! జవసత్వములన్నియు ధారవోసినా
వేలకొ కూడుగుడ్డలకు వేదన నొందెదు? బ్రోవరెవ్వరున్.

పల్లెలలోని కక్షలకు ప్రాణము బోతురు రెండుప్రక్కలన్
బల్లిదులంచు బంధువుల బంధువులే తలగొట్టుకొందురే
కల్లకబుర్లతో తమరు కత్తులు చుట్టిన కోడిపుంజులై;
చెల్లెదరంతె! మీ ప్రభులు చీకుయుచింతయు లేక యుందురే!

మాలలు మాదిగల్ గలిసి మంచిగనుండ ప్రబుద్ధుడెవ్వడో
'మేలుకొలంబు మాలలది, మీరలు సెట్టి సమాజము'ంచు బా
కాలను బట్ట మాదిగలు కత్తులు నూరిరి; రెండువర్గముల్
చీలిరి శాశ్వతంబుగ; విశేషము కూటికి లేకపోవుటే!

శ్రీమదాంధ్ర వేదాంత పంచదశి

[పంచకోశ వివేక ప్రకరణము]

పండిత, శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి

౨౮

గుహలఁ బోలిన తత్పంచ కోశముల వ
సించు చుండిన బ్రహ్మమున్ పంచకోశ
ములను వేర్వేఱుగా చేసి తెలియనగును
గానఁ గోశ వివేక మగ్గలము వలయు.

అన్నమయమందుఁ బ్రాణ మయంబు, ప్రాణ
మయము నందునఁ దన్మనో మయము,దాని
యందు విజ్ఞాన మయ కోశ, మట్టి దాని
యందు నానంద మయ కోశ మమరి యుండు.

తల్లిదండ్రులు తిన్న యో దనము వలనఁ
గలుగు వీర్యముచేఁ గదా కలుగు దేహ,
మదియు నోదనమున వృద్ధి నందు; నదియు
బుట్టుటకుఁ బూర్వమున మఱి గిట్టు నవలఁ
దనువు నుండమి చేత నాత్మ యది గాదు.

పూర్వభవ దేహమున నాత్మ పొదలకున్న
నీ భవంబున నీ దేహ మెట్లు వచ్చె?
ముందు దేహ మందాత్మయుఁ బొదలకున్న
నీ భవపు పుణ్య పాపము లెవ్వఁడొందు?

తనువు నెల్ల నిండియు బలంబును నొసఁగుచు
నింద్రియముల నెప్పుడు ప్రోత్సహించు చుండు
అనిలమే ప్రాణ మయ కోశ మనఁగఁ బడెడు
నయ్యదియుఁ దెల్వి లేమిచే నాత్మ గాదు.

ఏ మనస్సు దేహమునందు నే ననెడు న
హము గృహాదుల మమకార మంది యుండు
ఆ మనమె మనో మయ కోశ మనఁగఁ జెల్లు
ఆత్మగా దది కామాదు లంది యునికి.

అమల చిత్ప్రతి బింబము నందియుండు
బుద్ధి, నిద్రలో లయమొంది, బోధయందు
ఆ నఖాగ్రముగా దేహ మంత నిండు
అదియె విజ్ఞాన మయ మది యాత్మగాదు.

కర్తయును కరణంబును గా గ బుద్ధి
యును మనంబును నంతః కరణ మనఁబడు
నవియె విజ్ఞానము మనోమయమ్ములగును
అవియె వెలుపలి లోపలి వైన వగును.

పుణ్యపు ఫలాను భవమును బొందువేళ
బుద్ధి బ్రహ్మము ప్రతిబింబమును వహించు,
పుణ్య ఫల భోగము క్షయంబుఁబొందు వేళ
అట్టి బుద్ధి నిద్రారూపమై లయించు.

అట్టి యానంద మయము నొకప్డె తోచు
నట్టి దగుటచే నయ్యది యాత్మ కాదు,
బుద్ధిలోఁ బ్రతి బింబము పొంది నట్టి
యనవరత మైన యానంద మాత్మయగును.

అన్న మయ కోశ మాదిగ నమల మైన
యట్టి యానంద మయ మంత మైన పరకు
ఆత్మభావము లేదంటి, వట్టు లైన
నన్య మెయ్యదియును దెలియంగఁ బడదె?
అట్టు లైన శూన్యమె యుండె నందువొక్కొ?

అనుభవింపఁగఁ బడెడు కోశాదు లెల్ల
ఆత్మయనుభవింపఁగఁ బడ దంటి వీవు,
అఖిల కోశాల నెయ్యది యనుభవించు
నయ్యదియె యాత్మ, దానిని నాపునెవఁడు?

ఆత్మ యనుభవరూపమే యగుట చేత
అనుభవింపఁ బడదది యన్యంబు చేత,
ఆత్మజ్ఞానంబుచేఁ దెలియంగ రాని
యంత మాత్రాన నాత్మ లేదనఁగ రాదు
ఆత్మ కంటె నన్యంబు లేనట్టి కతన
ఆత్మయు గ్రహింపఁబడ కుండు నట్టి దగును.

సెనగ పిండి యందునఁ దన గుణముఁ జేర్చు
పంచదారలో తీపి చేర్పంగ వేఱు
వస్తు వేమి యపేక్షింపఁ బడని యట్లు
అనుభవ స్వరూపంబయి నట్టి యాత్మ
యందు నను భవంబున కయి యన్యమైన
వస్తువేమి యపేక్షింపఁ బడక యుండు
ఆత్మయనుభవ రూపమే యగును నెపుడు

పంచదారకు తీపి గల్గించు నట్టి
దన్యమెది లేదు, మాధుర్యమందె యుండు,
ఆత్మ కనుభవ మొసఁగెడు నదియు లేదు
అను భవింపగఁ బడ దాత్మ యన్య చేత.

ఆత్మయే స్వప్రకాశము నదియె సకల
జగము కంటె ముందుగఁ బ్రకాశంబు నొందు
బ్రహ్మ మనుసరించియె సృష్టి భాసమగును
ఆత్మ చేతనె భాసంబు నగును జగము

ఎట్టి యాత్మచే నీ జగ మెఱుఁగు వారొ
అట్టియాత్మ యన్యంబుచే నరయఁ బడునె?
అన్నిటి నెఱుంగు నాత్మ నెయ్యవి యెఱుంగు
సాధనంబు లన్నియును దృశ్యముల పైని

పనికి వచ్చును దృక్కుపైఁ బనికి రావు;
కంటిచేఁ జూడఁ బడునవి కంటిఁ గనునె?
దృక్కునిన ననుభవమున నొక్కటెయగు.

ఎఱుఁగఁదగు దాని నంతను నెఱుఁగు నాత్మ
ఆత్మ కన్యుఁడై యెఱిఁగెడు నతఁడు లేడు
అనుభవ స్వరూపంబయి నట్టి యాత్మ
తెలియఁబడు దాని కంటెను దెలియఁబడని
దాని కంటెను నన్యంబు నైన దగును.

బోధ కలిగియు ననుభవమును కలుగని
యట్టి మనుజ స్వరూపుఁ డైనట్టి మట్టి
ముద్దఁ బోలిన వానిని బుద్ధి హీను
శాస్త్ర మెట్టుల బోధింపఁ జాలియుండు?

నాల్కయున్నదియా? లేద? నాకు ననెడు
పలుకదెట్టుల నవ్వుల పాలు నగునో,
అట్లె అనుభవ రూప మైనట్టి యాత్మ
తెలియఁబడలేదు బోధింపు తెలియునటుల
ననుటయెల్ల హాస్యాస్పద మగును జూవె.

ఏ పదార్థమేదియు మది నెఱిఁగి, పిదప
ఆ పదార్థాల విడువంగ నందుఁ గలుగు
స్ఫురణ మాత్రము నిల్చు, తత్స్ఫురణ మొకడె
బ్రహ్మమంచును నిశ్చయింపంగ వలయు.

పంచకోశంబుల ననాత్మ లంచు వదల
సాక్షియగు బోధమాత్రమే సావశేష
మగు, నదె తన యథార్థమైనట్టి రూప;
మట్టి యాత్మ శూన్యంబన నెట్టులొప్పు?

తానసెడు వాఁడు నుండెనా? తాను లేఁడ?
అనెడు సందేహ మెవ్వానికిని గలుగదు;
అట్టి వాఁడును నుండు నంచుందువేని
వాని తోడ వాదించెడు వాఁడు లేఁడు.

భ్రాంతిఁ జెందిన వాని కెవ్వనికొ దక్క
తనదులేమి యేనికి సమ్మతంబు గాదు,
దాని చేతనె శూన్య వాదంబు నించు
కేనియును వేద సమ్మత మేమి కాదు.

ఎవఁడు బ్రహ్మము లేదని యెంచు వాఁడొ
వాఁడె లేనట్టి వాఁడన వలసి వచ్చు,
బ్రహ్మ మెఱుఁగఁ బడ దన వచ్చుఁ గాని
తన యునికి లేదనఁగ నొప్పుకొనఁగ రాదు.

ఆత్మ యెట్టి దటంచు నీ వడిగె దేని
ఆత్మ రూప మిట్టి దటంచు ననఁగ రాదు,
ఇట్టి దనియేని మఱియది యట్టిదనియు
నేది చెప్ప సాధ్యముగాదొ, అదియె ఆత్మ.

ఇంద్రియములకుఁ గన్పింప నిట్టిదంచు
అట్లు కనరాని యట్టిచో నట్టిదంచుఁ
దెల్పనగుఁగాక, చక్షురాదికము కేమి
ఆత్మ కన్పింప కుంటచే నట్టిదంచు
ఎట్లు చెప్ప నగునొ వచియింపు మీవె
తనకు నన్యము లేమి చెప్పున దిఁకేది?

ఆత్మ యపరోక్షమొ, తెలియఁబడనిదగు,
అందుచే స్వప్రకాశ మయ్యాత్మ యగును,
ఆత్మలక్షణ మేమని యందు వేని
సత్యమును ననంతంబును జ్ఞానమగును.

ఎదియు బాధింపఁగాఁ బడ దదియె సత్య
ఎదియు బాధింపఁబడి యెడు నదియె మిథ్య
లోకమేమి లేమియు నిద్రలోనఁ గనమె
అట్టి లేమి నెఱింగెడు నట్టి వాఁడు
నొక్కడుండగ వలవదె యుర్వియందు
అట్లెఱుఁగు వాఁడె సాక్షియు ననఁగఁ బరగు
సాక్షిలేని దానిని నమ్మఁ జాలు టెట్లు?

గృహపదార్థంబులను దొలగింప వచ్చు
గృహపుటాకాశమును దొలగింప నగునె?
ఇంద్రియాదుల నిదియుగా దిదియు గా ద
టంచుఁ దొలగింప నేది శేషించి తొలఁగఁ
జేయ రాక సర్వ మెఱిఁగి చెలఁగు చుండు
నట్టి బోధయే ఆత్మయటంచు నెఱుఁగు.

అఖిలమగు ప్రపంచంబు మిథ్యయగు చుండ
ఏదియును లేదనెడు నది యేది కలదొ
అట్టిజ్ఞానమె ఆత్మయౌ, నట్టి యెడల
భాషయును లేదు, నిల్చెడు బ్రహ్మమొకఁడె.

అందువలననె శ్రుతియుఁ బ్రత్యక్షము లగు
నఖిలములు నేతి నేతి వాక్యముల చేత
ఆత్మ యిదియుఁగా దదియుఁగా దనుచుఁ దెల్పి
కంటి కగుపించనిదె యాత్మ గా వచించె

ఇదియటంచుఁ గన్పడు వస్తువేది కలదొ
అది సమస్తము నశియించు నదియె యగును;
ఇది యనుచుఁ జూపఁగా రాని దేది కలదొ
అది యనశ్వర మాత్మ యయ్యదియె సాక్షి.

బ్రహ్మమందు సత్యత్వ మబాధిత మగు
జ్ఞానపున్ స్వరూపంబును స్వయముగానె
అనుభవించెడు వాఁడయి నట్టి కతన
ఆత్మ సత్యము జ్ఞానము ననఁగఁ బరఁగు.

అంతయును నిండి యుండిన దగుట చేత
అంతమను మాట లేనిది యగుటచేత
అఖిల వస్తు స్వరూపము నగుట చేత
దేశ కాల భేదములచేఁ దెలియఁ బడక
తత్పర బ్రహ్మమున కనంతత్వ మొదవె.

ప్రకృతిచే దేశ కాలముల్ వస్తువులని
కల్పితంబు లయిన యట్టి కారణమున
అట్టి దేశాది కృతనాశ మాత్మ కేని
లేని కతన బ్రహ్మ మనంత మైన దగును.

సత్యమును ననంతంబును జ్ఞాన మైన
ఆ పరబ్రహ్మమే పారమార్థికమ్ము
బ్రహ్మమున కీశ్వరతయు జీవతయు నా యు
పాధియుగము చేనయ్యెఁ, గల్పనమె యిదియు.

అన్నిటిని నియమించెడు నట్టి దైన
యీశ్వరుని శక్తియొక్కటి యుందునుండె,
అదియె ఆనందమయకోశ మాదియైన
అన్నివస్తువులను గూఢమై యెసంగు.

సకలవస్తుధర్మముల తచ్ఛక్తిచేత
ఎపుడు నియమింపఁబడకుండు నపుడెయొక్క
వస్తు ధర్మము నన్యమై వస్తు వొంద
జగము విప్లవమొంది నాశంబు నొందు.

అట్టి శక్తి జడంబయి నట్టి దైన
అందుఁ జైతన్యమును జొచ్చునట్టి కతన
అదియు నొక్క చేతనమై యదిగఁదోచు
అట్టి శక్తి యుపాధియైనట్టికతన
బ్రహ్మమునకు నీశ్వరత కల్పనము నగును.

తనయునకుఁ బౌత్రునకు దేవదత్తుఁడొకడె
తండ్రియును దాతయునగు విధంబుగాగ
బ్రహ్మమే శక్త్యుపాధి నీశ్వరుఁడు కోశ
ముల యుపాధిచే జీవత్వమును వహించు.

పౌత్రుఁడనియు బుత్రుఁడని వివక్ష లేమి
తాతయును దండ్రియును దేవ దత్తుఁడేమి
కానటులుగ శక్త్యాదు లుపాధి కామి
బ్రహ్మమున కీశ్వరతయు జీవతయు లేదు.

ఎవ్వఁడిట్టుల బ్రహ్మము నెఱుఁగు వాఁడొ
ఆతఁడే స్వయముగ బ్రహ్మమైన వాఁడు
బ్రహ్మమున కందుచే ప్రభవంబు లేదు
అట్టి జ్ఞానియు జన్మము నందఁ డెపుడు.

జీటా

(ZETA : Zero Energy Thermonuclear Assembly)

శ్రీ వసంతరావు వెంకటరావు


౩

జీటాలో ముఖ్య భాగాలను చిత్రం1 చూపిస్తుంది. అందులో ప్రధానంగా 6అంగాలున్నాయి వాటిలో ముఖ్యమైనది '3' అది "టోరస్" (torus). మోటారు చక్రంలోనున్న రబ్బరు టైర్ మాదిరిగా ఉంటుంది టోరస్. దానిని ఎల్యూమినియంతో చేస్తారు. దానిలోవున్న గాలిని పూర్తిగా తోడేసి డ్యూటీరియం వాయువును కొద్దిగా ప్రవేశపెట్టాలి. టోరస్‌లో ఒత్తిడిబాగా తగ్గిపోవడంచేత పైనున్న వాతావరణపు ఒత్తిడికదిఅణగారిపోకుండా రెండుమూర్తులను చేసి ఒకదానిలో నింకొకటి అమరుస్తారు. పైనున్నది ఒకఅంగుళం దళసరి గల రేకుతోను, లోపలనున్నది అంగుళంలో ఎనిమిదవవంతు మాత్రమే దళసరిగలరేకుతోను చేస్తారు. టోరస్‌లోనున్నగాలిని పంపులతో పూర్తిగా తోడివేయడానికీ, కొద్దిగా డ్యూటీరియంను లోపల ప్రవేశపెట్టడానికీ, దానికి రెండు గొట్టాల నతుకుతారు. అవిప్రక్క ప్రక్కనే ఉన్నాయి '5' వాటిని చూపుతుంది.

టోరస్‌లోనున్న వాయువునుండివిద్యుత్ ప్రవాహాన్ని పంపడానికై విద్యుత్ ప్రేరణ విధానాన్ని అనుసరిస్తారని గమనించేము ఏమంటే, టోరస్‌లో విద్యున్మార్గాల (electrodes) నుపయోగించడానికి వీలులేదు, ఆ తాపక్రమానికి ఏ లోహమైనా భస్మమైపోతుంది. కాని, విద్యుత్ ప్రేరణ విధానంలో పొందగల లాభాన్ని జీటాలో పొందలేము. ప్రేరకయంత్రంలో, సామాన్యంగా, తక్కువ చుట్టలుగల తీగపై మరొకతీగెని ఎక్కువ చుట్టలు చుట్టుతారు, మొదటితీగెలో నుండి విద్యుత్ ప్రవాహాన్ని పంపినప్పుడు రెండవ తీగె చుట్టలో ప్రేరణవల్ల, ఎక్కువ ఒత్తిడి గల విద్యుత్ జనిస్తుంది. జీటాలో టోరస్ ఒక్కటే రెండవతీగె చుట్టలా ప్రవర్తించాలి. అందుచేత, లాభదాయకంగా ప్రేరణ జరుగదు. టోరస్‌లో విద్యుత్‌ను ప్రేరేపించడానికై దాని చుట్టూ చుట్టిన తీగెలు '4' వ అవయవం. పదిసెకండ్ల కొకసారి చొప్పున వాటిలోనుండి బలమైన విద్యుత్ప్రవాహాన్ని పంపుతారు. అదిప్రవహించే కాలం 1/1000 సెకండు. ఈ ప్రవాహాలు టోరస్ యొక్క అక్షువెంబడి విద్యుత్ క్షేత్రాన్ని ప్రేరేపిస్తాయి అంతమాత్రాన టోరస్‌లోనున్న డ్యూటీరియం వెంబడి విద్యుత్ప్రవహించదు. ఏమంటే డ్యూటీరియం విద్యుత్ వాహకం కాదుకదా! కాబట్టి డ్యూటీరియంలో విద్యుత్ ప్రేరేపణ జరగడానికై ఎక్కువ తరచు ధనంగల విద్యుత్ స్రావాన్ని (electrical discharge) టోరస్‌లోనికి పంపి, దానిలోనున్న వాయువు విద్యుద్వాహకమయేటట్లు ముందుగా ఏర్పాటుచేస్తారు అప్పుడు ప్రేరణవల్ల టోరస్‌లో విద్యుత్ ప్రవహిస్తుంది. అట్టి సమయంలో టోరస్‌లో ప్రవహించు విద్రుత్ప్రవాహ బలము, సుమారు 200,000 ఆంపియర్లు. అంత బలమైన విద్యుత్ ప్రవాహం వల్ల డ్యూటీరియంలో విపరీతమైన మార్పుకలుగుతుంది. అది వాయువుకంటె భిన్నంగా ప్రవర్తిస్తుంది. అందుకే దానిని "ద్రవ్యంయొక్క నాల్గవ అవస్థ" అన్నారు అట్టి వాయువుని "ప్లాస్మా" (plasma) అన్నారు

ఏ వాహకంలోనుండి విద్యుత్ప్రవహించినప్పటికి ఆ వాహకం వేడెక్కుతుంది వాహకంలో జనించువేడి దానియొక్క విద్యున్నిరోధంపైని, విద్యుత్ప్రవాహబలంపైని ఆధారపడి ఉంటుంది. అదీకాక, టోరస్ నావరించిన విద్యుత్ క్షేత్రమూలంగా మహావేగంతో గమించు ఎలక్ట్రానులు వాటి దారిలోనున్న డ్యూటీరియం కేంద్రకాలను డీకొని **వాటికి**

చిత్రాల వివరణ.




1 టోరస్‌చుట్టూ నున్న తీగె చుట్టలు వాటిలోనుండి విద్యుత్‌ను పంపినప్పుడు టోరస్ అక్షవెంబడి జనించు అయస్కాంత బలరేఖలు ప్లాస్మాలో జరుగు విద్యుత్ స్రావాన్ని దృఢపరుస్తాయి.

2 డ్యూటెరాన్లతో కూడిన వేడివాయువు టోరస్ అక్షవెంబడి పీడన ఫలితానికి లోనై మరింత వేడెక్కుతుంది.


3. టోరస్‌యొక్క పైభాగం ఒక అంగుళం దళసరిగల ఎల్యూమినియంరేకుతో చేయబడ్డది. దానిలో 1/8 అంగుళం దళసరి రేకుతో చేసినది మరొకటి ఉంది. వాతావరణపు ఒత్తిడికి కృంగిపోకుండా రక్షించడమే పైభాగంయొక్క ప్రయోజనం

4. పదిసెకండ్ల కొకసారి విద్యుత్ పంపడానికి టోరస్ కిరువైపుల చుట్టిన ట్రాన్స్‌ఫార్మర్ తీగెలు.


5 గాలిని తోడేసి డ్యూటీరియంను ప్రవేశపెట్టే గొట్టాలు.




2. స్వయం అయస్కాంతపీడన ఫలితం.



3. పీడనఫలితంలో వాటిల్లిన "కింక్" రకపు అస్థిరత్వం.



4. పీడనఫలితంలో వాటిల్లు "సాసేజ్" రకపు అస్థిరత్వం



5. స్థిరీకరింపబడిన పీడనస్రావం.


శక్తినందిస్తాయి ఈ ప్రక్రియలో డ్యూటీరియం యొక్క తాపక్రమం మరింత పెరుగుతుంది కాని, ఆ వేడివాయువు టోరస్ గోడలను తాకి వేడిని కోల్పోతుంది, దానిని అరికట్టితేతప్ప లక్షలకొలది డిగ్రీల తాపక్రమం జనించదు. అయితే, ఈ పరిస్థితిలో ప్రకృతి సహాయంచేస్తుంది అది విచిత్రమైన సంఘటన

విద్యుత్ ప్రవహించు ప్రతి వాహకాన్ని ఆవరించి అయస్కాంత బలరేఖ (magnetic lines of force) లుంటాయి విద్యుత్ ప్రవహించు దిశకు లంబదిశలో,అవెల్లప్పుడు, ఒకే కేంద్రంగల వృత్తాకారంలోనుంటాయి మనిషి పెట్టుకున్న బెల్టు ఏవిధంగానడుముని అన్నివైపులనుండి అదిమిపట్టి ఉంచుతుందో అదేవిధంగా' కనుపించని రబ్బరు బాండ్లవలె వాహకంచుట్టూఉన్న అయస్కాంతబలరేఖలు వాహకాన్ని అదిమి పట్టుకొంటాయి దానిని "పీడన ఫలితం" (pinch effect) అంటారు చిత్రం 2లో అది చూపబడింది వాహకంలో క్రిందినుండి పైకి విద్యుత్ ప్రవహిస్తున్నంతసేపు దాని నావరించిన అయస్కాంత బలరేఖలు సవ్యదిశలో నుంటూ, వాహకాన్ని నొక్కి పట్టుకొంటాయి, వాహకం తీగెఅయినప్పుడా ఫలితం కనిపించదు కాని, అదే పాదరసం వంటి ద్రవమో ఉదజని వంటి వాయువో అయినప్పుడు కొంత వరకు ఫలితం కనిపిస్తుంది, ఎట్లంటే, పాత్రలోనున్న ద్రవంగాని, వాయువుకాని పాత్ర మధ్యకు లాగబడుతుంది ఈ బలం ఎలక్ట్రానుల మీదనే కాక అయనులమీద కూడ ప్రవర్తించి, వాయువుని పాత్రమధ్యమందే—అక్షు వెంబడి—ఉంచడానికి ప్రయత్నిస్తుంది. చిత్రం 2లో వాహకం వాయువే అనుకొంటే విద్యుత్ ప్రవాహానికి సహజమైన అయస్కాంత బలరేఖలు వాయువు చెదరి పోకుండా పాత్ర మధ్యనే ఉంచడానికి ప్రయత్నిస్తాయి


అయితే, ప్రయోగాలవల్ల తెలియవచ్చినదేమంటే ఈ పీడన ఫలితం స్థిరంగా నుండదని ద్రవవాయు రూపాలలోనున్న వాహకం పాత్రమధ్యమందే సాఫుగా తీర్చినట్లుండక మధ్యమధ్య, చెదరిపోతుంది ఆ విధంగా అస్థిరత్వం కలుగుతుంది అది రెండువిధాలు, చిత్రం 3, చిత్రం4లో చూపినట్లు. మొదటి రకం అస్థిరత్వాన్ని "కింక్" (kink) అని, రెండవరకాన్ని "సాసేజ్" (sausage) అని అంటారు ఈ రెంటిలో కూడా కొన్నిచోట్ల అయస్కాంత క్షేత్రబలం ఎక్కువ కావడం, కొన్నిచోట్ల తగ్గటం సంభవిస్తుంది ఈ అస్థిరత్వాలవల్ల వాయువు మరికొంత ఎక్కువగా చెదరిపోతుంది, దాని తాపక్రమం తగ్గుతుంది కాగా లక్షలకొద్దీ డిగ్రీల తాపక్రమాన్ని సృష్టించడానికి చేసిన ప్రయత్నం వ్యర్థమౌతుంది కాబట్టి, ఈ అస్థిరత్వాన్ని అరికట్టడం ఎంతైనా అవసరము

దానికొక ఉపాయంలేకపోలేదు టోరస్ అక్షు వెంబడి మరొక అయస్కాంత క్షేత్రాన్ని సృష్టిస్తే ఆ అయస్కాంత బలరేఖలు డ్యూటీరియంతో పెనవేసికొని, టోరస్ గోడలవైపు జరగకుండా వాయువును బంధిస్తాయి అస్థిరత్వంవల్ల గింజుకుపోతున్న వాయువును బలవత్తరంగా అక్షు వెంబడినే అదిమిపట్టి ఉంచుతూ తాపక్రమం తగ్గనీయవు దానికై టోరస్ చుట్టూ తీగెలను చుట్టి వాటిలో విద్యుత్ ప్రవాహాన్ని పంపుతారు చిత్రం 1లో అవయవం 1 ఆ తీగెచుట్టలను చూపుతాయి తీగెచుట్టలలో విద్యుత్ ప్రవహింపగానే దానివల్ల జనించిన అయస్కాంత బలరేఖల టోరస్ అక్షు వెంబడి పీడింపబడి, కొద్ది స్థలానికే అదమబడి, ప్లాస్మాతో పెనవేసికొని దానితోనే గమిస్తాయి ఈ పరిస్థితిని ప్రయోగంవల్ల రుజువుచేసేరు.


వేడిగానున్న ప్లాస్మాను ఈవిధంగా పెనవేసికొన్న అయస్కాంత బలరేఖలు సన్నని కాలువవలె నున్న వాయువును బలపరిచి, దానిలో కింక్ లు బయలుదేరకుండా వాయువుని రక్షిస్తాయి. ఆసంవిధానం చిత్రం 5లో చూడవచ్చు వాహకాన్ని ఆవరించి యున్నవి.



6. టోరస్‌లో డ్యూటెరాన్లు సంఘాతమొంది, ఫ్యూషన్ చెంది, హీలియం న్యూట్రాను ఏర్పడగా శక్తి విడుదల అవుతుంది



7. సముద్రపు నీటినుండి డ్యూటీరియంను వేరుపరచి, దానిని జీటాలో వినియోగించి, జీటాలో జనించిన శక్తిచే నేరుగా విద్యుత్తును తయారుచేయు ఏర్పాటు



8. వర్ణపటరేఖల చ్యుతి

దాని వెంబడి ప్రవహించు విద్యుత్తువలన జనించిన అయస్కాంత బలరేఖలు వాహకంలో అక్షువెంబడి నున్న అయస్కాంత బలరేఖలు వాహకంచుట్టూ చుట్టిన తీగెలలో విద్యుత్ ప్రవహించడంవల్ల జనించినవి. ఇవే ప్లాస్మాకు స్థిరత్వాన్ని సమకూరుస్తాయి. అయినప్పటికి, టోరస్‌లో వాయుప్రవాహం అక్షునుండి, ఎటో అటు, ఒకవైపు జరిగి పోయే అవకాశముంది దానిని అధిగమించ డానికి మన ప్రయత్న మక్కరలేదు ఒక ప్రకృతి సిద్ధమైన పరిస్థితి మనకు తోడ్పడుతుంది వాయుప్రవాహం టోరస్‌లో ఒకవైపు జరుగగానే విద్యుత్ ప్రవాహాలు ప్రేరేపింపబడి ప్లాస్మాను, టోరస్ గోడలవైపు రానీయకుండా అపకర్షిస్తాయి అందుచేత, ప్లాస్మా టోరస్ వైపు జరిగినప్పటికి, వెంటనే అది వెనుకకు, అంటే, యథాస్థానానికి నెట్టబడుతుంది టోరస్‌లో విద్యుత్ ప్రవహిస్తున్నంత కాలం ఈ ప్రక్రియ సాగుతుంది కాబట్టి, ప్లాస్మా చల్లబడే అవకాశంలేనట్టే కాని. విద్యుత్ప్రవాహబలం తగ్గగానే ప్లాస్మా వ్యాకోచించి వేడిని కోల్పోతుంది

ఈ విధంగా కట్టుదిట్టంచేసి డ్యూటీరియంను వేడిచేస్తే డ్యూటీరియం పరమాణు కేంద్రాల చుట్టునున్న ఎలక్ట్రానులు ఎగిరిపోతాయి వాయు పరమాణులలోనున్న ఎలక్ట్రానులు కేంద్రకంచుట్టు తిరుగుతూ, ఒక కక్ష్యనుండి మరొక కక్ష్యలోనికి గెంతినప్పుడే ఆ వాయువునుండి శక్తివెలువడుతుందని గమనించేము కాని, పరమాణు కేంద్రకం చుట్టూనున్న ఎలక్ట్రాను లెగిరిపోతే పైవిధంగా శక్తివెలువడదు కేంద్రకం దగ్గరగా పోయినప్పుడు మాత్రం ఎలక్ట్రానులు కొద్దిగాశక్తిని వెలువరిస్తాయి అందుచేత అట్టిస్థితిలో నున్న వాయువునుండి వెలువడు శక్తి దాని తాపక్రమానికి నాల్గవ ఘాతంలో కాకుండా, వర్గమూలానికిసంబంధించి ఉంటుందనికూడా గమనించేము. అందుచేత టోరస్‌లో నున్న ప్లాస్మాయొక్క తాపక్రమాన్ని ప్రత్యేకంగా కొలవాలి

సిద్ధాంతాల కనుగుణంగా నిర్మించిన జీటాలో, రమారమి, 50లక్షల డిగ్రీల తాపక్రమం జనించినట్లు అంచనా. విద్యుత్ స్రావం జరిగినప్పుడల్లా, రమారమి, 40లక్షన్యూట్రానులు బహిర్గమిస్తున్నట్లుంది కాని, ఆ తాపక్రమంలోనున్న ప్లాస్మానుండి ఇన్నిలక్షలు జనిస్తా యనుకోడానికి వీలులేదు వీటివిషయం తేల్చవలసి ఉంది

అట్టితాపక్రమంలో ఏ విధమైన ఫ్యూషన్ సంభవిస్తుందో నిర్ణయంకాలేదు. డ్యూటెరాన్ల ఫ్యూషన్‌లో జనించిన ప్రొటాన్లు, డ్యూటెరాన్లుగూడా టోరస్‌లో అక్షువెంబడి గమిస్తాంటాయి న్యూట్రన్లశక్తిని లెక్కకట్టడానికి ప్రయత్నిస్తున్నారు దాని నుండి డ్యూటెరాన్ల గమన విషయంతెలిసికోవచ్చు. ఈ న్యూట్రానులన్నీ "ఉష్ణ కేంద్రక" **(Thermo-nuclear)** ప్రక్రియ వల్లజనిస్తున్నావా? అదేనిజమైతే టోరస్‌లో విద్యుత్ ప్రవాహబలాన్ని పెంచి 250లక్షల డిగ్రీల తాపక్రమాన్ని సాధించే సరికి న్యూట్రాన్ల ఉత్పత్తి కొన్నిలక్షలరెట్లు పెరగాలి డ్యూటెరాన్ల ఫ్యూషన్ చిత్ర 6 నిరూపిస్తుంది.

టోరస్‌లో ఉదజని, డ్యూటీరియం కాక నత్రజని ఆమ్లజని కూడా కొద్దిగా నుంటాయని గమనించేము ప్లాస్మాయొక్క తాపక్రమం పెరుగుతూన్నకొద్దీ వివిధ వాయువులనుండి వెలువడు శక్తియొక్క స్వభావం, తీక్ష్ణత ఏ విధంగా మారుతాయో పరిశీలిస్తున్నారు టోరస్‌లో విద్యుత్ ప్రవాహం బలమైనకొద్దీ తాపక్రమం హెచ్చుతుంది అప్పుడు డ్యూటీరియం పరమాణువుల నుండి వెలువడు కాంతి హరించి పోతుంది, ఏమంటే, వాటి కక్షీయ ఎలక్ట్రానులుపూర్తిగా ఎగిరిపోతాయి. డ్యూటీరియం కేంద్రకాలుమాత్రమే మిగులుతాయి. తరువాత, హీలియం పరమణువుల నుండి వెలువడుకాంతి మాయమౌతుంది

హీలియం కేంద్రకాన్ని ఆశ్రయించిన రెండు ఎలక్ట్రానులు కేంద్రక బంధంనుండి విడిపోతాయి అటుపైని, నత్రజని అమ్లజని కేంద్రకాల నాశ్రయించిన ఎలక్ట్రానులు కూడా తెగిపోతూంటాయి, కాని, కొన్ని ఎలక్ట్రానులింకా పరమాణువులో నుంటాయి తత్ఫలితంగా, ఈబరువైన వాయువులనుండి వెలువడు కాంతియొక్క అల పొడవు తగ్గిపోతూండగా దృగ్గోచర కాంతి మాయమై అతినీల లోహితప్రాంతంలో శక్తి గోచరిస్తుంది. ఈ విధంగా తాపక్రమం ఇంకా పెరిగినప్పుడు ప్లాస్మానుండి వెలువడుశక్తి X-కిరణ ప్రాంతాన్ని చేరుకోవచ్చును

జీటానుండి లభించే శక్తికంటె జీటాపని చెయ్యడానికై దానికిచ్చే శక్తి చాలాఎక్కువని గమనించేము ఆ భావం దానిపేరులోనే అంతర్భూతమైయుంది Zero Energy అనుపదాలు దానికి తార్కాణం కాని, టోరస్‌లో ప్రవహించు విద్యుత్తును ఎక్కువ చేసి, ప్లాస్మాని అక్షు వెంబడి పట్టి యుంచగల అయస్కాంత క్షేత్రబలాన్ని పెంపొందించినప్పుడు 150 లక్షల డిగ్రీల తాపక్రమాన్ని ఉత్పత్తి చేయడానికి వీలౌతుంది. అది రమారమి, సూర్యగర్భపు తాపక్రమం అట్టితాపక్రమం సిద్ధించినప్పటికి ఉష్ణకేంద్రక ప్రక్రియ వల్ల జనించుశక్తి కంటె మనమే హెచ్చు శక్తిని వెచ్చించాలి అదికూడా లాభదాయకంగాదు కాని, 1000లక్షల డిగ్రీల తాపక్రమాన్ని చేరుకొనేటట్లు జీటాను వృద్ధిచేయగలిగినట్లైతే, అప్పుడు మనంవెచ్చించే శక్తితో మనకు లభించే శక్తి సమానంకావచ్చు. డ్యూటీరియమైతే 1000లక్షల డిగ్రీల తాపక్రమం అవసరం, కాని, ట్రైషియం అయితే 400లక్షల డిగ్రీల తాపక్రమం సరిపోతుంది అంతకంటె ఎక్కువ తాపక్రమాలు సాధ్యమైతే శక్తి విషయంలో మన పెట్టుబడికంటె ఆదాయం ఎక్కువౌతుంది అది లాభసాటి బేరం అది సాధ్యమైననాడు జీటానుండి లభించు శక్తిని నేరుగా విద్యుత్తులోనికిమార్చుకోగల అవకాశముంటుంది.

సముద్రపునీటిలో బరువైన ఉదజని లేక డ్యూటీరియం కొద్దిగానుండి, ప్రతీ పదిగాలన్లకి ఒక గ్రాముచొప్పున ఉంది అంటే, రమారమి 50000 భాగాలకి 1 భాగంవంతున లభిస్తుంది కాని, అదేమంత స్వల్పమైనదికాదు జీటావంటి ఫ్యూషన్ రియాక్టర్ ప్రక్కనే డ్యూటీరియంను విడదీయు యంత్రాన్ని నిర్మించి, జీటాలో లభించిన శక్తితో నేరుగా విద్యుత్తు నుత్పత్తిచేయు విధానాన్ని అవలంబించవచ్చునని శాస్త్రజ్ఞులఅభిప్రాయం ఇంతవరకు, విద్యుత్తుని జనింపచేయు డైనమోని ఆవిరిశక్తితోనో, నీటియొక్క ప్రవాహిక శక్తితోనో నడుపుతున్నారు. ఈ ప్రక్రియలో కొంతశక్తి వ్యర్థమౌతూంది కాని, జీటాలో జనించిన శక్తితో, నేరుగా, డైనమోని నడుపడానికి వీలయేటట్లుంటే ఆ సంవిధానం చిత్రం 7 లో కలదు

జీటా నిర్మాణానికి పూర్వం, రమారమి పన్నెండేండ్లపాటు ఫ్యూషన్ ప్రక్రియలమీద కృషిచేసేరు కేంబ్రిడ్జిలోని కేవెండింగ్ పరిశోధనాగారంలో పరిశీలనలు సాగిస్తూండిన విజ్ఞానులు రధర్‌ఫర్డ్, ఆలిఫాంటులు దీనికి సంబంధించిన కేంద్రకప్రక్రియలను 1934 లోనే గమనించేరు. కాని, వాటిని లాభదాయకంగా వినియోగించవచ్చునని వారనుకోలేదు ఏమంటే, అమితంగా వ్యయంచేసి సంపాదించిన శక్తి చాలా స్వల్పమౌటచేత కేంద్రక ప్రక్రియలు వినియోగించే అవకాశం లేదనుకొన్నారు.

రెండవ ప్రపంచయుద్ధం తరువాత, ఆక్స్‌ఫర్డ్ క్లారెండన్ పరిశోధనాగారంలోను, లండన్ ఇంపీరియల్ కాలేజీలోను కేంద్రక పరిశోధనలు తీవ్రంగా ప్రారంభించేరు వారి కృషిని విద్యుత్స్రావంపైని, వాయునౌకాలలో వేడివాయువుల ప్రవర్తనపైని కేంద్రీకరించేరు 1951 లో ఈ పరిశీలక బృందాలను

హార్వెల్‌లోని ఎటామిక్ ఎనర్జి అథారిటీస్ రిసెర్చ్ ఎస్టాబ్లిష్మెంట్‌కి, ఆల్డర్ మాస్టన్‌లోని అసోసియేటెడ్ ఎలెక్ట్రికల్ ఇన్‌డస్ట్రీస్ పరిశోధనాగారానికి తరలించేరు.

జీటాని నిర్మించడానికి 21 నెలలు పట్టింది దానికైన ఖర్చు 8 లక్షల పౌన్లు- రమారమి 40 లక్షల రూపాయలు. అదెందరో విజ్ఞానులు ఇంజనీయర్లు కలిసిచేసిన కృషిఫలితం. దానిలో నుత్పన్నమైన తాపక్రమాన్ని కొలవడానికి వర్ణపటగ్రాహకాన్ని వినియోగించాలని గమనించేము ప్లాస్మాయందలి అయనుల గమనంవల్ల వాటి వర్ణపట రేఖలు ఏవిధంగా మారుతాయో చిత్రం 8లో గలదు స్థిరంగా నున్న పరమాణువులనుండి వచ్చు కాంతియొక్క అలపొడవుకి అదే వర్ణపటగ్రాహకం వైపు గమించినప్పుడు, దానికి దూరంగా పోయినప్పుడు అలపొడవులో కలిగేమార్పులు తత్ఫలితంగా వర్ణపటరేఖ పొందుచ్యుతి తాపక్రమాన్ని కొలవడానికాధారం. వెయ్యి లక్షల డిగ్రీల తాపక్రమాన్ని కొలవడానికి ఇంకెట్టి విధానాల నవలంబించాలో తెలిసికోవాలి

జీటాలో లభిస్తూన్న శక్తి అత్యల్పమౌట చేత దానికి జీరో ఎనర్జి అని పేరువచ్చింది. తాపక్రమం పెరిగినప్పుడు మనం వినియోగించే శక్తి తిరిగి లభ్యం కావచ్చు. అప్పుడు దానికి ఈక్వల్ ఎనర్జి అని మార్చాలి దాని పేరప్పుడు ఈటా (EETA) అవుతుంది. దానిలో జనించు శక్తి లాభదాయకమైనప్పుడు మోర్ ఎనర్జి క్రిందిమారి, అది మీటా (META) అవుతుంది అప్పుడు విజ్ఞానుల కృషి పూర్తిగా ఫలించి శక్తి పూర్తిగా మానవాధీనమౌతుంది. అది ఇంకెంత కాలానికో చెప్పలేము

(• బ్రిటిష్ ఇన్‌ఫర్మేషన్ సర్వీసెస్ (ఇండియా)వారి సౌజన్యంతో. చిత్రాలు, వారి "జీటా" లోనివి, "ఎండెవర్" లోనివి)

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి

ఆంధ్రప్రదేశ్ ద్వితీయ పంచవర్షప్రణాళికలో భారీ, మధ్యరకం పరిశ్రమల అభివృద్ధికి రు 273.72 లక్షలు, గ్రామీణ లఘు పరిశ్రమల అభివృద్ధికి రు 1152.53 లక్షలు కేటాయించబడినవి. ఈ రెండు రంగాలలోని ప్రమాణాలను సాధించటంలో చెప్పుకోదగినంతటి అభివృద్ధి ఇప్పటికే కనిపించింది,

రాజమండ్రిలోని ఆంధ్రా పేపర్‌మిల్స్ ఉత్పత్తిని ఇప్పటికంటె పెంచి రోజుకి 50-60 టన్నుల కాగితాన్ని ఉత్పత్తి చేసేటట్లుగా ఆ మిల్స్‌ని రు 242 లక్షలతో అభివృద్ధి చేయాలని అంచనా వేయబడింది. ఈ ఖర్చులో రు 190 లక్షలు రెండవ పంచవర్ష ప్రణాళిక కాలంలో ఖర్చు పెట్టాలని, మిగిలిన రు 52 లక్షలు మూడవ పంచవర్ష ప్రణాళిక మొదటి సంవత్సరంలో ఖర్చు పెట్టాలని కార్యక్రమం వేయబడింది. ఇందుకు కావలసిన యంత్రాలు మొదలైనవాటిని సేకరించటానికి అవసరమైన చర్యలు తీసికొనబడినవి.

గూడూరులోని ప్రభుత్వ సిరమిక్ ఫ్యాక్టరీ ఉత్పత్తినికూడ పెంచే విధంగా దానిని అభివృద్ధిచేసే ప్రయత్నం జరుగుతున్నది. ఈ కార్యక్రమంలో ముఖ్యభాగమైన టన్నెల్ కిలెన్ దిగుమతి చేసికోబడింది.

తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర పేపర్ అండ్ స్ట్రాబోర్డు మిల్స్‌ని రు 2.72 లక్షల ఖర్చుతో రాష్ట్రప్రభుత్వం వశంచేసికొన్నది. ఈ మిల్లుని రాష్ట్రప్రభుత్వ వ్యాపార సంస్థగా నడపాలని, దానిలో రోజుకి 8 నుంచి 10 టన్నులవరకు స్ట్రాబోర్డు ఉత్పత్తి చేయాలని కూడ ప్రతిపాదించబడిఉంది.

లఘు పరిశ్రమలకు చేయూత నివ్వాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ ఆర్థికసహాయాన్ని వినియోగించుకొని రాష్ట్రప్రభుత్వం అనేక పారిశ్రామిక నగరాలను ఏర్పాటు చేస్తున్నది, ఆయా శాఖలలో ఉత్పత్తి యూనిట్లలో శిక్షణ ఇస్తున్నది, వ్యక్తిక రంగంలోని లఘు పరిశ్రమలకు ఋణాలను కూడ మంజూరు చేస్తున్నది, హైదరాబాద్‌లో పారిశ్రామిక నగరం ప్రారంభించబడింది, ఇదేకాక సామర్లకోట, విశాఖపట్నం, విజయవాడ, వరంగల్, నంద్యాలలోకూడ ఇలాంటి పారిశ్రామికనగరాలు ఏర్పాటు కావించబడినవి. ఖాదీ గ్రామీణ చేతి పరిశ్రమలకు అనేక విధాలైన సహాయాలు చేయబడుతున్నవి

వివిధ పద్ధతుల యంత్రాలను, వాటిని సురక్షితంగా సక్రమంగా నడిపే విధానాలను బోధించి పరిశ్రమలలో జరిగే ప్రమాదాలను తగ్గించే ఉద్దేశంతో హైద్రాబాద్‌లో పారిశ్రామిక రక్షణోత్పత్తుల సంస్థ ఒకటి స్థాపించబడింది

పరిశ్రమలలో స్వయం పరిశీలనసూత్రం రాష్ట్రంలో- బహుశా భారతదేశంలోనేనేమో మొట్టమొదటిసారిగా బియ్యం మిల్లుల పరిశ్రమలో ప్రవేశపెట్టబడింది. బియ్యం మిల్లులలో సురక్షితమైన పోటీద్వారా ఈ సూత్రం ప్రవేశపెట్టబడింది. తూర్పు, పశ్చిమ, గోదావరి జిల్లాలలో, నూటికి 90 మిల్లులు ఈ పోటీలో పాల్గొన్నవి. ఈపథకం దశలవారీగా ఇతర జిల్లాలలోకూడ ప్రవేశ పెట్టబడగలదు.

సమాచార ప్రజాసంబంధ శాఖ,
ఆంధ్రప్రదేశ్.

మాసఫలములు

సెప్టెంబరు 15 — అక్టోబరు 15

శ్రీ 'బుధ'

మేషము

(అశ్వ, భర, కృత్తి 1 పా)

గ్రహస్థితి అనుకూలం, సౌమ్యంగా జరిగి పోతూఉంటుంది కాలం, పరస్పర స్నేహానురాగ బంధములు, బాధ్యతలు, ఎక్కువగును. కారుణ్యము కదలనివ్వదు, ఆధ్యాత్మికచింతన, వైద్య, మంత్ర, శాస్త్రములందభిలాష వృత్తి, ఉద్యోగము లందనుకూలం, యత్నకార్య సాఫల్యం, పై అధికారుల మన్ననలకు పాత్రులగుదురు, గౌరవముచేకూరును. వర్తకులు తమ కృషియందు ధైర్య, సాహసములతో పురోగమించి జయమును పొందుదురు. పరిశ్రమాభి వృద్ధి, వ్యవహారజయం ధనాధిపతి వక్రస్థితిచే, ఆలస్యముగా ద్రవ్యము చేతి కందుచుండును. నూతన గృహ నిర్మాణ, ప్రయత్నములు వృత్తి ఉద్యోగముల ననుసరించి ప్రయాణములు బంధు, మిత్రులతో మృష్టాన్న భోజనములు, వినోద, విలాసాలతో కాలక్షేపము కాని ఈ రాశిలో జన్మించిన కొందఱికి అంగారకషష్టస్థితివలన ఆకస్మికంగా అనారోగ్యం ప్రయాణముల యందు ప్రమాదం, పితృహాని, మొదలగు స్వల్ప ఇబ్బందులు కలుగును.

వృషభము

(కృత్తి 2,3,4. రోహి, మృగ 1, 2 పా)

అష్టమశని అరిష్ట ప్రదుడైననూ, అగస్టు **17** నుండి బృహస్పతి రజిత మూర్తియై సప్తమస్థితిని బొందుటచే కొన్ని సత్ఫలితములు జరుగును భాగస్థులవలన లేక స్నేహితుల సహకారముతో యత్నకార్యములు సఫలములై స్వల్ప ఆదాయాన్ని చేకూర్చగలవు స్తబ్దత తొలగి, పురోగమనకు మార్గము లేర్పడును నూతన ప్రయత్నములలో జయముచేకూరును. ఇట్టి ప్రయత్నములందలి ఫలితము అక్టోబరు నాటికిచక్కగా అనుభవమునకు రాగలదు. ఈ మాసములో, వృత్తి, ఉద్యోగ వ్యాపారాది కృషులలో ఎక్కువగా మార్పు కనుపించదు కార్యకలాపము లన్నియు మిగుల మందముగా నడచుచూ యుండును. సాహితీ మార్గములలో కృషిసల్పు వారికి సాంఘిక గౌరవము, పలుకుబడి సమకూడి ఆదాయాన్నిచేకూర్చును. రవి, బుధ, శుక్రులకు సుఖస్థాన గతిచే గృహస్థజీవితము బంధుమిత్రాదులతో, మృష్టాన్న భోజనములతో వస్తు వాహన సంపత్తితో,సుఖప్రదంగా ఉండును-పంచమ,కుజ స్థితి వలన శతృపీడ, మిత్రభేదము, అవమానము సంతతికి అనారోగ్యము మొదలగు స్వల్పదుష్ఫలితములున్నూ జరుగగలవు—

మిథునము

(మృగ 3, 4 ఆరుద్ర, పున 1, 2, 3. పా)

దృఢసంకల్పము - ఉత్సాహశక్తి, నూతన కార్యాచరణకు పురికొల్పు చుండును పొంగి పొరలుచున్న హృదయావేదన ఏదో విధంగా బహిర్గత మొనర్చుటకు ప్రయత్నింతురు. విద్యావ్యాసంగము గలవారి కిది మిగుల అనుకూల మగుకాలం. తమ రచనలు ఆకర్షణీయములై గౌరవమును చేకూర్చగలవు వృత్తి, ఉద్యోగ వ్యాపార ధర్మములలో ఏర్పడియున్న అవరోధములు పూర్తిగా తొలగకున్ననూ, తృతీయమందు రవి, బుధ, శుక్రస్థితి వలన, ఈ నెలలో కొంత అనుకూలత ఏర్పడి ధనాదాయాన్ని చేకూర్చును. గొప్పవారితో స్నేహము కలుగును. ఆర్థిక ఇబ్బందులు తీరును. మంచి కార్యములకు ధనవ్యయమగు చుండును. వర్తకవ్యాపారాది కృషులలో లాభము. చతుర్ధ అంగారకుడు మంచివాడుకాదు గృహస్థ జీవితముసుఖప్రదంగా యుండదు. అభిప్రాయ భేదములతో, అనారోగ్యములతో అశాంతి. స్థిర చరాస్థుల గూర్చియు, హక్కుల గూర్చియు శతృత్వము

కర్కాటకము

(పున 4 పుష్య, ఆశ్రే,)

ఈరాశివారికి, తిరిగి బృహస్పతికి పంచమస్థితి కలుగుటచే అనుకూల పరిస్థితులు ఏర్పడును. లోగా యత్నించి ఆగిపోయిన కార్యములు సఫలము లగును. ఈ నెలలో గృహస్థ సాంఘిక సమస్యలు ఎక్కువ ప్రాముఖ్యం వహించును. ముఖ్యంగా సంతతిని గూర్చి వారి పురోభివృద్ధులకై, స్థిరధన, స్థిరవసతుల, చక్కబరచు కొనుటకై నూతన గృహనిర్మాణములకై ప్రయత్నములు జరుగును. ప్రేమానుబంధములు బాధ్యతలు ఎక్కువగును కొందఱికి వారికిగల గాఢానురాగమే దుఃఖముల పాలుజేయును-తీవ్రతరమగు, మమకారము ఆకాంక్ష పనికిరాదు-తృతీయమందు కుజరాహుస్థితి వలన వ్యవహారవిజయము శతృ పరాజయము, యత్నకార్య సిద్ధి సెప్టెంబరు

15నుండి ఉద్యోగ వ్యాపారాది కృషులు నిర్విఘ్నంగా సాగును. ఆర్థిక లాభం చేకూరును, వస్తువాహన సంపదలు అభివృద్ధి యగును-రాచకీయ వ్యవహారములలో జయం, ప్రభుత్వాదరణ స్నేహితుల గూర్చియు కొన్ని కష్టములు-మాతా పితరులలో నొకరికి అనారోగ్యం సంభవమై ప్రమాదము తప్పిపోవును - వ్యవహారికంగా ప్రయాణములు-

సింహము

(మఖ, పూఫ, ఉఫ 1 పా)

జన్మరాశియందు రవి, బుధ, శుక్రులు, స్వర్ణమూర్తిగా చతుర్థ బృహస్పతి స్థితివలన, ఈమాసమందు, అతిప్రాముఖ్య విషయములపై ఆలోచనలు కలుగును గృహస్థ సాంఘిక విషయములు ప్రాముఖ్యత వహించును. పరస్పర స్నేహానుబంధములు ఎక్కువగును. హృదయ పరివర్తన కలుగును, సాహిత్యము, కళలలో పరిశ్రమచేయు వారికి, వారిప్రయత్నములు ఫలించును, అగ్రగామిగా పూజింప బడవలయునని ఆకాంక్ష ప్రబలముగా యుండును. ధన స్థానములో, పాపులైన కుజ, రాహుస్థితివలన, ఆర్థిక పరిస్థితులు అనుకూలించవు అవసరములు తీర్చుకొనజాలక ఇబ్బందిపడవలసి యుండును రావలసిన ద్రవ్యమును గూర్చి కలహములు ఉద్యోగ, వ్యాపార కృషులు నిరాటంకముగా కొనసాగును శ్రమఅధికము ఫలితము స్వల్పము. అధ్యాపక వృత్తికల వారికిఆధిక్యత, కుటుంబములోచిక్కులు సంతతికి అనారోగ్యము. ప్రయాణములలో ప్రమాదములు.

కన్యా

(ఉఫ 2,3,4 హస్త, చిత్త 1, 2 పా)

వ్యయమందు రవి, బుధులు, శుక్రునకు వక్రగతి. జన్మ మందంగారకుడు, శనిదృష్టి వలన వృత్తి ఉద్యోగములలో ప్రతి బంధకములు, బాధ్యతలు ఎక్కువగును. చిత్త శాంతి యుండదు. వ్యాపారచింతన మీ ఆశయములను కార్యరూపములో నడిపించుటకు గట్టిప్రయత్నములు చేయుదురు, స్వప్రయత్నములు అక్కరకురావు. కాని సేవకుల, మిత్రుల, సహకారములతో అట్టివి ఫలప్రదమగును. నూతన వ్యాపారాది కృషులు కొనసాగవు జరిగిపోవుచున్న కృషులకే కొన్ని ఆటంకములు వ్యవహారిక చిక్కులు, ఆదాయముకన్న వ్యయమధికము ఆకస్మిక ప్రమాదములకు గురియై శారీరక బాధకలుగును. ప్రయాణములలో జాగ్రత్త అవసరము మాతా పితరులకు మంచిరోజులుకావు బంధుమరణము. అశుభవార్త. భాతృసమానులతో వైరము.

తుల

(చిత్త 3, 4 స్వాతి, విశాఖ 1, 2, 3 పా)

గ్రహస్థితి మిగుల అనుకూలము మీ విజ్ఞానాత్మకమగు కృషి ఫలప్రదమగును. సాహిత్యము కళలలో పరిశ్రమచేయు వారికిది మంచికాలము-బుద్ధికుశలతతో కాగలపనులు నిరాటంకముగా నెరవేరుచుండును నూతన బంధు మిత్రాదులతో మృష్టాన్న భోజనములతో సుఖంగా కాలక్షేపము చేయుదురు సాంఘిక గౌరవము-సజ్జన సాంగత్యము ఆధ్యాత్మిక చింతన-ఉద్యోగస్తులకు వేతనాభి వృద్ధి ఉన్నతాధికారుల వలన మేలును-వర్తకులకు వ్యాపారాది కృషులలో అధిక లాభమును చేకూరును. లాభదాయకమగుప్రయాణములు- కుటుంబ సౌఖ్యము-నూతన వస్త్రాభరణ ప్రాప్తి ద్వాదశ అంగారకస్థితివలన అనారోగ్యం అనవసర కార్యములకై ధన వ్యయం స్థాన చలనం ఆంతరంగిక కలహం, లేదా రహస్య శత్రుత్వం.

వృశ్చికము

(విశా 4 అనూ, జ్యేష్ట,)

వక్రత్యాగియైన బృహస్పతి జన్మరాశికి చేరుటదశము రవి బుధులు ఏకాదశమందంగారకస్థితి వలన ఈ మాసములో కొన్ని సత్ఫలితములు జరుగక పోవు, ఆటంకములతో ఆగిపోయిన పనులుక్రమమార్గములో నడచి అనుకూలించును. అధికారుల ప్రాపకం శత్రుజయం, వ్యవహారిక జయం. నూతన ప్రయత్నములు సఫలమగును వర్తక వ్యాపారాది కృషులలో ధనలాభంఉద్యోగస్థులకు వేతనాభివృద్ధితోబాటు స్థానచలనం. ఆర్థికంగా, లేక, వ్యవహారికంగా, నష్టపడిన ద్రవ్యము తిరిగి చేతికి అందగలదు. ఈ రాశిలో జన్మించిన కొంతమందికి ఆగ్రహావేశము-పట్టుదలల వలన, కార్యహాని, వుద్యమముల ననుసరించి విదేశ గమనము. విదేశ వస్తువ్యాపారస్తులకు అనుకూలము, గృహస్థ జీవితమందు మాత్రము; తఱచు అనారోగ్యములు.

ధనుస్సు

(మూల, పూషా, ఉషా 1 పా,)

జన్మ శనితోపాటు, వ్యయమందు బృహస్పతియును అశుభస్థితిని బొందుటచే ఉద్యోగ, వ్యాపారములలో సంభవమైన వ్యవహారిక చిక్కులు

మరింత ఓగువగు చుండును శారీరకశ్రమ మనోవ్యథలు తప్పవు అయినప్పటికీ ఈ మాసమందు రవి, బుధ, కోణస్థితి దశమంగారక స్థితివలన, కొంత శుభము చేకూరక తప్పదు యత్నకార్యములు అనుకూలించి చిత్తశాంతత, ఆధ్యాత్మిక వికాసము, దైవచింతన సత్కార్యాచరణ సంభవమగును ఉత్తరప్రత్యుత్తరములు అనుకూలంగా నడుచును, వ్యవహారికజయం

ఉద్యోగస్తులు పై అధికారుల ఆగ్రహావేశములకు గురియై ట్రాన్సు .రు మొదలగు ఇబ్బందులకు లోనగుదురు వ్యాపారమందు క్రమక్రమంగా అధికలాభము వ్యాపారరీత్యా, గవర్నమెంటు అధికారులవలన చిక్కులు సహితము సంభవమగును తఱచు ప్రయాణములు దూరదేశగమనం, అనారోగ్యం మాతా పితరులకు మంచి రోజులుకావు ఇష్టబంధుమృతి అశుభవార్తాదిశ్రవణము స్థానచలనం

మకరము

(ఉషా 2, 3, 4 శ్రవణ, ధని 1, 2 పా)

ఈ మాసమందు బృహస్పతి, వక్రత్యాగియై స్వర్ణమూర్తిగా ఏకాదశ స్థానమునకు వచ్చుటచే, ఆటంకములతో 'ఆగిపోయిన కార్యకలాపములన్నీ అనుకూలంగా ఆచరణలోనికి రాగలవు జీవిత పురోగమనమునకు సదవకాశము లేర్పడును వలదన్ననూ, సాంఘిక, రాజకీయ, వ్యవహారములలో పాల్గొన వలసి వచ్చును. భౌతిక ఫలాపేక్ష,అధికారవాంఛ,ప్రబలంగా యుండును అగ్రస్థానము పూజ్యత, భూ, గృహ, సంబంధమైన వ్యవహారములు అనుకూలించి ఆదాయాన్ని చేకూర్చును ఉద్యోగ, వ్యాపారాది కృషులలో యత్నించి నంతగా ఫలితము సమకూరదు ప్రయాసవలనగాని, పనులుసమకూరవు పంచమ, రాజ్యాధిపతికి అష్టమస్థితి మంచిదికాదు బాహ్యప్రవృత్తిననుసరించి అంతరంగిక ప్రవృత్తి మార్చుకొన వలసి వచ్చును ఇందులకై అపవాదులు రాకపోవు గృహస్థ జీవితము సుఖము నివ్వదు. అనారోగ్యములతో-అభిప్రాయభేదములతో అశాంతి మిత్రసహాయం

కుంభము

(ధని 3, 4 శత, పూభా 1, 2 3 పా)

మీ శక్తి సామర్థ్యములు-విజ్ఞానము బాహ్యప్రపంచములో ప్రకాశించి, వ్యాప్తిజెంది గౌరవమర్యాదలను చేకూర్చదగు అవకాశములుసంభవమగును మీ దృఢసంకల్పము, పురోగమనమునకు పురిగొల్పుతుంది సాంఘిక, రాజకీయ, సాహిత్యములగూర్చిన కార్యకలాపములే ప్రాముఖ్యత వహించును మిత్రుల సహాయ సంపత్తులు కలుగును, స్థితిగతులు అభివృద్ధి జెందును పై తెలిపిన కార్యకలాపముల గూర్చి బహిరంగ శత్రుత్వమూ సంభవమగును అష్టమ కుజ సంచారమంత మంచిదికాదు. మీ ఆరోగ్యము చెడును ఉద్యోగ, వ్యాపారాది కృషులలో అవరోధములు జూదము స్పెక్యులేషన్ లాటరీ, మొదలగునవి తగవు అనవసర ఖర్చులు, ఆర్థిక పరిస్థితులు ఇరుకున పడగలవు. తఱచు ప్రయాణములు స్థానచలనము

మీనము

(పూభా 4 ఉభా, రేవ)

అనుభవములేని కార్యకలాపాలలో ప్రవేశించి బాధలు పడగలరు మీ అంతరంగిక స్వభావానికి విరోధంగా మీ మనోబుద్ధులు పనిచేయగలవు నిర్ణయ శక్తిలోపించును అసంతృప్తి తోడనే కార్యకలాపాలన్నీ జరిగి పోవుచుండును గ్రంథకర్తలు రచయితలు భావోద్రేకముతో నవీన మార్గములలో వారి రచనలు నడిపింప జూతురు శ్రమ తప్ప ప్రయోజనం శూన్యం

ఈ నెలలో బృహస్పతి అనుకూలుడు 6వ ఇంట రవియును శుభుడే ఉద్యోగ, వ్యాపారాది కృషులు లాభదాయకం నూతన ప్రయత్నములు సఫలములగును. వ్యాపారస్థులకు నూతన వ్యాపారములలో అనుకూలంగా కంట్రాక్టు ఎగ్రిమెంట్సు జరుగును నూతన పరిశ్రమలు ప్రారంభమగును రాజకీయ విషయములలో జయము భాగ్యమందు బృహస్పతి ప్రవేశించుటచే ఆర్థిక ఇబ్బందులుతీరి క్రమక్రమముంగా అభివృద్ధి యగుచుండును నూతన వస్తువాహన సిద్ధి, శరీర అనారోగ్యం-ఇష్టబంధువులతో లేక స్నేహితులతో వైరము

గ్రంథస్వీకారము

ఈ క్రింద పేర్కొనిన గ్రంథములు మా కార్యాలయమునకు అందినవి :

భామినీవిలాసము
శ్రీ వాసిరెడ్డి వెంకటసుబ్బయ్య
వెల 3-0-0
ప్రతులకు వాసిరెడ్డి గ్రంథమాల
గుంటూరు - 2

సింహబలి
శ్రీ మోటూరు వేంకటరావు
వెల 2-0-0
ప్రతులకు యం.యస్ ఆర్. మూర్తి & కో
విశాఖపట్నం

ఆముక్తమాల్యద
(పర్యాలోకనము)
శ్రీ వెల్దండ ప్రభాకరామాత్య
వెల 6-0-0
ప్రతులకు సాహిత్యనికేతనము
248/బి, మల్లేపల్లి, హైద్రాబాదు-1

శ్రీమద్భగవద్గీత
అనువాదకులు శ్రీ హాసజ
వెల 2-0-0
ప్రతులకు రచయిత
6. యస్ ఆర్ టి బ్లాక్సు
అమీరుపేట
హైద్రాబాద్-16

నన్నెచోడుని కవిత్వము
శ్రీ అమరేశం రాజేశ్వరశర్మ
వెల 4-0-0
ప్రతులకు అజంతా పబ్లికేషన్సు
సికింద్రాబాదు.

తెరమెరుగులు
(వివిధరచయితల నాటికాసంపుటి)
వెల 1-8-0
ప్రతులకు శోభా ప్రచురణలు
విజయనగరం

మారేలోకం
వెల 1-0-0

గాలి, గ్రహాలు
వెల 1-0-0

ఆధునిక విజ్ఞానం
వెల 0-12-0

జగత్తు - జీవము
వెల 0-12-0
పై గ్రంథముల రచయిత
శ్రీ వసంతరావు వేంకటరావు,
ప్రతులకు రచయిత, సాహితీ సమితి
విజయనగరం

చరితార్థులు
శ్రీ కోన వేంకటరాయశర్మ
వెల 1-8-0
ప్రతులకు ప్రజావాణి ప్రెస్, అరండల్ పేట
గుంటూరు - 2

ప్రేమ
మూలం అశ్వనీ కుమారదత్తు
అనువాదం శ్రీ వెలువోలు సీతారామయ్య
వెల 1-0-0
ప్రతులకు రచయిత పేర
అమృతలూరు (తెనాలి తాలూకా)

హిందూమతము
వెల 2-0-0

భారతీయ వైభవము
వెల 1-0-0
పై గ్రంథముల రచయిత
శ్రీ జటావల్లభుల పురుషోత్తము, ఎం. ఏ.,
ప్రతులకు రచయిత పేర
సత్యనారాయణపురం
విజయవాడ-2

ఆంధ్ర భారతి
శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి
వెల 1-4-0
ప్రతులకు భారతీ నికేతన్
మారుతీనగర్
విజయవాడ-2

మనవారసత్వం
శ్రీ భండారు సదాశివరావు
వెల 2-8-0
ప్రతులకు భారతీ సాహితి
డాబాతోట
విశాఖపట్నం-4

మధుగీత
వెల 1-0-0

పడిపోతున్న అడ్డుగోడలు
వెల : తెలియదు
పై గ్రంథముల రచయిత
శ్రీ బోయి భీమన్న
ప్రతులకు : దేశకవితా మండలి
విజయవాడ-2

ఆనందరాయలు
వెల 1-0-0

బుద్ధయానము
వెల 1-0-0

గాంధీజీ పాదధూళి
వెల : 0-12-0
పై గ్రంధముల రచయిత
శ్రీ పిళ్ళా వేంకటరత్నకవి
ప్రతులకు : రచయిత
కొత్తపేట, విజయవాడ-1

ఖండకృతి
వెల 1-4-0

వ్యాసవాణి
వెల : 0-6-0

శ్రీ జాస్తి వేంకటనరసయ్య
ప్రతులకు రచయిత పేర
చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.

జయభేరి
శ్రీ జాస్తి వేంకటనరసయ్య
శ్రీ ధూళిపాళ వేంకట సుబ్రహ్మణ్యం
వెల 1-4-0
ప్రతులకు : జాస్తి వేంకటనరసయ్య
చిలకలూరిపేట

త్రివేణి
(పద్యకావ్య సంపుటి)
శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు
శ్రీమాన్ తి॥న॥సం॥జ॥ తిరువేంకటాచార్యులు
శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల
వేంకట రాఘవాచార్యులు
వెల 2-0-0

భ్రమరగీతలు
శ్రీమైలవరపు సూర్యనారాయణమూర్తి
వెల 1-0-0

మీరాబాయి
శ్రీ మిక్కిలినేని సుబ్బారావు
వెల 0-8-0
పై గ్రంధములు దొరుకుచోటు:
శ్రీ గోదా గ్రంథమండలి
శ్రీమన్నారాయణపురం
ఉల్లిపాడుపోస్టు, దివితాలూకా, కృష్ణాజిల్లా

దూతమత్తేభము
శ్రీ రాయప్రోలు సుబ్బారావు
వెల 1-0-0
ప్రతులకు : లలితా కుటీరమ్
41 నెహ్రూనగర్, సికింద్రాబాద్

సింగినాదం
శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్
వెల 1-8-0
ప్రతులకు : ఆంధ్ర మహిళాసభ మద్రాసు

భీమన్న కావ్యకుసుమాలు
శ్రీ బోయి భీమన్న
వెల : 3-0-0
ప్రతులకు : నవ్యసాహితీ సమితి
208, బోయగూడ.
సికింద్రాబాదు

కవిత
శ్రీ నారపరెడ్డి
వెల 1-8-0
ప్రతులకు · కవికోకిల గ్రంథమాల
పెమ్మారెడ్డిపాలెం
ఎల్లాయపాలెం పోస్టు
నెల్లూరు జిల్లా

సహకార వ్యవసాయం
శ్రీ ఆచార్యరంగా
శ్రీ పి. ఆర్ పరుచూరి
అనువాదం·
శ్రీ జాస్తి జగన్నాథం
వెల 3-8-0
ప్రతులకు · కిసాన్ బుక్ ట్రస్టు
తెనాలి

శ్రీ కృష్ణాతిమానుషతత్త్వము
(ప్రథమ ఖండము)
శ్రీమాన్ దివి రంగాచార్యులు
వెల , 5-0-0
ప్రతులకు భారత బుక్ స్టాల్
S R A మెడికల్ కాలేజి & ఓరియంటల్
హైస్కూలు బిల్డింగ్స్
గుంటూరు-2

పండిత రాజపంచామృతము
డాక్టర్, శ్రీ బూర్గుల రామకృష్ణరావు
వెల 2-8-0
ప్రతులకు ఆంధ్ర రచయితల సంఘము
హైద్రాబాద్

Edited, Printed & Published by Sri J Radhakrishna Reddy, Vijayawada-2
Printed at Nava Bharathi Press, Vijayawada-2.